ప్రతి నిత్యం తాజా వార్తలతో నిజాలు నిగ్గు తేలుస్తూ, సమకాలీన అంశాలను విశ్లేశిస్తూ మున్తాబయి మీ ముందుకు వస్తున్న అక్షరం తెలుగు దినపత్రిక

సుఫల అక్షరం
తెలుగు దినపత్రిక సామాన్యుడి అస్త్రం
Your Ad Here.
ప్రకటనలకు (అడ్వర్టైస్‌మెంట్ ) కొరకు సంప్రదించండి
EDITOR & PUBLISHER: 9391690609, OFFICE: 7893003409.
aksharamtsnews@gmail.com .... www.aksharamtelugudaily.com

www.aksharamtelugudaily.com RNI NO: TELTEL/2018/75419

# సుఫల అక్షరం

సామాన్యుడి అస్త్రం తెలుగు దినపత్రిక

SUPHALA AKSHARAM

FRIDAY 11TH SEPTEMBER 2026 EDITOR : SHAIK YACOOB PASHA PAGES : 12 VOLUME : 09 ISSUE : 177 COST : 3\- KHAMMAM, TELANGANA

శుక్రవారం 11 సెప్టెంబర్ 2026 ఎడిటర్ : షేక్ యాకూబ్ పాషా పేజీలు : 12 సంపుటి : 09 సంచిక :177 వెల : రూ.3/- ఖమ్మం, తెలంగాణ

CIRCULATED BY : ADILABAB,, A SIFABAD, BHADRADRI KOTHAGUDEM, HYDERABAD, JAGITYAL, JAYASHANKER, JOGULABMA, KAMAREDDY, KHAMMAM, MAHABUBABAD, MAHABOODNAGAR, MANCHIRYAL, MEDCHAL, MALKAJGIRI, NAGARKARNOOL, NALGONDA, NIRMAL, NIJAMABAD, RAJANNA SIRICILLA, RANGAREDDY, SANGA REDDY, SIDDIPET, SURYAPET, VIKARABAD, WANAPARTHY, WARANGAL (RURAL), WARANGAL (URBAN), YADADRI

## రంగారెడ్డి జిల్లాలో రియల్టర్ ఆత్మహత్య

హైదారాబాద్, సెప్టెంబర్ 10 హైదరాబాద్ శివారు రంగారెడ్డి జిల్లాలో విషాద ఘటన చోటుచేసుకుంది. ప్రముఖ రియల్ ఎస్టేట్ వ్యాపారి, హోమ్ ల్యాండ్ సంస్థ అధినేత రామ్ రెడ్డి ఆత్మహత్యకు పాల్పడ్డారు. కందుకూరు మండలం నెదునూరు గ్రామంలోని తన ఫామ్‌హౌస్‌లో ఆయన బలవన్మరణం చెందారు. రామ్ రెడ్డి పటాన్‌చెరు ప్రాంతంలో సుమారు 280 ఎకరాల విస్తీర్ణంలో ఒక భారీ వెంచర్‌ను అభివృద్ధి చేస్తున్నారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి కొందరు రాజకీయ నాయకుల నుంచి ఆయనపై తీవ్ర ఒత్తిడి ఉన్నట్లు ప్రాథమికంగా తెలుస్తోంది. ఆ ఒత్తిళ్లను తట్టుకోలేకే ఆయన ఈ తీవ్ర నిర్ణయం తీసుకుని ఉండవచ్చని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

# 22ఏపై బీఆర్ఎస్ విషప్రచారాన్ని తిప్పికొడదాం

- అసెంబ్లీలో చర్చించి ప్రజలకు వాస్తవాలు వివరిద్దాం
- నిషేధిత భూముల జాబితా కేసీఆర్ హయాంలోదే
- నాడు జరిగిన భూ దోపిడీని ప్రజల ముందుంచుదాం
- ఫీజు రీయింబర్స్‌మెంట్, పాలిటెక్నిక్ కాలేజీలపైనా చర్చిద్దాం
- సభ సజావుగా జరగకుండా కేసీఆర్ కుట్ర చేశారు
- పోలీసు సిబ్బందిలో కేటీఆర్‌కు నేను కనిపించినట్లున్నా..
- అందుకే ఆక్రోశంతో వారి మీద దాడి చేశాడు
- దేశంలో 15 కోట్ల ఓట్లు గల్లంతు.. సర్‌ను సీరియ్‌సగా తీసుకోండి..
- సీఎల్పీ భేటీలో సీఎం రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం
- కలిసి పనిచేస్తే కుట్రలను ఛేదించగలమని రుజువైంది: భట్టి



హైదరాబాద్, సెప్టెంబరు 10 22ఏ నిషేధిత భూముల జాబితాపై బీఆర్ఎస్ పార్టీ చేస్తున్న విషప్రచారాన్ని అసెంబ్లీలో తిప్పికొడదామని కాంగ్రెస్ పార్టీ శాసనసభాపక్ష (సీఎల్పీ) సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఈ అంశంపై ప్రజలకు వాస్తవాలు చెబుదామన్నారు. 22-ఏ జాబితా కొత్తగా వచ్చింది కాదని, కేసీఆర్ హయాంలో తీసుకొచ్చిందేనని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు వివరించారు. అసెంబ్లీలో దీనిపై చర్చ నిర్వహించినప్పుడు.. బీఆర్ఎస్ హయాంలో జరిగిన భూ దోపిడీనీ బయటపెట్టనున్నట్లు చెప్పారు. అసెంబ్లీ కమిటీ హాల్లో గురువారం జరిగిన సీఎల్పీ భేటీలో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు.. శాసనసభలో చర్చించనున్న అంశాలపైన సీఎం దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డితోపాటు డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, టీపీసీసీ చీఫ్ మహేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు. రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వం

➢ మిగతా 2వ పేజిలో..



## నూతన శకంలోకి లైఫ్ సైన్సెస్..పరిశోధనలు, ఆవిష్కరణల దిశగా అడుగులు

- 2,000కు పైగా కంపెనీలతో ఎకోసిస్టమ్
- వ్యాక్సిన్ల తయారీలో గ్లోబల్ లీడర్‌గా హైదరాబాద్
- మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కీలక వ్యాఖ్యలు
- లైఫ్ సైన్సెస్ ఆవిష్కరణల్లో నూతనాధ్యాయం
- ఎంఎస్‌డీ టెక్నాలజీ సెంటర్ ప్రారంభం

హైదారాబాద్, సెప్టెంబర్ 10 తెలంగాణ రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు గురువారం ఈ కేంద్రాన్ని ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్‌డీ డిజిటల్ హ్యూమన్ హెల్త్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ అభిషేక్ నారాయణ్ సింగ్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రితేష్ శ్రీవాస్తవ, తెలంగాణ ప్రభుత్వ ఐటీ సలహాదారు సాయికృష్ణ, తెలంగాణ లైఫ్ సైన్సెస్ సీఈవో సర్వేశ్ సింగ్‌తో పాటు సంస్థ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. హైదరాబాద్ లైఫ్ సైన్సెస్ రంగం పరిశోధనలు, ఆవిష్కరణల దిశగా నూతన శకంలోకి అడుగుపెట్టిందని హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణలో 2,000కు పైగా కంపెనీలతో సంపూర్ణమైన లైఫ్ సైన్సెస్ ఎకోసిస్టమ్ ఉందని, వ్యాక్సిన్ల తయారీలో హైదరాబాద్

➢ మిగతా 2వ పేజిలో..

## 8,283 కొనుగోలు కేంద్రాల ఏర్పాటు

- వానాకాలం ధాన్యం కొనుగోళ్లకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి
- రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోళ్లు చేపట్టాలి
- సంబంధిత శాఖల అధికారులకు సీఎస్ సంజయ్ జాజు ఆదేశం




హైదారాబాద్, సెప్టెంబర్ 10: 2026-27 వానాకాలం (ఖరీఫ్) సీజన్‌లో ధాన్యం కొనుగోళ్లకు పకడ్బందీగా

➢ మిగతా 2వ పేజిలో..

## పేదల ఆత్మగౌరవమే ఇందిరమ్మ ఇళ్ల లక్ష్యం

- రూ.5 లక్షల ఉచిత సాయం.. తెలంగాణలోనే అమలు
- రెండో విడతలో 59 వేల గుడిసెలకు ఇందిరమ్మ ఇళ్లు
- ఏ నియోజకవర్గంలోని పేదలకు ఆ నియోజకవర్గంలోనే ఇళ్లు
- ఎంపికలో డ్రాలో పారదర్శకత.. అనర్హులకు చోటు లేదు
- 8 లక్షల ఇళ్లకు ప్రభుత్వంపై సుమారు రూ.40 వేల కోట్ల భారం
- పార్టీలకు అతీతంగా అర్హులైన పేదలకు ఇళ్లు కేటాయిస్తున్నాం
- ఇందిరమ్మ ఇళ్లపై అసెంబ్లీలో మంత్రి పొంగులేటి స్పష్టీకరణ



హైదారాబాద్, సెప్టెంబర్ 10 పేదల ఆత్మగౌరవాన్ని కాపాడుతూ వారు నివసించే ప్రాంతాల్లోనే ఇందిరమ్మ ఇళ్లను నిర్మించి ఇవ్వాలన్నదే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్

➢ మిగతా 2వ పేజిలో..

## లడఖ్‌కు త్వరలోనే ప్రత్యేక హోదా..

- ఆర్టికల్ 371 సవరణకు కేంద్రం కసరత్తు

న్యూఢిల్లీ,సెప్టెంబర్ 10 గత నాలుగేళ్లుగా లడఖ్ ప్రజలు చేస్తున్న డిమాండ్ నెరవేరే సూచనలు కనిపిస్తున్నాయి. లడఖ్ ప్రాంతానికి ఆర్టికల్ 371 కింద రాజ్యాంగ పరిరక్షణలు కల్పించడానికి కేంద్ర ప్రభుత్వం అంగీకరించింది. అలాగే హిమాలయ ప్రాంతమైన లడఖ్ పాలన కోసం భారతదేశంలోనే మొదటిసారిగా 'సూయీ జెనెరిస్' నమూనాలో ఒక ఎన్నికైన పాలక మండలిని ఏర్పాటు చేయనున్నారు. ఎన్డీటీవీకి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో లడఖ్ చీఫ్ సెక్రటరీ ఆశిష్ కుంద్రా మాట్లాడుతూ.. లడఖ్‌కు తగిన రాజ్యాంగ పరిరక్షణలు కల్పించేందుకు పార్లమెంట్ ఆర్టికల్ 371ని సవరిస్తుందని తెలిపారు.లడఖ్‌కు

➢ మిగతా 2వ పేజిలో..

## రిపబ్లికన్లు గెలిస్తే ప్రతి అమెరికన్‌కు 5 వేల డాలర్లు

- అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన హామీ

న్యూఢిల్లీ,సెప్టెంబర్ 10 అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి తీవ్ర చర్చ నీయాంశమైన ప్రకటన చేశారు. రాబోయే మధ్యంతర ఎన్నికల్లో తమ రిపబ్లికన్ పార్టీ విజయం సాధించి, కాంగ్రెస్‌లోని ఉభయ సభలపై నియంత్రణ సాధిస్తే.. దేశంలోని ప్రతి వయోజన అమెరికా పౌరుడికి 5,000 డాలర్లు (సుమారు రూ.4.2 లక్షలు) ఇస్తామని డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. ఈ సంక్షేమాన్ని ఆయన "ట్రంప్ డివిడెండ్ గా పేర్కొన్నారు. టెక్సాస్‌లోని డల్లాస్‌లో జరిగిన రిపబ్లికన్ పార్టీ మధ్యంతర ఎన్నికల సభలో డొనాల్డ్ ట్రంప్ ఈ ప్రతిపాదన చేశారు. డెమోక్రాట్‌లతో పోటీలో రిపబ్లికన్ పార్టీ ఓటింగ్ సర్వేల్లో వెనుకబడి ఉన్న నేపథ్యంలో, ఓటర్లను ఆకర్షించేందుకు ట్రంప్ ఈ అసాధారణ హామీ ఇచ్చినట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ సభలో ట్రంప్ మాట్లాడుతూ.. "అమెరికా అద్భుతమైన ఆర్థిక విజయం కారణంగా ఈ హామీ నేను

➢ మిగతా 2వ పేజిలో..

# పంచాయతీల సొంత రాబడి వాటి బ్యాంకు ఖాతాల్లోకే..

- ట్రెజరీలో జమ చేయాల్సిన అవసరం లేదు
- గ్రామసభ తీర్మానంతో ఖర్చు చేసుకోవచ్చు
- అసెంబ్లీలో మంత్రి సీతక్క వెల్లడి
- చట్ట సవరణ బిల్లుకు అసెంబ్లీ ఆమోదం
- ట్రెజరీలో జమ చేయాల్సిన అవసరం లేదు
- గ్రామసభ తీర్మానంతో ఖర్చు చేసుకోవచ్చు
- అసెంబ్లీలో మంత్రి సీతక్క వెల్లడి
- పంచాయతీరాజ్ చట్టం-2018
- సవరణ బిల్లుకు అసెంబ్లీ ఆమోదం



హైదరాబాద్, సెప్టెంబరు 10 గ్రామ పంచాయతీల సొంత ఆదాయాన్ని బ్యాంకు ఖాతాల్లో జమ చేసుకునేలా రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీరాజ్ చట్టం-2018 సవరణ బిల్లును గురువారం అసెంబ్లీలో ప్రవేశపెట్టింది. సెక్షన్ 70లోని సబ్ సెక్షన్-3కు సవరణ చేస్తూ రూపొందించిన ఈ బిల్లుపై అధికార, ప్రతిపక్ష పార్టీల సభ్యులు చర్చలో పాల్గొన్నారు. సుదీర్ఘ చర్చ అనంతరం బిల్లు ఏకగ్రీవంగా శాసనసభ ఆమోదం పొందింది. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ గ్రామ పంచాయతీల సొంత ఆదాయం వాటి అవసరాలకు సకాలంలో అందుబాటులో ఉండాలని, అందుకే గ్రామసభ తీర్మానం మేరకు నిధులను ఖర్చుచేసుకునేలా చట్టానికి సవరణ చేశామని తెలిపారు. పంచాయతీకి వచ్చే ఆదాయం గ్రామాభివృద్ధికే ఉపయోగపడాలన్నారు. ఇక నుంచి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మంజూరు చేసే ఆర్థిక సంఘాల నిధులు ఎలాగైతే గ్రామ పంచాయతీల బ్యాంకు ఖాతాల్లో జమ అవుతున్నాయో, అదే మాదిరిగా సొంత ఆదాయం కూడా బ్యాంకు

➢ మిగతా 2వ పేజిలో..

# 22ఏపై బీఆర్ఎస్ విషప్రచారాన్ని తిప్పికొడదాం

వెయ్యి రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా తీసుకున్న నిర్ణయాలు, అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించేందుకు వర్షాకాల సమావేశాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ సమావేశాలు సజావుగా జరగకుండా కేసీఆర్.. ఇటీవల జరిగిన బీఆర్ఎస్ శాసనసభాపక్ష సమావేశంలో కుట్ర చేశాడన్నారు. అధికారం పోయినా అహంకారం వీడని కేటీఆర్, హరీశ్‌రావు, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు.. పోలీసులను, ప్రజాప్రతినిధులను దూషిస్తూ మూడు రోజుల పాటు సభ జరగకుండా అడ్డుకున్నారని పేర్కొన్నారు. మహిళా అధికారుల ముందు టీషర్టులు విప్పి వారికి ఇబ్బంది కలిగించారని, స్పీకర్‌ను అత్యంత అభ్యంతరకరంగా దూషించారని గుర్తు చేశారు. దీనికి వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ నిరసన చేపడితే.. దళితులు నడిచిన నేలను బీఆర్ఎస్ నేతలు శుద్ధి చేసి, వారిని అవమానించారన్నారు.

ఎస్ఐఆర్‌పై సీఎం మాట్లాడుతూ.. దేశంలో వయోజన జనాభా 103 కోట్లు ఉందని లెక్క తేల్చిన కేంద్ర ప్రభుత్వం.. ఓటరు జాబితాలో మాత్రం 88 కోట్ల మందినే చూపుతోందని పేర్కొన్నారు. అంటే, దేశంలో 15 కోట్ల ఓట్లు గల్లంతయ్యాయని.. ఎక్కడో ఏదో ప్రమాదం పొంచి ఉందని సందేహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలోనూ ఎస్ఐఆర్ పేరుతో ఓట్లు భారీగా తొలగించే కుట్ర జరుగుతోందని, ప్రతి ఒక్కరూ అర్హులైనవారి ఓటును కాపాడే అంశాన్ని సీరియస్‌గా తీసుకోవాలని సూచించారు. కొత్తగా ఎమ్మెల్యేగా గెలిచినవారు.. వన్ టైమ్ వండర్‌లుగా మిగిలిపోవద్దని, బాగా పని చేసి మరోమారు గెలిచి.. సీనియర్‌లు అనిపించుకోవాలన్నారు. ఎమ్మెల్యేల వ్యక్తిగత పనితీరు కూడా గెలుపోటములను ప్రభావితం చేస్తుందన్నారు. తెలంగాణ కులగణనను నమూనాగా తీసుకుని.. దేశవ్యాప్త జనగణనలో కులగణననూ చేపట్టాలంటూ కేంద్రంపై ఒత్తిడి తెద్దామన్నారు.కేటీఆర్‌కు పోలీసు సిబ్బందిలో తాను కనిపించినట్లున్నానని, అందుకే అంత ఆక్రోశంగా వారి మీద దాడి చేశాడని రేవంత్ చమత్కరించారు. కాంగ్రెస్ పార్టీ నుంచి ఎదిగిన సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి కాంగ్రెస్ పార్టీకే నష్టం చేయాలని చూస్తున్నారని తెలిపారు. జరిగిన ఘటనలపైన విచారణకు ఆదేశించామని సీఎం పేర్కొన్నారు. ఈ మూడు రోజుల్లో జరిగిన ఘటనలపైన ప్రజాభిప్రాయం ఎలా ఉందన్నదానిపై ఫ్లాష్ సర్వే చేయించానని, అందరూ బీఆర్ఎస్ పార్టీనే తప్పు పడుతున్నారని వెల్లడించారు. ప్రభుత్వంపై బీఆర్ఎస్ పార్టీ చేసిన కుట్రను బలంగా తిప్పికొట్టడమేగాక, ఆ కుట్ర గురించి ప్రజలకు స్పష్టంగా తెలియజేసినందుకు మంత్రులు, విప్‌లు, పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను అభినందిస్తున్నానని రేవంత్‌రెడ్డి చెప్పారు. రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావం తీవ్రంగానే ఉందని, దీనిపైన సభలో చర్చ జరిపి ప్రజల్ని అప్రమత్తం చేద్దామని సీఎం పేర్కొన్నారు. అనేక చోట్ల ప్రాజెక్టుల నుంచి పంటలకు నీళ్లు ఇవ్వాలన్న విజ్ఞప్తులు వస్తున్నాయని, కానీ ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో ప్రాజెక్టుల్లోని నీళ్లను తాగునీటి అవసరాలకు వినియోగించాలన్న ఆలోచనతో ప్రభుత్వం ఉందన్నారు. విద్యుత్తుకూ డిమాండ్ పెరిగిందని, ప్రతిరోజూ 19,500 మిలియన్ యూనిట్ల వాడకం జరుగుతోందని వెల్లడించారు. కొందామన్నా కూడా కరెంటు దొరకటం లేదని తెలిపారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, పాలిటెక్నిక్ కాలేజీల అంశాలపైనా సభలో చర్చ నిర్వహిద్దామన్నారు.

### కలిసి పని చేస్తే కుట్రలు ఛేదించగలం: భట్టి

బీఆర్ఎస్ నాయకుల ప్రవర్తన, వారి భాష, శుద్ధీకరణ కార్యక్రమంపై కాంగ్రెస్ నేతలంతా కలిసికట్టుగా, సమర్థవంతంగా స్పందించారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చెప్పారు. కలిసి పని చేస్తే కుట్రలను ఎలా ఛేదించగలమో చేసి చూపించామన్నారు. ఇకపైనా ఇదే పోరాట స్ఫూర్తితో ముందుకు సాగాలన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో కూడా ప్రభుత్వం ఇన్ని రకాల సంక్షేమ పథకాలు అమలు చేయటం లేదని, తగినంత ప్రచారం చేసుకోకపోవడం వల్లే ప్రతిపక్షాలకు అవకాశం ఇచ్చినట్టవుతోందన్నారు. సమర్థవంతంగా ప్రచారం నిర్వహిస్తే ప్రతిపక్షాలు కొట్టుకుపోతాయని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. సంక్షేమం, విద్య, వైద్య రంగాల్లో ప్రభుత్వం చేపట్టిన పథకాలను ప్రజలకు తెలియజేయాలన్నారు. సోషల్ మీడియానూ పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని, ఈ ప్రచార కార్యక్రమాన్ని పార్టీ, ప్రభుత్వం సమన్వయంతో ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.

### ఎస్ఐఆర్‌పై దృష్టి పెట్టాలి: మహేశ్‌గౌడ్

దేశంలో సర్ ప్రక్రియ దుర్మార్గంగా అమలవుతోందని, తమవి కావనుకున్న ఓట్లను పెద్ద ఎత్తున తొలగిస్తున్నారని పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్ తెలిపారు. రాష్ట్రంలోనూ పెద్దసంఖ్యలో ఓట్లు పోతున్నాయని, ముఖ్యంగా దళితులు, గిరిజనుల ఓట్లు ఎక్కువగా తొలగిస్తున్నారని చెప్పారు. దీనిని నివారించటంపై ఎమ్మెల్యేలు దృష్టి పెట్టాలన్నారు. కాగా, అసెంబ్లీ సమావేశాల్లో చర్చించనున్న అంశాలపై ఆయా శాఖల మంత్రులు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు అవగాహన కల్పించారు. ఎల్‌నినో ప్రభావంపై ఉత్తమ్ కుమార్‌రెడ్డి, జనగణన ప్రశ్నావళిలో బీసీ కాలమ్‌పై పొన్నం ప్రభాకర్, 22-ఏ పైపొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పాలిటెక్నిక్ కాలేజీల అంశంపై వివేక్ వివరించారు. ఆలిండియా ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ చైర్మన్‌గా నియమితులైన మధుయాష్కీగౌడ్‌ను సీఎల్పీ సమావేశం ముగిసిన అనంతరం సన్మానించారు.

# లడఖ్‌కు త్వరలోనే ప్రత్యేక హోదా..

రాజ్యాంగ పరిరక్షణలు కల్పించడం, ఎన్నికైన మండలిని ఏర్పాటు చేసే ప్రక్రియను కేంద్ర హోం శాఖ ఇప్పటికే ప్రారంభించిందని ఆయన చెప్పారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 371 నిర్దిష్ట రాష్ట్రాల ప్రత్యేక ప్రాంతీయ, సామాజిక అవసరాలను తీర్చడానికి తాత్కాలిక, పరివర్తన, ప్రత్యేక అధికారాలను అందిస్తుంది. "మేము ఒక ప్రత్యేకమైన పాలనా నమూనాపై పనిచేస్తున్నాం... ఇది 'సూయీ జెనెరిస్' మోడల్. లడఖ్‌లో ఎన్నికైన పాలక మండలి ఉంటుంది, కానీ ఇది శాసనసభ ఉన్న కేంద్రపాలిత ప్రాంతంగానీ లేదా రాష్ట్రంగానీ కాదు" అని కుంద్రా వివరించారు. 'సూయీ జెనెరిస్' అనేది ఒక ప్రత్యేక పరిస్థితిని నిర్వహించడానికి రూపొందించిన ఒక ప్రత్యేకమైన చట్టపరమైన వ్యవస్థ. ఈ లాటిన్ పదానికి 'తనదైన శైలి' లేదా 'ప్రత్యేకమైనది' అని అర్థం. లడఖ్ నాయకులతో చర్చలు జరుపుతున్న కేంద్ర ప్రభుత్వ బృందంలో ఆశిష్ కుంద్రా భాగస్వామిగా ఉన్నారు. మంగళవారం ఢిల్లీలో ఇరు వర్గాల మధ్య చర్చలు జరిగాయి. ఆర్టికల్ 370 రద్దుచేసిన కేంద్రం జమ్మూ కశ్మీర్, లడఖ్‌గా విభజించి ప్రత్యేక కేంద్రపాలిత ప్రాంతంగా ప్రకటించిన విషయం తెలిసిందే. ప్రారంభంలో లడఖ్‌లోని ఒక వర్గం కేంద్ర నిర్ణయాన్ని స్వాగతించినప్పటికీ, కాలక్రమేణా అధికారుల పాలనకు వ్యతిరేకంగా ఆందోళనలు చేపట్టారు. వారు రాష్ట్ర హోదాతో పాటు రాజ్యాంగంలోని ఆరో షెడ్యూల్ కింద ప్రత్యేక హోదా కావాలని డిమాండ్ చేస్తూ వస్తున్నారు. ఆరో షెడ్యూల్ ప్రకారం భూమి, అడవులు, నీరు, వ్యవసాయంపై చట్టాలు చేసే అధికారంతో స్థానిక కౌన్సిళ్లను ఏర్పాటు చేయవచ్చు. ఇది ప్రాంతీయ ఆర్థిక అభివృద్ధిలో స్థానిక సమాజాలకు ప్రత్యక్ష భాగస్వామ్యాన్ని అందిస్తుంది. గతేడాది లేహ్‌లో భద్రతా బలగాలు, పౌరుల మధ్య జరిగిన ఘర్షణల్లో నలుగురు మరణించగా, పలువురు గాయపడ్డారు. ఈ హింస తర్వాత సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ సహా పదుల సంఖ్యలో ప్రజలను పోలీసులు అరెస్టు చేశారు. అరెస్టయిన వారిలో మెజారిటీ ప్రజలపై కేసులను ఇప్పటికే ఉపసంహరించుకున్నట్లు ప్రభుత్వం తెలిపింది. చార్జ్‌షీట్ దాఖలైన కేసులపై లడఖ్ లెఫ్టినెంట్ గవర్నర్ త్వరలోనే నిర్ణయం తీసుకుంటారని కుంద్రా తెలిపారు.

# నూతన శకంలోకి లైఫ్ సైన్సెస్..పరిశోధనలు, ఆవిష్కరణల దిశగా అడుగులు

ఇప్పటికే గ్లోబల్ లీడర్‌గా ఎదిగిందని తెలిపారు. అంతేకాకుండా అమెరికా వెలుపల అత్యధిక యూఎస్ఎఫ్‌డీఏ ఆమోదం పొందిన సంస్థలు హైదరాబాద్‌లోనే ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రం కేవలం ఔషధ తయారీకే పరిమితం కాకుండా అధునాతన ఆర్ అండ్ డీ), గ్లోబల్ కేపబిలిటీ కేంద్రాల దిశగా దూసుకుపోతోందని చెప్పారు. గత రెండేళ్ల కాలంలో ఆమ్‌జెన్, ఎలీ లిల్లీ, బ్రిస్టల్ మైయర్స్ స్క్విబ్, సనోఫీ, అలైన్ టెక్నాలజీ, జోయెటిస్ వంటి ప్రపంచ ప్రఖ్యాత దిగ్గజ సంస్థలు హైదరాబాద్‌లో తమ కేంద్రాలను ఏర్పాటు చేశాయని మంత్రి వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన 'నెక్స్ట్-జెన్ లైఫ్ సైన్సెస్ పాలసీ 2026-30' ద్వారా డ్రగ్ డిస్కవరీ నుంచి మ్యానుఫ్యాక్చరింగ్, క్లినికల్ రీసెర్చ్ మరియు అత్యాధునిక టెక్నాలజీల అనుసంధానానికి పెద్దపీట వేస్తున్నామని చెప్పారు. గత ఏడాది ఏర్పాటైన 75కు పైగా గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లకు తోడుగా, త్వరలోనే జీసీసీల సంఖ్యను 100కు చేరుస్తామని, దీనిద్వారా దాదాపు 4 లక్షల ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగావకాశాలు లభిస్తాయని వెల్లడించారు. అంతేకాకుండా భారత్ ఫ్యూచర్ సిటీలో 2,100 ఎకరాల లైఫ్ సైన్సెస్ జోన్, ప్రత్యేకంగా 100 ఎకరాల్లో బయోలాజిక్స్ హబ్‌తో పాటు 1బయో మోడల్ మౌలిక వసతులను కల్పిస్తున్నామని స్పష్టం చేశారు. ఎంఎస్‌డీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ అభిషేక్ నారాయణ్ సింగ్ మాట్లాడుతూ.. ప్రపంచ స్థాయి డిజిటల్ సామర్థ్యాలను విస్తరించేందుకు హైదరాబాద్‌లో విస్తారమైన ప్రతిభ, అత్యుత్తమ టెక్నాలజీ ఎకోసిస్టమ్ ఉన్నాయని, అందుకే ఈ నగరాన్ని ఎంచుకున్నామని తెలిపారు. ఈ నూతన కేంద్రం ద్వారా డిజిటల్, డేటా అనలిటిక్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ), ఇంజినీరింగ్ సాంకేతికతలతో ప్రపంచవ్యాప్తంగా మానవ మరియు జంతు ఆరోగ్య రక్షణకు అవసరమైన పరిష్కారాలను అందిస్తామని సంస్థ స్పష్టం చేసింది. జీనోమ్ వ్యాలీతో పాటు ఐఐసీటీ, సీసీఎంబీ, నైపర్ వంటి ప్రముఖ పరిశోధనా సంస్థలు ఉండటం హైదరాబాద్‌కు మరింత బలాన్ని చేకూరుస్తోందని నేతలు వివరించారు.

# డీకే శివకుమార్ ప్రభుత్వం సరైన దిశలోనే వెళుతోంది

న్యూఢిల్లీ,సెప్టెంబర్ 10: కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ నేతృత్వంలోని ప్రభుత్వం సరైన దిశలోనే పయనిస్తోందని మాజీ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యుడు సిద్ధరామయ్య ధీమా వ్యక్తం చేశారు. శివకుమార్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి 100 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆయనకు, ఆయన మంత్రివర్గానికి సిద్ధరామయ్య అభినందనలు తెలియజేశారు. విధానసౌధలోని బాంక్వెట్ హాల్‌లో గురువారం నిర్వహించిన 'దృఢ కర్ణాటక సంకల్ప - 100 రోజుల విజయవంతమైన ప్రస్థానం' కార్యక్రమంలో సిద్ధరామయ్య ప్రసంగించారు. 100 రోజుల మైలురాయి అనేది కేవలం వేడుకలకు పరిమితం కాకూడదని, ప్రభుత్వం తన పనితీరును ప్రజల ముందు ఉంచి, బాధ్యతలను ఏ మేరకు నెరవేరుస్తోందో నిరూపించుకోవడానికి ఇదొక చక్కని అవకాశమని ఆయన పేర్కొన్నారు. డీకే శివకుమార్ నేతృత్వంలోని సర్కార్ సరైన మార్గంలోనే సాగుతోందని తాను భావిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ప్రతిపక్షాల నుంచి విమర్శలు ఎదురైనప్పటికీ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదిలోనే ఐదు గ్యారెంటీ పథకాలను విజయవంతంగా అమలు చేసిందని సిద్ధరామయ్య గుర్తు చేశారు. ఈ పథకాల కోసం ఏటా సుమారు రూ. 52,000 కోట్లు వెచ్చిస్తున్నట్లు ఆయన వివరించారు. సామాజిక అసమానతలను తొలగించి, అన్ని వర్గాల పేదలకు అండగా నిలవడమే ఈ పథకాల ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. ఇదే తరుణంలో ప్రతిపక్ష బీజేపీ తీరుపై సిద్ధరామయ్య విమర్శలు గుప్పించారు. బీజేపీ చేపట్టిన 'బళ్లారి చలో' పాదయాత్రను కేవలం ఒక రాజకీయ గిమ్మిక్కుగా ఆయన అభివర్ణించారు. అసెంబ్లీ సమావేశాల్లో రాష్ట్రంలోని కరువు పరిస్థితులపై చర్చించకుండా, కేవలం మాజీ మంత్రి నాగేంద్ర రాజీనామా అంశంపైనే బీజేపీ రాజకీయం చేస్తోందని ఆరోపించారు. కరవు సహాయక చర్యల కోసం పూర్తిగా కేంద్రంపైనే ఆధారపడవద్దని, అవసరమైన తాలూకాలను కరవు ప్రాంతాలుగా ప్రకటించి, రాష్ట్ర ప్రభుత్వమే చొరవ తీసుకోవాలని సీఎం శివకుమార్‌కు సూచించారు. పేదలు, దళితులు, వెనుకబడిన వర్గాలు, మహిళల సంక్షేమానికి ప్రభుత్వం నిరంతరం కట్టుబడి ఉండాలని ఆయన కోరారు.

# 8,283 కొనుగోలు కేంద్రాల ఏర్పాటు

ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోళ్లు సజావుగా జరిగేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. 2026-27 వానాకాలం సీజన్‌లో రాష్ట్రంలో సుమారు 57.7 లక్షల ఎకరాల్లో వరి సాగు జరిగిందని, సుమారు 119.57 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అవుతుందని అంచనా వేసినట్లు సీఎస్ తెలిపారు. ఇందులో సుమారు 65 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించినట్లు వెల్లడించారు. 2026-27 వానాకాల ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి చేపట్టాల్సిన ఏర్పాట్లపై సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో సీఎస్ సంజయ్ జాజు గురువారం డా. బీ.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో సమన్వయ సమావేశం నిర్వహించారు. గత వానాకాలం సీజన్‌లో సుమారు 70 లక్షల ఎకరాల్లో వరి సాగు జరిగి, 154.41 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి కాగా, 71.86 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు సీఎస్ తెలిపారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఈసారి కొనుగోలు ప్రక్రియను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 8,283 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు సీఎస్ వెల్లడించారు. ఐకేపీ, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, ఇతర కొనుగోలు ఏజెన్సీల సమన్వయంతో కేంద్రాలను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అక్టోబర్ నుంచి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు ధాన్యం రావడం ప్రారంభమవుతుందని, నవంబర్‌లో పెద్దఎత్తున ధాన్యం వచ్చే అవకాశం ఉన్నందున ముందుగానే అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. ముఖ్యంగా ధాన్యం రవాణా, హమాలీల ఏర్పాటు, గోదాములు, నిల్వ సామర్థ్యం తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సీఎస్ ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. ధాన్యం విక్రయించేందుకు కొనుగోలు కేంద్రాలకు వచ్చే ప్రతి రైతుకు ప్రత్యేక గుర్తింపు సంఖ్య కేటాయించాలని సీఎస్ సూచించారు. రైతుల ఆధార్ వివరాలను చెల్లింపుల కోసం ఉపయోగించే బ్యాంకు ఖాతాతో అనుసంధానం చేసే ప్రక్రియను సక్రమంగా చేపట్టాలని ఆదేశించారు.

ధాన్యం కొనుగోలు, రవాణా, నిల్వ, చెల్లింపుల ప్రక్రియలో ఎక్కడా జాప్యం లేకుండా శాఖల మధ్య సమన్వయం ఉండాలని, రైతులకు పారదర్శకంగా, వేగవంతంగా సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని సీఎస్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్, వ్యవసాయ శాఖ డైరెక్టర్ గోపీ, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ జనరల్ డీ.ఎస్. చౌహాన్, పౌరసరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, రవాణా శాఖ కమిషనర్ ఇలంబర్తి ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# పేదల ఆత్మగౌరవమే ఇందిరమ్మ ఇళ్ల లక్ష్యం

, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. గురువారం శాసనసభలో ఎమ్మెల్యేలు మనోహరరెడ్డి, రాజగోపాల్‌రెడ్డి, మేడేపల్లి సత్యం, అక్బరుద్దీన్, వెంకట్రామిరెడ్డి తదితర సభ్యుల ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు. పేదలను వారి జీవనోపాధికి దూరంగా 30--40 కిలోమీటర్ల అవతలికి పంపించే విధానం తమ ప్రభుత్వానికి లేదని మంత్రి స్పష్టం చేశారు. ఎకరం రూ.150--200 కోట్లు విలువ చేసే ప్రాంతాల్లో కూడా పేదవాడి ఆత్మగౌరవానికి తగినట్లుగా ఇల్లు కల్పించాలన్న ఉద్దేశంతో ప్రతి నియోజకవర్గాన్ని ఒక యూనిట్‌గా తీసుకుని ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తున్నామని చెప్పారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో పూర్తి పారదర్శకత పాటిస్తున్నామని మంత్రి తెలిపారు. డ్రాలో ఎంపికైన ప్రతి లబ్ధిదారుడిని అధికారులు ఇంటింటికీ వెళ్లి భౌతికంగా పరిశీలిస్తున్నారని చెప్పారు. ఇతర నియోజకవర్గాలకు చెందిన వారు డ్రాలో ఎంపికైనట్లు తేలితే వారి పేర్లను తప్పనిసరిగా తొలగిస్తామని సభ సాక్షిగా స్పష్టం చేశారు. దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం లేదా కేంద్ర ప్రభుత్వం పేదలకు ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఉచితంగా అందించిన ఉదాహరణ లేదని, తెలంగాణలో ఇందిరమ్మ ఇళ్ల కోసం రూ.5 లక్షలు అందిస్తున్నామని మంత్రి చెప్పారు. రూ.5 లక్షలు సరిపోవడం లేదని పలువురు సభ్యులు సూచించారని, ఆ అంశాన్ని ప్రభుత్వం సానుకూలంగా పరిశీలిస్తుందని తెలిపారు. మొదటి విడతలో మంజూరు చేసిన 4.50 లక్షల ఇళ్లకు సుమారు రూ.22,500 కోట్లు, రెండో విడతలో 2.50 లక్షల ఇళ్లకు సుమారు రూ.11 వేల కోట్లు, పట్టణ ప్రాంతాల్లో లక్ష ఇళ్లకు సుమారు రూ.5,500 కోట్లు అవసరమవుతాయని మంత్రి వివరించారు. రెండు విడతల్లోనే సుమారు 8 లక్షల ఇళ్లకు రూ.40 వేల కోట్లకు పైగా రాష్ట్ర ప్రభుత్వం భరించాల్సి ఉందన్నారు. భవిష్యత్తులో మూడో, నాలుగో విడతల్లోనూ అర్హులైన పేదలకు ఇళ్లు అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. మొదటి విడతలో ప్రభుత్వ అనుమతులతో ఇళ్లు ప్రారంభించి, నిర్మాణంలో చిన్నచిన్న లోపాల కారణంగా నిలిచిపోయిన సుమారు 3,200 ఇళ్లను రాటిఫై చేసి క్లియర్ చేశామని మంత్రి తెలిపారు. వారందరికీ ఈ వారం చివర్లోనే చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. గతంలో రాజకీయ వివక్షతో ఇళ్ల కేటాయింపులు జరిగాయని విమర్శించిన మంత్రి.. తమ ప్రభుత్వం మాత్రం అర్హతే ప్రామాణికంగా ఇళ్లను మంజూరు చేస్తోందన్నారు. ప్రతిపక్ష సభ్యులు సూచించిన అర్హులైన పేదల పేర్లను కూడా పరిశీలించి, అనుమతులు ఇచ్చామని తెలిపారు. ఎక్కడైనా అర్హులైన పేదలకు అన్యాయం జరిగితే తమ దృష్టికి తీసుకురావాలని, వాటిని పరిష్కరిస్తామని స్పష్టం చేశారు. గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పేదల కోసం గుర్తించిన ప్రభుత్వ స్థలాలు, సేకరించిన భూముల్లో ఇంకా కేటాయింపులు జరగని స్థలాలను గుర్తించి, అర్హులైన పేదలకు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు. నెల రోజుల్లోగా ఆయా నియోజకవర్గాల్లో అర్హులైన పేదలకు ఈ స్థలాలు అందించేలా కలెక్టర్లకు ఆదేశాలు ఇచ్చినట్లు చెప్పారు. ఇంటి నిర్మాణంలో ప్రధానమైన సిమెంట్ ధరను పేదలకు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి సిమెంట్ కంపెనీలతో చర్చలు జరిపామని మంత్రి తెలిపారు. ప్రస్తుతం మార్కెట్లో రూ.310--320 ఉన్న 50 కేజీల సిమెంట్ బ్యాగ్‌ను రూ.230కే పేదలకు అందించేలా ఒప్పందం పూర్తి చేశామని, త్వరలో ఈ విధానం అమల్లోకి వస్తుందని చెప్పారు. స్టీల్‌ను కూడా తక్కువ ధరకు అందించే దిశగా చర్యలు చేపడుతున్నామని తెలిపారు.

# పంచాయతీల సొంత రాబడి వాటి బ్యాంకు ఖాతాల్లోకే..

ఖాతాల్లో జమ చేస్తామని తెలిపారు.ప్రస్తుతం గ్రామ పంచాయతీలు సొంత ఆదాయ వనరుల ద్వారా సమకూర్చుకునే నిధులను ప్రభుత్వ ట్రెజరీ ఖాతాల్లో జమ చేయాల్సి వస్తోంది. వాటిని డ్రా చేయాలంటే నిర్దిష్ట ప్రక్రియలు పూర్తిచేయాల్సి ఉంటుంది. దీనివల్ల కొన్నిసార్లు నిధుల వినియోగంలో ఆలస్యం జరుగుతోంది. అందుకే పంచాయతీల సొంత ఆదాయం వాటి అవసరాలకు సకాలంలో అందుబాటులో ఉంచాలనే ఈ నిర్ణయం తీసుకున్నామ'ని చెప్పారు. ఈ నిధులను గ్రామసభ తీర్మానం మేరకు ఖర్చు చేసుకోవచ్చన్నారు. గత ప్రభుత్వం గ్రామ పంచాయతీలపై వివక్ష చూపిందని, దానిని రూపుమాపేందుకే చట్ట సవరణ చేసినట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ నూతన విధానాలు గ్రామాల అభివృద్ధిపై ప్రభావం చూపుతున్నాయని విమర్శించారు. వీబీజీరాంజీ పథకంతో రూ.2 వేల కోట్ల అదనపు భారం పడుతోందని తెలిపారు. బీసీ రిజర్వేషన్ల కారణంగతానే పంచాయతీ ఎన్నికల నిర్వహణలో ఆలస్యం జరిగిందని, ఆ కాలానికి సంబంధించిన కేంద్రం నిధులు పూర్తిస్థాయిలో రాలేదనిచెప్పారు. 2025-26కు సంబంధించిన రెండో విడత నిధులు రూ.619 కోట్లు రాష్ట్రానికి రావాల్సి ఉందన్నారు. అటవీ చట్టాలు రోడ్ల నిర్మాణానికి ఆటంకం కలిగిస్తున్నాయని, తాను పంచాయతీరాజ్ మంత్రిగా ఉన్నా వెనకబడిన ములుగు నియోజకవర్గంలో రోడ్లు వేసుకోలేకపోతున్నానని సీతక్క ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రం క్లియరెన్స్ ఇప్పించాలని కోరారు. ఉప సర్పంచులకు చెక్ పవర్ కల్పించే అంశంపై నిర్ణయం తీసుకుంటామని ప్రకటించారు.

# రిపబ్లికన్లు గెలిస్తే ప్రతి అమెరికన్‌కు 5 వేల డాలర్లు

మాత్రమే చేయగలను. నవంబర్ 3న జరగబోయే ఎన్నికల్లో రిపబ్లికన్లు గెలిస్తే, మీరు మాతో కలిసి గెలుస్తారు. మీకు 5,000 డాలర్లు లభిస్తాయి. నవంబర్ బ్యాలెట్‌లో నేను స్వయంగా పోటీలో ఉన్నట్లే భావించి ఓటు వేయండి" అని మద్దతుదారులను కోరారు.ట్రంప్ డెవిడెండ్ హామీ అమలుపై తీవ్ర అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం అమెరికాలో దాదాపు 27 కోట్ల మంది వయోజనులు ఉన్నారు. ప్రతి ఒక్కరికీ 5,000 డాలర్ల చొప్పున పంపిణీ చేయాలంటే ప్రభుత్వానికి సుమారు 1.35 ట్రిలియన్ డాలర్లు ఖర్చవుతుందని విశ్లేషకులు తెలిపారు. అయితే, ఈ భారీ మొత్తం నిధులు ఎక్కడి నుంచి వస్తాయనే దానిపై ట్రంప్ స్పష్టత ఇవ్వలేదు. "మన దేశం చాలా డబ్బు సంపాదిస్తోంది" అని మాత్రమే ట్రంప్ చెప్పారు. ఈ చెల్లింపుల ప్రక్రియ ఎలా పనిచేస్తుంది, అసలు ఇలా డబ్బులు పంచడం చట్టబద్ధమేనా అనే అంశాలపై ఇంకా స్పష్టత లేదు.మధ్యంతర ఎన్నికల్లో గెలవడం కోసం ట్రంప్ బహిరంగంగా ఓటర్లకు లంచం ఇస్తున్నారని విమర్శకులు, సోషల్ మీడియాలో విమర్శలు వెల్లువెత్తున్నాయి. "రిపబ్లికన్లకు ఓటు వేస్తే వి5,000 ఇస్తాననడం డివిడెండ్ ఎంతమాత్రం కాదు.. అది పక్కా లంచం" అని ఎక్స్ వేదికగా నెటిజన్లు ఆరోపించారు. ప్రముఖ అమెరికన్ స్టాక్ బ్రోకర్ పీటర్ షిఫ్ స్పందిస్తూ.. "ఓటర్లను ఆకట్టుకోవడానికి ట్రంప్ ఈ రకమైన ప్రతిపాదన చేశారు. ఈ ఉచిత డబ్బు కోసం ఫెడరల్ రిజర్వ్ భారీగా కరెన్సీ నోట్లను ముద్రించాల్సి వస్తుంది. ఫలితంగా బైడెన్ హయాంలో చూసిన దానికంటే అతి తీవ్రమైన ద్రవ్యోల్బణం వచ్చే ప్రమాదం ఉంది" అని హెచ్చరించారు.

## సరికొత్త శోభతో ట్రస్ట్ ఇన్ కాష్ జ్యువెలరీ ప్రారంభం



శేరిలింగంపల్లి అక్షరం ప్రతినిధి: చందానగర్ ప్రజలకు మరింత చేరువగా, సరికొత్త ఆభరణాల వేదికగా ట్రస్ట్ ఇన్ కాష్ జ్యువెలరీ అందుబాటులోకి వచ్చింది. సంస్థ రెండవ కార్యాలయాన్ని సీఈఓ బాలు సీ.పీ చందానగర్ కాంగ్రెస్ సీనియర్ నేత మంజుల రఘునాథ్ రెడ్డి కలిసి ఘనంగా ప్రారంభించారు. సంస్థ కార్యాలయంలో ఘనంగా పూజలు నిర్వహించారుఈ సందర్భంగా బాలు సీ.పీ మాట్లాడుతూ వినియోగదారుల నమ్మకాన్ని ప్రధానంగా తీసుకుని నాణ్యత, పారదర్శకత, మెరుగైన సేవలకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. వినియోగదారులు ఎప్పుడైనా వచ్చి తమ యొక్క బంగారాన్ని మా ట్రస్ట్ ఇన్ కాస్ట్ జ్యువెలరీలో మార్కెట్ ధరకే అమ్ముకోవచ్చని తెలిపారు, మీ బంగారం ప్యూరిటీ తెలుసుకునేందుకు జర్మన్ టెక్నాలజీకి సంబంధించిన ఒక మిషన్ను అందుబాటులో ఉంచామని మీరు ఎప్పుడైనా వచ్చి ప్యూరిటీ ను చూసుకోవచ్చని ప్రతి వినియోగదారుడికి సంతృప్తికరమైన సేవలు అందించేందుకు సంస్థ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందని పేర్కొన్నారు. ఆభరణాల రంగంలో నూతన ప్రమాణాలను నెలకొల్పే దిశగా ట్రస్ట్ ఇన్ కాష్ జ్యువెలరీ ముందుకు సాగుతుందని తెలిపారు.ప్రారంభోత్సవ కార్యక్రమంలో చైర్మన్ ఆఫీస్ మురళి, పాన్ ఇండియా బిజినెస్ హెడ్ కార్తీక్, తెలంగాణ బిజినెస్ హెడ్ తంగరాజు, రీజనల్ మేనేజర్ విశ్వేశ్వర్, బ్రాంచ్ మేనేజర్ శ్యామ్, బిజినెస్ డెవలప్మెంట్ ఎగ్జిక్యూటివ్ లక్ష్మణ్, బిడ్డర్ రవీందర్, షాప్ ఓనర్స్ సిరాజ్ ముంతాజ్ తదితరులు పాల్గొన్నారు.

## నష్టపరిహారం, ఉద్యోగాలు కల్పించే వరకు భూములు ఇవ్వం



జ్యోతినగర్, ఎన్టీపీసీ సెప్టెంబర్ 10 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్ : తగిన నష్టపరిహారంతో పాటు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే వరకు తమ భూములను ఎన్టీపీసీ సంస్థకు అప్పగించబోమని మొగల్‌పహాడ్ గ్రామ రైతులు స్పష్టం చేశారు. ఈ మేరకు ఎన్టీపీసీ జీఎం (టీఎస్)కు వినతిపత్రం సమర్పించారు.అంతర్గాం మండలం మొగల్‌పహాడ్ గ్రామానికి చెందిన దళిత, బహుజన రైతులు తమ పూర్వీకుల కాలం నుంచి సుమారు శతాబ్దంగా వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తున్నామని తెలిపారు. 1982లో బూడిద చెరువు నిర్మాణం కోసం ఎన్టీపీసీ సంస్థ గ్రామంలోని భూములను సేకరించిన సమయంలో తగిన నష్టపరిహారం, ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని అప్పటి యాజమాన్యం హామీ ఇచ్చిందని పేర్కొన్నారు. అయితే ఇప్పటి వరకు ఆ హామీలు అమలు కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు.1982లో ఎన్టీపీసీకి భూములు ఇచ్చిన అనంతరం మిగిలిన భూములను గ్రామ రైతులు దీర్ఘకాలంగా సాగు చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నామని తెలిపారు. ప్రస్తుతం ఎన్టీపీసీ అవసరాల కోసం మరోసారి 606 ఎకరాల భూమికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం, ఎన్టీపీసీ అధికారులు క్షేత్రస్థాయిలో ఆక్రమణ, సాగు వివరాల సర్వే నిర్వహించారని పేర్కొన్నారు.సర్వే సమయంలో గ్రామ రైతులను భాగస్వామ్యం చేసి, క్షేత్రస్థాయిలో భూములను సాగు చేస్తున్న వారి పేర్లను నమోదు చేసినట్లు తెలిపారు. సర్వే రికార్డుల ఆధారంగా నిజంగా భూములను సాగు చేస్తున్న రైతులను గుర్తించి, గతంలో జరిగిన అన్యాయం పునరావృతం కాకుండా తగిన నష్టపరిహారం, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు.తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించకుండా భూములను తీసుకునేందుకు ప్రయత్నిస్తే ఎన్టీపీసీకి భూములు అప్పగించబోమని రైతులు స్పష్టం చేశారు. తమ హక్కుల కోసం ఎంతటి త్యాగానికైనా సిద్ధంగా ఉన్నామని తెలిపారు.వినతిపత్రం సమర్పించిన వారిలో మొగల్‌పహాడ్ గ్రామ రైతులు చిలుక ప్రసాద్, నామాల శ్రీనివాస్, పెంచికల రవీందర్, చిలుక రాజేశం, దేగల ప్రసాద్ తదితరులు ఉన్నారు.

## కేంద్ర కార్మిక సలహా మండలి సభ్యుడిగా హర్భజన్ సింగ్ సిద్ధు



జ్యోతినగర్, ఎన్టీపీసీ సెప్టెంబర్ 10 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్ : హింద్ మజ్దూర్ సభ (హెచ్ఎంఎస్) ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ హర్భజన్ సింగ్ సిద్ధును కేంద్ర ప్రభుత్వం కేంద్ర కార్మిక సలహా మండలి సభ్యుడి గా నియమించింది. కోడ్ ఆన్ వేజెస్--2019 కింద ఏర్పాటు చేసిన ఈ మండలిలో ఆయనకు అవకాశం లభించింది.

కార్మికుల హక్కులు, సంక్షేమం, వేతనాలకు సంబంధించిన అంశాలపై కేంద్ర స్థాయిలో సలహాలు, సూచనలు అందించే ఈ మండలిలో హర్భజన్ సింగ్ సిద్ధు నియామకం పట్ల కార్మిక వర్గాల్లో హర్షం వ్యక్తమవుతోంది.ఈ సందర్భంగా హెచ్ఎంఎస్ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సిహెచ్. ఉపేందర్ హర్భజన్ సింగ్ సిద్ధుకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి ఆయన అనుభవం, సేవలు మరింతగా ఉపయోగపడాలని ఆకాంక్షించారు.

# ప్రభుత్వ ఆసుపత్రి వైద్యుల నిర్లక్ష్యానికి పరాకాష్ట

- ప్రైవేట్‌లో పోతే తగ్గే రోగం, లక్షల జీతాలు తీసుకునే సర్కారు డాక్టర్లకు తగ్గదా? -.. అందుబాటులో లేని అనేక మందులు.. కార్పొరేటర్ మడిపెల్లి విజయ మల్లేష్ తీవ్ర ఆగ్రహం



జ్యోతి నగర్ ఎన్టిపిసి సెప్టెంబర్ 10 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

గోదావరిఖని ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రిలో వైద్యుల అలసత్వం,పర్యవేక్షణ లోపం పరాకాష్టకు చేరాయని రామగుండం నగరపాలక సంస్థ 1వ డివిజన్ కార్పొరేటర్ మడిపెల్లి విజయ మల్లేష్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ప్రభుత్వ వైద్యంపై నమ్మకంతో వచ్చే పేద ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడటం అమానుషమని మండిపడ్డారు.సోమవారం రోజున1వ డివిజన్‌కు చెందిన ఒక సాధారణ యువకుడు విపరీతమైన కాళ్ల నొప్పులతో తట్టుకోలేక ప్రభుత్వ ఆసుపత్రిలో చేరాడని తెలిపారు. వార్డులో ఉన్న రోగి తీవ్ర వేదన అనుభవిస్తున్నప్పటికీ అక్కడ డ్యూటీలో ఉన్న వైద్యులు కనీసం పట్టించుకోకుండా తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించారని మండిపడ్డారు. విషయం తెలిసి తాను స్వయంగా ఆసుపత్రికి ఎళ్లానని, బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్న డాక్టర్లతో మాట్లాడి రోగికి తక్షణమే సరైన వైద్యం అందించాలని విజ్ఞప్తి చేసినా వారి ప్రవర్తనలో ఎలాంటి మార్పు రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు.వైద్యుల నిర్లక్ష్యం తాళలేక, నొప్పుల భారం భరించలేక ఆ యువకుడు చేసేది లేక సాయంత్రం వరకు వైద్యం కోసం ఎదురుచూసి వైద్యులు పట్టించుకోకపోవడంతో విసుగుచేంది గోదావరిఖని లోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తరలివెళ్లాడని తెలిపారు.అక్కడ చేరిన కొద్ది సమయంలోనే ప్రైవేట్ డాక్టర్లు అందించిన చికిత్సతో రోగం నయమై,అతను పూర్తిగా కోలుకుని స్వగృహానికి చేరుకున్నాడని పేర్కొన్నారు.ఈ సందర్భంగా మడిపెల్లి విజయ మల్లేష్ ప్రశ్నిస్తూ--- ప్రభుత్వం నుంచి నెలకు లక్షల రూపాయల వేతనాలు పొందుతూ,ప్రభుత్వం నిర్వహించిన కఠినమైన ఇంటర్వ్యూలలో ఎంపికై వచ్చిన డాక్టర్లు ఉన్న ప్రభుత్వ ఆసుపత్రిలో తగ్గని రోగం... ఒక సాధారణ ప్రైవేట్ ఆసుపత్రికి వెళ్తే వెంటనే ఎలా తగ్గింది?” అని నిలదీశారు. వైద్యులు సకాలంలో స్పందించక నిర్లక్ష్యం చేయడం వల్లే పేద ప్రజలు అప్పులు చేసి ప్రైవేట్ ఆసుపత్రుల బాట పడుతున్నారని ఒకటవ డివిజన్ కార్పొరేటర్ మడిపెల్లి విజయ మల్లేష్ ఆరోపించారు. ఉదయం డ్యూటీ కి వచ్చినా డాక్టర్లు 12 గంటలు ఎప్పుడు అవుతుందా అని ఎదురుచూడడం తప్ప వైద్యం మీద దృష్టి సారించే పరిస్థితి లేదని ఇకనైనా జిల్లా డీఎంహెచ్ఓ స్పందించి హాస్పిటల్ ను తనిఖీ చేసి హాస్పటల్లో నీ సిబ్బందిని గాడిలో పెట్టి పేదలకు వైద్యం అందేల చూడాలని ఒకటోవ డివిజన్ కార్పొరేటర్ మడిపెల్లి విజయ మల్లేష్ డిమాండ్ చేశారు

## ఎఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యునిగా నాంసాని శంకర్



జ్యోతినగర్, ఎన్టీపీసీ సెప్టెంబర్ 10 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్ : ఎఐటీయూసీ నాలుగో రాష్ట్ర మహాసభల్లో ఎన్టీపీసీ రామగుండం ప్రాంతానికి చెందిన ప్రముఖ కార్మిక నాయకుడు నాంసాని శంకర్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యునిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఎఐటీయూసీ నాయకులు, కార్మికులు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.రాష్ట్ర కౌన్సిల్ సభ్యునిగా ఎన్నికైన నాంసాని శంకర్ మాట్లాడుతూ కార్మికుల సమస్యల పరిష్కారం, హక్కుల పరిరక్షణ కోసం నిరంతరం పోరాడుతామని తెలిపారు. కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలకు పెంచాలని, ఎన్టీపీసీ రామగుండంలో కాంట్రాక్టు కార్మికుల వేతన ఒప్పందం కాలపరిమితి ముగిసినందున మెరుగైన షరతులతో నూతన ఒప్పందం చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రాజెక్టులో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు విశ్రాంతి గదులు, రోడ్లు, సరిపడా లైటింగ్ తదితర ప్రాథమిక సౌకర్యాలు కల్పించాలని కోరారు.కార్మికులందరూ ఐక్యంగా ఉండి తమ హక్కుల సాధనకు ఉద్యమించాలని ఆయన పిలుపునిచ్చారు.నాంసాని శంకర్ ఎన్నికపై ఎఐటీయూసీ నాయకులు రెడపాక లక్ష్మణ్, టీ. సత్యనారాయణ, జీ. మహేశ్వరరావు, బీ. అర్జున్, ఏ. రాజేందర్ రెడ్డి, ఎం. మల్లేష్, జీ. లక్ష్మణ్, ఏ. శ్రీనివాస్, టీ. శివపాల్ సింగ్ తదితరులు, పెద్ద సంఖ్యలో కార్మికులు హర్షం వ్యక్తం చేసి శుభాకాంక్షలు తెలిపారు.

## వరి పొలాన్ని పరిశీలించిన వ్యవసాయ శాస్త్రవేత్త..



సూర్యాపేట/నేరేడుచర్ల, సెప్టెంబర్ 10: అక్షరం న్యూస్:

నేరేడుచర్ల మండలం పెంచికల్‌దిన్నె గ్రామంలో వరి పంటలో మొక్కలు చనిపోతున్న సమస్యపై వ్యవసాయ శాస్త్రవేత్తలు గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టారు.రైతు వల్లంశెట్ల కృష్ణయ్య తన వరి పొలంలో ఎరువులు, మందులు వెదజల్లిన 15 నుంచి 20 రోజుల తర్వాత మొక్కలు చనిపోతున్నాయని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఫిర్యాదు విచారణలో భాగంగా మండల వ్యవసాయ అధికారితో కలిసి గడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త నరేష్ పంట పొలాన్ని పూర్తిగా పరిశీలించారు.మొక్కలు చనిపోవడానికి గల కారణాలను క్షేత్రస్థాయిలో పరిశీలించిన అనంతరం నివేదికను జిల్లా వ్యవసాయ అధికారికి త్వరలో సమర్పించనున్నట్లు శాస్త్రవేత్త నరేష్ తెలిపారు.

## ఎంఈఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా వల్లపట్ల కృష్ణ



సూర్యాపేట, సెప్టెంబర్ 10: అక్షరం న్యూస్

తెలంగాణ మాదిగ ఉద్యోగుల ఫెడరేషన్ రాష్ట్ర వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్‌గా సూర్యాపేటకు చెందిన వల్లపట్ల కృష్ణ నియమితులయ్యారు.కృష్ణ 1997లో కుసుమవారిగూడెం గ్రామ శాఖ అధ్యక్షుడిగా తన ప్రస్థానాన్ని ప్రారంభించి, 2016లో డివిజన్ కార్యదర్శిగా, 2017లో జిల్లా కార్యవర్గ సభ్యుడిగా, 2020లో జిల్లా ప్రధాన కార్యదర్శిగా, 2024 నుంచి జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహించారు. ఆయన సేవలను గుర్తించిన ఎంఆర్పీఎస్ వ్యవస్థాపకుడు, జాతీయ అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ, ఎంఈఎఫ్ రాష్ట్ర నాయకత్వం సంయుక్తంగా రాష్ట్ర వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్‌గా నియమించినట్లు కృష్ణ తెలిపారు.ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ రాష్ట్రంలోని మాదిగ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. తన నియామకానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. కృష్ణ నియామకంపై పలువురు ఉద్యోగులు, స్నేహితులు, పట్టణవాసులు శుభాకాంక్షలు తెలిపారు.

## మట్టి వినాయకుడినే పూజిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుదాం...



జ్యోతినగర్, ఎన్టీపీసీ సెప్టెంబర్ 10 పెద్దపల్లి జిల్లా అక్షర న్యూస్ : పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మట్టి వినాయక విగ్రహాలను పూజించాలని రామగుండం మేయర్ మహంకాళి స్వామి, అదనపు కలెక్టర్, నగరపాలక సంస్థ కమిషనర్ అరుణశ్రీ పిలుపునిచ్చారు. నేషనల్ గ్రీన్ క్రాప్స్ పెద్దపల్లి జిల్లా ఆధ్వర్యంలో, కాలుష్య నియంత్రణ మండలి రామగుండం సౌజన్యంతో గురువారం జ్యోతినగర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మట్టి వినాయకులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.నేషనల్ గ్రీన్ క్రాప్స్ జిల్లా సమన్వయకర్త, పర్యావరణ విద్య ప్రచార ప్రతినిధి గూళ్ల అంజన్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మట్టి వినాయకుల వినియోగంపై రూపొందించిన అవగాహన పోస్టర్‌ను మేయర్ మహంకాళి స్వామి, అదనపు కలెక్టర్, కమిషనర్ అరుణశ్రీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసిన విగ్రహాలను చెరువులు, నదులు, ఇతర నీటి వనరుల్లో నిమజ్జనం చేయడం వల్ల నీటి కాలుష్యం పెరుగుతుందని తెలిపారు. మట్టి వినాయకులను పూజించడం ద్వారా పర్యావరణానికి హాని కలగకుండా వినాయక చవితిని నిర్వహించవచ్చని పేర్కొన్నారు.అనంతరం మట్టి వినాయక విగ్రహాలను ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులకు పంపిణీ చేశారు. పర్యావరణహితంగా వినాయక చవితి వేడుకలను నిర్వహించాలని సూచించారు.మట్టి వినాయకుడిని పూజిద్దాం.. నీటి కాలుష్యాన్ని నివారిద్దాం.. పర్యావరణాన్ని పరిరక్షిద్దాం అని గూళ్ల అంజన్ కుమార్ పిలుపునిచ్చారు.



## ఎంఈఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడిగా చింత జాన్ విల్సన్



సూర్యాపేట, సెప్టెంబర్ 10: అక్షరం న్యూస్

మాదిగ ఉద్యోగుల ఫెడరేషన్ (ఎంఈఎఫ్) జాతీయ ఉపాధ్యక్షుడిగా సూర్యాపేటకు చెందిన చింత జాన్ విల్సన్ నియమితులయ్యారు. జాన్ విల్సన్ 2004లో ఎస్సీ వర్గీకరణ ఉద్యమ సమయంలో ఎంఈఎఫ్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధికార ప్రతినిధిగా పనిచేశారు. 2005లో ఉమ్మడి నల్గొండ జిల్లా ఇన్‌చార్జిగా, జిల్లా కార్యదర్శిగా, 2011లో ఉమ్మడి నల్గొండ జిల్లా ప్రధాన కార్యదర్శిగా, 2016లో తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా, 2022లో రాష్ట్ర కోశాధికారిగా బాధ్యతలు నిర్వహించారు. ఆయన సేవలను గుర్తించిన ఎంఆర్పీఎస్ వ్యవస్థాపకుడు, జాతీయ అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ 2026లో ఎంఈఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడిగా నియమించినట్లు జాన్ విల్సన్ తెలిపారు. ఈ సందర్భంగా విల్సన్ మాట్లాడుతూ ఎంఈఎఫ్ నాయకత్వం తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. తన నియామకాన్ని ధ్రువీకరించిన మంద కృష్ణ మాదిగకు కృతజ్ఞతలు తెలిపారు. విల్సన్ నియామకంపై పలువురు ఉద్యోగులు, స్నేహితులు, పట్టణ ప్రజలు శుభాకాంక్షలు తెలిపారు.

## క్రీడా స్ఫూర్తితో రాణించాలి

- రామగుండం ఏరియా-1లో కబడ్డీ పోటీలు ప్రారంభం



జ్యోతి నగర్ ఎన్టిపిసి సెప్టెంబర్10 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

రామగుండం ఏరియా-1 పరిధిలో కబడ్డీ పోటీలు గురువారం ఉత్సాహభరిత వాతావరణంలో బుధవారం ప్రారంభమయ్యాయి. వర్క్ పీపుల్స్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జవహర్‌లాల్ నెహ్రూ క్రీడా మైదానంలో నిర్వహిస్తున్న ఈ పోటీలను జీడీకే ఓసీ-5 ప్రాజెక్ట్ ఆఫీసర్ డి.రమేష్ లాంఛనంగా ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకుని వారితో కరచాలనం చేసి పోటీలకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ క్రీడాకారులు క్రీడా స్ఫూర్తి, క్రమశిక్షణతో పోటీల్లో పాల్గొని ప్రతిభను చాటుకోవాలని ఆకాంక్షించారు. సింగరేణి సంస్థ క్రీడలకు ఎల్లప్పుడూ ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. రామగుండం ఏరియాకు చెందిన ప్రతిభావంతులైన క్రీడాకారులు జాతీయ స్థాయితో పాటు కోల్ ఇండియా స్థాయి పోటీల్లో విజేతలుగా నిలిచి సంస్థకు, ఏరియాకు మంచి పేరు తీసుకురావాలని పిలుపునిచ్చారు. పోటీల్లో ఆర్‌జీ-1 ఏరియా పరిధిలోని వివిధ గనులు, విభాగాలకు చెందిన జట్లు పాల్గొంటున్నాయి. ప్రారంభ కార్యక్రమంలో గౌరవ కార్యదర్శి జి.హనుమంతరావు, కోఆర్డినేటర్ గాండ్ల రాజయ్యతో పాటు వివిధ గనులకు చెందిన క్రీడాకారులు, క్రీడాభిమానులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## రామగుండం నగరపాలక సంస్థలో మట్టి వినాయకులు పంపిణీ



జ్యోతినగర్, ఎన్టీపీసీ సెప్టెంబర్ 10 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్: వినాయక చవితి వేడుకల్లో మట్టి విగ్రహాలను ప్రతిష్ఠించి పర్యావరణ పరిరక్షణకు సహకరించాలని రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి కోరారు. కాలుష్య నియంత్రణ మండలి సౌజన్యంతో రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయంలో గురువారం మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ మట్టి విగ్రహాలను నీటిలో నిమజ్జనం చేసినప్పుడు ఎలాంటి అవశేషాలు మిగలకుండా త్వరగా కరిగిపోతాయని తెలిపారు. పీవోపీ విగ్రహాలు నెలల తరబడి కరగకుండా నీటిలో పేరుకుపోయి కాలుష్యానికి కారణమవుతాయని పేర్కొన్నారు. ప్రజలు పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని మట్టి విగ్రహాలకే ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ పాతపెల్లి ఎల్లయ్య, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), నగర పాలక సంస్థ కమిషనర్ జె. అరుణ శ్రీ, డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకట స్వామి, కాలుష్య నియంత్రణ మండలి సైంటిస్ట్ కనక జ్యోతి తదితరులు పాల్గొన్నారు.




# చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి ఆదర్శం





- కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

సూర్యాపేట, టౌన్ సెప్టెంబర్ 10: అక్షరం న్యూస్

వీరనారి చాకలి ఐలమ్మ చూపిన ధైర్యం, పోరాట పటిమ తరతరాలకు స్ఫూర్తిదాయకమని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో ఐలమ్మ వర్ధంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూస్వామ్య వ్యవస్థ, అణచివేతకు ఎదురొడ్డి ఐలమ్మ సాగించిన పోరాట చరిత్రను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని సూచించారు. ఆమె స్ఫూర్తితో సామాజిక, ఆర్థిక, విద్యా రంగాల్లో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. యువత చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించేలా ప్రోత్సహించాలని అన్నారు.

### ఐలమ్మ తెగువ అందరికీ ఆదర్శం: ఎస్పీ నరసింహ

చాకలి ఐలమ్మ చూపిన తెగువ, పోరాట స్ఫూర్తి నేటి సమాజానికి ఆదర్శమని జిల్లా ఎస్పీ నరసింహ అన్నారు. అన్యాయాలను ప్రజాస్వామ్యబద్ధంగా ప్రశ్నిస్తూ మహిళలు అన్ని రంగాల్లో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. మహిళల భద్రత, చైతన్యంపై పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి. హరి సింగ్, బీసీ సంక్షేమ అధికారి విశాల్, డాక్టర్ ఊర రామ్మూర్తి యాదవ్, భోమ్మగాని శ్రీనివాస్, బంటు కృష్ణ, చింతలపాటి చిన్న శ్రీరాములు, మట్టిపల్లి సైదులు, పోతుగంటి వీరాచారి, చల్లమల నరసింహ, తల్లమల్ల హషెన్, ధున్నా శ్యామ్, జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# అర్హులందరికీ చేయూత పంచ పింఛన్లు అందజేయండి





జ్యోతినగర్, ఎన్టీపీసీ సెప్టెంబర్ 10 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్ : అర్హులైన ప్రతి ఒక్కరికీ చేయూత పింఛన్లు అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి అన్నారు. రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయంలో గురువారం అధికారులు, సిబ్బందితో చేయూత పింఛన్లపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ చేయూత పథకం మార్గదర్శకాల ప్రకారం క్షేత్రస్థాయిలో దరఖాస్తులను సూక్ష్మంగా పరిశీలించాలని సూచించారు. అనర్హులకు పింఛన్లు మంజూరు కాకుండా చూడటంతో పాటు అర్హులైన వారు పింఛను పొందకుండా తప్పిపోకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. కొత్తగా దరఖాస్తు చేసుకునేవారికి సెప్టెంబర్ 15, 2026 వరకు గడువు ఉన్నందున ఈ విషయంపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. సరైన డాక్యుమెంట్లు లేవనే కారణంతో దరఖాస్తులను స్వీకరించేందుకు తిరస్కరించవద్దని, ప్రతి ఒక్కరి దరఖాస్తును తప్పనిసరిగా నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో డిప్యూటీ మేయర్ పాతపెల్లి ఎల్లయ్య, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), నగర పాలక సంస్థ కమిషనర్ జె. అరుణ శ్రీ, డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకట స్వామి, అసిస్టెంట్ కమిషనర్ సంపత్ కుమార్, టీపీఎస్ నవీన్, సూపరింటెండెంట్ పబ్బాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# సెరికల్చర్‌ను లాభదాయక పంటల పైన రైతులకు అవగాహన కార్యక్రమం

కరీంనగర్/జమ్మికుంట/, సెప్టెంబరు 10/ అక్షరం న్యూస్: మేరా రేషమ్ మేరా అభిమాన్ కార్యక్రమంలో భాగంగా సెరికల్చర్‌ను లాభదాయక పంటగా చేపట్టడంపై అవగాహన కార్యక్రమాన్ని జమ్మికుంటలోని కృషి విజ్ఞాన కేంద్రం(కెవికె) లో కేంద్ర పట్టు మండలి, రాష్ట్ర సెరికల్చర్ శాఖల ఆధ్వర్యంలో, కృషి విజ్ఞాన కేంద్రం సహకారంతో నిర్వహించారు. రైతులకు సెరికల్చర్‌లో ఉన్న ఆర్థిక అవకాశాలను వివరించడం, కొత్త రైతులను ఈ రంగంలోకి ప్రోత్సహించడం కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రస్తుత సెరికల్చర్ రైతులతో పాటు కొత్తగా సెరికల్చర్ చేపట్టేందుకు ఆసక్తి ఉన్న మొత్తం నూట యాభై నలుగురు రైతులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి కృషి విజ్ఞాన కేంద్రం చైర్మన్ విజయ్ గోపాల్ రెడ్డి, సీనియర్ శాస్త్రవేత్త వెంకటేశ్వర్లు, శాస్త్రవేత్త వేణుగోపాల్, మహేష్ హాజరై రైతులతో పరస్పర చర్చలు నిర్వహించారు. అలాగే జిల్లా వ్యవసాయ అధికారి చత్రునాయక్, జాతీయ ఉద్యానవన మండలి ఉప సంచాలకుడు జోషి భీమేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర పట్టు మండలి శాస్త్రవేత్త డాక్టర్ గులాబ్ ఖాన్ మాట్లాడుతూ, జమ్మికుంట తన స్వస్థలం కావడం, తాను పాఠశాల విద్యను అభ్యసించిన పాఠశాలకు సమీపంలోని కృషి విజ్ఞాన కేంద్రంలోనే రైతులతో కలిసి ఈ కార్యక్రమంలో పాల్గొనే అవకాశం లభించడం ఎంతో ఆనందంగా, గర్వంగా ఉందన్నారు. తన స్వగ్రామంలో వృత్తిపరమైన హోదాలో రైతులను కలుసుకుని సెరికల్చర్‌పై అవగాహన కల్పించడం తనకు ప్రత్యేకమైన అనుభూతిని కలిగించిందని తెలిపారు. సెరికల్చర్‌ను లాభదాయకమైన పంటగా, స్థిరమైన జీవనోపాధి మార్గంగా ఆయన వివరించారు. అనుకూల వాతావరణ పరిస్థితులు, శాస్త్రీయ యాజమాన్య పద్ధతులు పాటించినప్పుడు రైతులు సంవత్సరానికి ఎనిమిది నుంచి పది పట్టుపురుగుల పెంపకం పంటలు చేపట్టి క్రమమైన ఆదాయం పొందవచ్చని తెలిపారు. మల్బరీ సాగు, పట్టుపురుగుల పెంపకం, వ్యాధుల సమగ్ర నిర్వహణ, కోకూన్ ఉత్పత్తిలో శాస్త్రీయ పద్ధతులను పాటించడం ద్వారా ఉత్పాదకత, ఆదాయం పెంచుకోవచ్చని వివరించారు. జిల్లా సెరికల్చర్ అధికారి, జిల్లా నోడల్ అధికారి బనోత్ వెంకన్న పట్టు సమగ్ర రెండో పథకం గురించి రైతులకు వివరించారు. ముఖ్యంగా కొత్త రైతులకు అందుబాటులో ఉన్న ప్రభుత్వ సహాయం, పథకం ప్రయోజనాలు, సాంకేతిక మద్దతును వివరించి, రైతులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తుమ్మనపల్లి గ్రామానికి చెందిన విజయవంతమైన సెరికల్చర్ రైతు ప్రవీణ్ తన అనుభవాలను రైతులతో పంచుకుని, ఈ రంగం ద్వారా పొందుతున్న ప్రయోజనాలను వివరించారు. ఇతర రైతులు కూడా సెరికల్చర్‌ను లాభదాయకమైన జీవనోపాధిగా స్వీకరించాలని ఆయన ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో రైతులకు శాస్త్రవేత్తలు, అధికారులు, సంబంధిత శాఖల ప్రతినిధులతో ప్రత్యక్షంగా చర్చించే అవకాశం లభించింది. సెరికల్చర్ సాంకేతికతలు, పంట




నిర్వహణ, వ్యాధుల నియంత్రణ, కోకూన్ ఉత్పత్తి మరియు ప్రభుత్వ పథకాలపై రైతులు పలు అంశాలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమానికి డాక్టర్ గులాబ్ ఖాన్ పాఠశాల రోజుల నాటి సహాధ్యాయులు రాజు, సురేందర్ కూడా హాజరయ్యారు. తన చిన్ననాటి సహాధ్యాయులు తాను చదువుకున్న ప్రాంతంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి వచ్చి తనను కలవడం ఎంతో ఆనందాన్ని, ప్రేరణను కలిగించిందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ముగింపులో గులాబ్ ఖాన్ కృషి విజ్ఞాన కేంద్రం సిబ్బందికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తన స్వగ్రామంలోని రైతులతో అనుసంధానం అయ్యే అవకాశం కల్పించినందుకు కృషి విజ్ఞాన కేంద్రం యాజమాన్యం, సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమ విజయానికి సహకరించిన అధికారులు, శాస్త్రవేత్తలు, ప్రగతిశీల రైతులు, పాల్గొన్న రైతులందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

## రాష్ట్ర విభాగం సీఐడీ కి ఉపాధ్యక్షుడిగా బెల్లపు స్వామి

- ప్రత్యక్ష ఎన్నికల్లో ఘన విజయం.. 259 ఓట్లతో 144 ఓట్ల ఆధిక్యం
- హుజురాబాద్ నియోజకవర్గానికి చెందిన స్వామికి ప్రముఖుల అభినందన



కరీంనగర్/హుజురాబాద్/సెప్టెంబర్ 10/అక్షరం న్యూస్ : పోలీస్ శాఖలో సిబ్బంది సంక్షేమ సంఘాల యూనిట్లకు సంబంధించి ప్యానల్ విధానంలో ఎన్నికలు జరుగుతున్న వేళ.. సీఐడీలో మాత్రం అందుకు భిన్నంగా ప్రత్యక్ష ఎన్నికలు నిర్వహించడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ ఎన్నికల్లో హుజూరాబాద్ మండలం రంగాపూర్ గ్రామానికి కి చెందిన ఎస్సై బెల్లపు స్వామి ఘన విజయం సాధించి సీఐడీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు.ఎన్నికల్లో మొత్తం 478 ఓట్లు పోలవగా, బెల్లపు స్వామికి 259 ఓట్లు లభించాయి. ప్రత్యర్థిపై 144 ఓట్ల ఆధిక్యంతో విజయం సాధించి రాష్ట్ర సీఐడీ ఉపాధ్యక్ష పదవిని కైవసం చేసుకున్నారు.బెల్లపు స్వామి హుజురాబాద్ నియోజకవర్గానికి చెందిన వ్యక్తి కావడంతో ఆయన విజయం పట్ల నియోజకవర్గంలోని పలువురు ప్రముఖులు, రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు అభినందనలు తెలిపారు. గతంలో కరీంనగర్ టాస్క్ ఫోర్స్, జమ్మికుంట లో ఎస్సైగా విధులు నిర్వహించారు.సీఐడీ సిబ్బంది సంక్షేమం కోసం మరింత సమర్థవంతంగా పనిచేయాలని ఆకాంక్షించారు.సీఐడీ డీజీని కలిసిన బెల్లపు స్వామిరాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన అనంతరం బెల్లపు స్వామి సీఐడీ డీజీ చారు సిన్హా, ఐపీస్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తన ఎన్నికకు సంబంధించిన విషయాలను తెలియజేసి, సీఐడీ సిబ్బంది సంక్షేమానికి కృషి చేస్తానని తెలిపారు.

## చాకలి ఐలమ్మ ఆశయాలను కొనసాగించాలి...

- జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ చైర్ పర్సన్ పుల్లూరి స్వప్న సదానందం...



కరీంనగర్/జమ్మికుంట/సెప్టెంబర్ 10/అక్షరం న్యూస్:

చాకలి ఐలమ్మ ఆశయాలను కొనసాగించాలనిజమ్మికుంట వ్యవసాయ మార్కెట్ చైర్ పర్సన్ పుల్లూరి స్వప్న సదానందం అన్నారు. జమ్మికుంట మండలం వావిలాల గ్రామంలోచాకలి ఐలమ్మ 41వ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మార్కెట్ చైర్ పర్సన్ హాజరై ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా మార్కెట్ చైర్ పర్సన్ పుల్లూరి స్వప్న సదానందం మాట్లాడుతూ.. తెలంగాణ సాయుధ పోరాటంలో చాకలి ఐలమ్మ ధైర్యసాహసాలు, పోరాట పటిమ ఎంతో స్ఫూర్తిదాయకమన్నారు. భూస్వామ్య దోపిడీకి వ్యతిరేకంగా పోరాడి పేదలు, బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం ఆమె చేసిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు.ఐలమ్మ చూపిన ధైర్యం, ఆత్మగౌరవం, సామాజిక న్యాయం కోసం పోరాడే తత్వాన్ని నేటి తరం ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఆమె ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కొండ అర్జున్ గౌడ్, నగరం, నాగారం, పాపక్కపల్లి గ్రామాల సర్పంచులు, మాజీ ఎంపీటీసీ సభ్యులు, రజక సంఘం అధ్యక్షులు బొడ్డుపల్లి ఓదెలు, గౌరవాధ్యక్షులు కాసర్ల ఓదెలు, వర్కింగ్ ప్రెసిడెంట్ బొడ్డుపల్లి సతీష్, ప్రధాన కార్యదర్శి రాగాల చంద్రమౌళి, కోశాధికారి బొడ్డుపల్లి శంకర్, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

## 38వ డివిజన్లో వెయ్యి రోజుల సంబరాలు




జ్యోతినగర్, ఎన్టీపీసీ సెప్టెంబర్ 10 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్ : కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా 38వ డివిజన్ కార్పొరేటర్ నెలకంటి రాము ఆధ్వర్యంలో గురువారం డివిజన్లో ర్యాలీ నిర్వహించి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు.డివిజన్లో 300కు పైగా రేషన్ కార్డులు, వృద్ధాప్య, వితంతు, వికలాంగుల పెన్షన్లు మంజూరయ్యాయని తెలిపారు. ఐదు కిలోమీటర్ల మేర మంచినీటి పైప్లైన్ నిర్మాణం, ప్రతినెల నాలాల శుద్ధి, పారిశుద్ధ్య కార్యక్రమాలు, వీధిలైట్ల మరమ్మతులను నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు నెలకంటి రాము పేర్కొన్నారు. రామగుండంలో ఎమ్మెల్యే చేపడుతున్న అభివృద్ధిని ఓర్వలేక బీఆర్ఎస్ నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. చిరు వ్యాపారులు, మెకానిక్లు, టీ దుకాణదారులకు శాశ్వత భవనాల్లో వ్యాపారాలు నిర్వహించుకునే అవకాశం కల్పించిన ఘనత ఎమ్మెల్యేకే దక్కుతుందన్నారు.కార్యక్రమంలో 38వ డివిజన్ ఇన్చార్జ్ సుతారి లక్ష్మణ్ బాబు, మాజీ కార్పొరేటర్లు బొమ్మక రాజేష్, కవ్వంపల్లి కనక లక్ష్మీ, కాంగ్రెస్ సీనియర్ నాయకులు కోటరాజు, డివిజన్ అధ్యక్షులు పంజాల ఆంజనేయులు, ధనాల ప్రకాష్ రావు, గన్రెటి గురుమూర్తి, సింహాచలం, పోరండ్ల మురళి, శనిగరపు మల్లేష్, మంద రమేష్, నేరెళ్ల రాజకుమార్, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కనక లక్ష్మీ రజిత, వడ్ల నారాయణ, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలకు విలువైన సౌండ్ సిస్టం బహుకరణ





జ్యోతినగర్, ఎన్టీపీసీ సెప్టెంబర్ 10 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్: జన్మదిన వేడుకలను హంగూ ఆర్భాటాలకు దూరంగా, సమాజానికి ఉపయోగపడేలా నిర్వహించడం అభినందనీయమని ట్రస్ట్ అధ్యక్షులు కంకటి రవి గౌడ్ అన్నారు. మేకల శ్రీధర్ యాదవ్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఆయన సహకారంతో శ్రీ భగవతీ హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో విలేజ్ రామగుండం ప్రభుత్వ పాఠశాలకు రూ.20,800 విలువైన సౌండ్ సిస్టమ్ను గురువారం అందజేశారు. అలాగే విద్యార్థులకు టైలు, ఇతర సామగ్రిని అందించారు.ఈ సందర్భంగా మేకల శ్రీధర్ యాదవ్ మాట్లాడుతూ.. పాఠశాలలో గత కొన్నేళ్లుగా మైక్ సెట్ లేకపోవడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రతిరోజూ నిర్వహించే ప్రార్థనా కార్యక్రమాలతో పాటు జాతీయ పండుగలు, సాంస్కృతిక కార్యక్రమాలు, సమావేశాలు, విద్యార్థుల ప్రతిభా ప్రదర్శనలకు సౌండ్ సిస్టమ్ అవసరమని చెప్పారు. డ్యాన్స్ వంటి కార్యక్రమాల సమయంలో విద్యార్థులు మొబైల్ ఫోన్లలో పాటలు పెట్టుకుని సాధన చేయాల్సి వస్తోందని పేర్కొన్నారు. ఇకపై పాఠశాలలో నిర్వహించే వివిధ కార్యక్రమాలకు ఈ సౌండ్ సిస్టమ్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు.కంకటి రవి గౌడ్ మాట్లాడుతూ.. పుట్టినరోజు అంటే కేవలం వేడుకగా కాకుండా, మరొకరి జీవితంలో వెలుగు నింపే సందర్భంగా మలుచుకోవడం గొప్ప విషయమన్నారు. హంగూ ఆర్భాటాలకు దూరంగా మానవతా దృక్పథంతో సమాజానికి తనవంతు సహాయం చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. శ్రీధర్ యాదవ్ సేవా స్ఫూర్తి మరెందరో దాతలకు ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు.ఈకార్యక్రమంలో పైడ సాయికుమార్, జూల విజయ్కుమార్, రమేష్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు గడ్డం చంద్రయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## నేత్రదానం చేసిన 70 ఏళ్ల వృద్ధురాలు

- అభినందించిన సదాశయ ఫౌండేషన్, లయన్స్ క్లబ్ ప్రతినిధులు




జ్యోతి నగర్ ఎన్టిపిసి సెప్టెంబర్ 10 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

తల్లిని కోల్పోయిన పుట్టెడు దుఃఖంలోనూ ఆ కుటుంబం తీసుకున్న నిర్ణయం మరో ఇద్దరి జీవితాల్లో వెలుగులు నింపనుంది. పరుశురాంనగర్కు చెందిన మారం వీరమ్మ(70) అనారోగ్యంతో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందారు. ఆమె నేత్రాలను దానం చేసేందుకు కుమారులు, కోడళ్లు మారం రాజయ్య--రమాదేవి, తిరుపతి--సుజాత, కుమార్--అంజలి, శ్రీనివాస్--శ్రీలత, కుమార్తె--అల్లుడు ఆవుల వరలక్ష్మి--కృష్ణంరాజు ముందుకొచ్చారు. సదాశయ ఫౌండేషన్ జాతీయ ప్రచార కార్యదర్శి కే.ఎస్. వాసు ఆధ్వర్యంలో ఎల్వీ ప్రసాద్ ఐ బ్యాంక్ టెక్నీషియన్ ప్రదీప్ నాయక్ సహకారంతో వీరమ్మ నేత్రాలను సేకరించి హైదరాబాద్కు తరలించారు. నేత్రదాతకు నివాళులర్పించిన అనంతరం కుటుంబ సభ్యులను అభినందించారు. తల్లి మరణ విషాదంలోనూ ఇద్దరు అంధులకు చూపును ప్రసాదించాలన్న కుటుంబ నిర్ణయం మానవత్వానికి నిదర్శనమని, కాలనీలోని మరెందరికో స్ఫూర్తిగా నిలుస్తుందని కొనియాడారు. సదాశయ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు శ్రవణ్కుమార్, కార్యదర్శి సీహెచ్.లింగమూర్తితోపాటు లయన్స్ క్లబ్ ప్రతినిధులు పి.మల్లికార్జున్, ఖాజాంపురం రాజేందర్ తదితరులు కుటుంబ సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో మామిడి కుమారస్వామి, రాంబాబు, మామిడి సత్యనారాయణ, జక్కుల శ్రీనివాస్, ఆవుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## మట్టి వినాయకుల ప్రతిష్ఠతో పర్యావరణ పరిరక్షణ




జ్యోతినగర్, ఎన్టీపీసీ సెప్టెంబర్ 10 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్: వినాయక చవితి సందర్భంగా పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఆలయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాల ప్రతిష్ఠపై ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. గణేష్నగర్లోని సిద్ధార్థ పాఠశాలలో మాజీ కార్పొరేటర్, ఆలయ ఫౌండేషన్ ప్రతినిధి అయిత శివకుమార్ ఆధ్వర్యంలో గురువారం ప్రత్యేక అవగాహన కార్యక్రమం చేపట్టారు.ఈ సందర్భంగా సిద్ధార్థ పాఠశాల కరస్పాండెంట్ మల్లవజ్జుల విజయానంద్ మట్టి వినాయకులపై రూపొందించిన అవగాహన పోస్టర్ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆలయ ఫౌండేషన్ వ్యవస్థాపకులు, ఐఏఎస్ అధికారి పరికిపండ్ల నరహరి అధికారిగా వివిధ బాధ్యతల్లో అనేక సంస్కరణలు, మార్పులకు శ్రీకారం చుట్టి ప్రత్యేక గుర్తింపు పొందారని అన్నారు. ఆయన మార్గదర్శకత్వంలో ఆలయ ఫౌండేషన్ ద్వారా తెలంగాణవ్యాప్తంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు.వినాయక చవితి వేడుకల్లో పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని విజయానంద్ సూచించారు. మట్టి వినాయక విగ్రహాలను పూజించడం ద్వారా పర్యావరణానికి మేలు జరుగుతుందని తెలిపారు. ఆలయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అయిత శివకుమార్ చేపట్టిన మట్టి వినాయకుల ప్రచార కార్యక్రమానికి సిద్ధార్థ పాఠశాల తరఫున పూర్తి మద్దతు ఇస్తున్నామని పేర్కొన్నారు. విద్యార్థులు తమ కుటుంబాల్లో మట్టి వినాయకులనే ప్రతిష్ఠించేలా అవగాహన కల్పిస్తామని తెలిపారు.ప్రజలంతా మట్టి వినాయకులను పూజించి పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ అయిత శివకుమార్, పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఆలయ ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## వీర వనిత చాకలి ఐలమ్మ వర్ధంతి కార్యక్రమం



పెద్దపల్లి జిల్లా / సుల్తానాబాద్/, సెప్టెంబర్ 10 /, అక్షరం న్యూస్.

సుల్తానాబాద్ మండలం ఐతరాజు పల్లి గ్రామంలో రజక సంఘం ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ 41,వ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి గా సర్పంచ్ దీకొండ భూమేష్ కుమార్ హాజరై వీర వనిత చాకలి ఐలమ్మ చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం అహర్నిశలు పోరాడిన తెలంగాణ వీర వనిత చాకలి ఐలమ్మ ధైర్య సాహసాలను కొనియాడారు. గ్రామంలోని రజక సంఘ సభ్యులు గ్రామంలో చాకలి ఐలమ్మ విగ్రహం పెట్టాలనుకుంటే తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమం లో రజక సంఘం అధ్యక్షులు ,వార్డ్ మెంబర్ పున్నం సాయి కుమార్, వైస్ ప్రెసిడెంట్ దురిశెట్టి రాజేశం,వార్డ్ మెంబర్స్ పున్నం రజిత- రాజు , న్యాతరి అరవింద్, గ్రామ పెద్దలు అన్నం తిరుపతి రెడ్డి, ఎర్రం మల్లారెడ్డి,దాసరి నారాయణ రెడ్డి, నల్ల రవీందర్ రెడ్డి, మడ్డి సంపత్, రజక సంఘం సభ్యులు తరిగొప్పుల వెంకటయ్య, నేరెళ్ల వెంకటేశం పున్నం చంద్రయ్య,పున్నం శ్రీనివాస్,తరిగొప్పుల తిరుపతి,పున్నం సంపత్ కాల్వ రాజయ్య, తరిగొప్పుల పోచాలు, తరిగొప్పుల సంపత్,పున్నం సందీప్ ,దూరిశెట్టి రాకేష్,పున్నం అఖిల్,తదితరులు పాల్గొన్నారు.

## హర్ష హై స్కూల్ ఉపాధ్యాయులకు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు



పెద్దపల్లి జిల్లా / సుల్తానాబాద్/, సెప్టెంబర్ 10 /, అక్షరం న్యూస్.

సుల్తానాబాద్ మండలం కనుకుల గ్రామానికి చెందిన హర్ష హై స్కూల్ పాఠశాల ఉపాధ్యాయులు కె. మౌనిక,ఎ నాగలక్ష్మిలు ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. గురువారం రోజు ట్రాస్మా జిల్లా నాయకులు చేతుల మీదుగా ఈ అధ్యాపకులకు అవార్డు ప్రదానం చేశారు.ఈ సందర్భంగా ప్రముఖ విద్యావేత్త ఏం.శంకరయ్య, కరస్పాండెంట్,ఏం. ఉమాదేవి, పాఠశాల డైరెక్టర్ ఎస్.కె. ఇక్బాల్, సాధన డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వి. కిరణ్ హర్షం వ్యక్తం చేశారు

## ఘనంగా చాకలి ఐలమ్మ వర్ధంతి



జనగామ జిల్లా/రఘునాథపల్లి/( అక్షరం న్యూస్)సెప్టెంబరు 10: వీరనారి చాకలి ఐలమ్మ పోరాటం భావితరాలకు స్ఫూర్తిగా నిలుస్తుందని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు రాపర్తి రాజు అన్నారు. చాకలి ఐలమ్మ 41వ వర్ధంతి సందర్భంగా మండల కేంద్రంలో సిపిఎం నాయకులు గురువారం ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు పొదల నాగరాజు, శాగ యాదగిరి, భీమగొని చంద్రయ్య, కడారి ఐలయ్య, పొదల లవకుమార్, కాసాని పుల్లయ్య, మంచాల మల్లేష్, మైలారం వెంకటేశ్వర్లు, పులిగిల్ల రాజు, అశోక్, అంజనేయులు, నర్సయ్య, నవీన్, అరుణ్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి చిరస్మరణీయం

- చాకలి ఐలమ్మ ఒక వ్యక్తి పేరు కాదు.. ఒక పోరాట స్ఫూర్తి
- ఆమె ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే నిజమైన నివాళి
- పెద్దపల్లి జిల్లా రజక సంఘం సమన్వయకర్త నాగెల్లి సాంబయ్య



రామగిరి,(పెద్దపల్లి జిల్లా), సెప్టెంబర్ 10, అక్షరం న్యూస్: తెలంగాణ ప్రజా పోరాట చరిత్రలో వీరనారి చాకలి ఐలమ్మది స్ఫూర్తిదాయకమైన స్థానమని పెద్దపల్లి జిల్లా రజక సంఘం సమన్వయకర్త నాగెల్లి సాంబయ్య అన్నారు. గురువారం రామగిరి మండల రజక సంఘం ఆధ్వర్యంలో వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాగెల్లి సాంబయ్య మాట్లాడుతూ.. చిట్యాల ఐలమ్మగా జన్మించిన ఆమె సామాజిక, ఆర్థిక అసమానతలు, భూస్వాముల దోపిడీ, వెట్టి చాకిరీ వంటి దురాచారాలను ధైర్యంగా ఎదిరించారని తెలిపారు. వ్యవసాయం చేస్తూ తన భూమి, పంటపై తనకే హక్కు ఉందని స్పష్టం చేస్తూ విస్నూరు దేశ్‌ముఖ్ రాంచంద్రారెడ్డి ఆధిపత్యానికి వ్యతిరేకంగా ఆమె చేసిన పోరాటం తెలంగాణ రైతులు, పేదలు, అణగారిన వర్గాల్లో పోరాట స్ఫూర్తిని నింపిందన్నారు. ఆంధ్ర మహాసభతో పాటు కమ్యూనిస్టు ఉద్యమంలోనూ చురుకుగా పాల్గొన్న ఐలమ్మ.. నిజాం పాలన, భూస్వామ్య దోపిడీకి వ్యతిరేకంగా ప్రజలను చైతన్యపరిచారని పేర్కొన్నారు. ఆమె పోరాటం కేవలం భూమి కోసం మాత్రమే కాకుండా సామాజిక న్యాయం, ఆత్మగౌరవం, సమానత్వం కోసం జరిగిన పోరాటానికి ప్రతీకగా నిలిచిందని అన్నారు. 1985 సెప్టెంబర్ 10న ఐలమ్మ మరణించినప్పటికీ, ఆమె ధైర్యం, ఆత్మగౌరవం, ప్రజల హక్కుల కోసం చేసిన పోరాటం నేటికీ తెలంగాణ సమాజానికి స్ఫూర్తి నిస్తోందన్నారు. అన్యాయాన్ని ఎదురైనప్పుడు భయపడకుండా హక్కుల కోసం ఐక్యంగా నిలవాలని, సమాజంలో సమానత్వం, సామాజిక న్యాయం కోసం కృషి చేయాలని ఆమె జీవితం సందేశమిస్తోందన్నారు. ఐలమ్మ ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ఆమెకు మనం అందించే నిజమైన నివాళి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం పెద్దపల్లి జిల్లా ఉపాధ్యక్షులు మదాసి శ్రీనివాస్, రజక సంఘం విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షులు బండి రంజిత్ కుమార్, మండల అధ్యక్షుడు ధర్మల రాజయ్య, సెంటినరీ కాలనీ పట్టణ అధ్యక్షులు పొన్నం సమ్మయ్య, ప్రధాన కార్యదర్శి బండి మొండయ్య, వార్డు సభ్యులు పొన్నం మణి, చెలికట్ల మల్లేష్, కోదూరుపాక భీమయ్య, ఉల్లగుల రాజయ్య, కొల్లూరి రాములు, బండి అంకుల్, ఎదుల్ల సదయ్య, సీహెచ్. ఐలయ్య, జంగపల్లి లింగయ్య, మాదాసి రాజయ్య, ధర్మముల భూమయ్య, టీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఇసంపల్లి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## నూతన సీఎంవోను మర్యాదపూర్వకంగా కలిసిన ఎన్ఎంయూ--ఇంటక్ ప్రతినిధులు



జ్యోతినగర్, ఎన్టీపీసీ సెప్టెంబర్ 10 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్ : రామగుండం, తెలంగాణ ప్రాజెక్టుల ధన్వంతరి ఆసుపత్రి నూతన చీఫ్ మెడికల్ ఆఫీసర్‌గా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ భావనీష్ సమన్‌ను ఎన్టిపిసి మజ్దూర్ యూనియన్ --ఇంటక్ యూనియన్ ప్రతినిధులు గురువారం సాయంత్రం ఆయన చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ధన్వంతరి ఆసుపత్రిలో ఉద్యోగులు, కార్మికులకు అవసరమైన పలు వైద్య సదుపాయాలు, ఇతర వైద్య అవసరాలపై యూనియన్ తరఫున నూతన సీఎంవో దృష్టికి తీసుకెళ్లారు. ఆసుపత్రిలో వైద్య సేవలను మరింత మెరుగుపరిచి ఉద్యోగులకు మెరుగైన వైద్య సదుపాయాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ సువార్తను రావ్ , జనరల్ సెక్రటరీ వేముల కృష్ణయ్య, 24వ డివిజన్ కార్పొరేటర్ కొలాని కవిత వెంకట్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ సంధినేని గోపాల్ రావు, చీఫ్ వైస్ ప్రెసిడెంట్ నేరెళ్ల రమేష్, మధుసూదన్ రావు, బడుగు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించాలి డీఎస్పీ నాగేంద్ర చారి




రాజన్న సిరిసిల్ల /ముస్తాబాద్ /సెప్టెంబర్ -10(అక్షరం న్యూస్ )

ముస్తాబాద్ మండలం లో గణేష్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించాలని మండపాల నిర్వాహకులకు డీఎస్పీ నాగేంద్ర చారి సూచించారు. డీజేలకు అనుమతి లేదని స్పష్టం చేశారు. గురువారం ముస్తాబాద్ మండల కేంద్రంలోని మండపాల నిర్వాహకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. ప్రజా రవాణాకు, అత్యవసర వాహనాల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా గణేష్ మండపాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. నవరాత్రి ఉత్సవాల్లో డీజేలకు అనుమతి లేదని, పోలీసుల అనుమతితో మాత్రమే సౌండ్ సిస్టమ్ వినియోగించాలని స్పష్టం చేశారు. మండపాల వద్ద ప్రమాదాలు జరగకుండా నిర్వాహకులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, భక్తిశ్రద్ధలు పెంపొందించే పాటలు మాత్రమే వినిపించాలని సూచించారు. ఇతరులకు ఇబ్బంది కలిగించే విధంగా కార్యక్రమాలు నిర్వహించవద్దన్నారు. రాత్రి వేళల్లో మండపాల వద్ద నిర్వాహకులు తప్పనిసరిగా ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. మద్యం సేవించి అల్లర్లు సృష్టించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ నాగేంద్ర చారి హెచ్చరించారు. మండపాల నిర్వాహకులకు ఏవైనా సమస్యలు ఎదురైతే వెంటనే పోలీసుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. సమావేశంలో సిరిసిల్ల రూరల్ సీఐ నాగేశ్వరరావు,తహసీల్దార్ ఫరూక్, ఎంపీడీఓ లచ్చాలు,ముస్తాబాద్ ఎస్సై జ్యోతి, సెస్ డైరెక్టర్ సందుపట్ల అంజిరెడ్డి,పోలీస్ సిబ్బంది, ఆయా గ్రామాల సర్పంచ్ లు గణేష్ మండపాల నిర్వాహకులు పాల్గొన్నారు

## ఒక్క సీసీ కెమెరా.. వంద మంది పోలీసులతో సమానం!

- ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలే రక్షణ కవచం..
- ముల్కనూర్ ఎస్సై రాజు...



హన్మకొండ జిల్లా/భీమదేవరపల్లి/ సెప్టెంబర్ 11/అక్షరం న్యూస్:-

గ్రామాల్లో నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు ఎంతో ఉపయోగపడతాయని ప్రతి గ్రామంలో వీటిని ఏర్పాటు చేసుకునేందుకు ప్రజలు ముందుకు రావాలని ముల్కనూర్ ఎస్సై రాజు సూచించారు. మండలంలోని ముత్తారం గ్రామ పంచాయతీ ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎనిమిది సీసీ కెమెరాలను గురువారం సర్పంచ్ భారతి జైపాల్‌రెడ్డితో కలిసి ఎస్సై రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ పాలకవర్గం ముదిరాజ్ సంఘం సభ్యులను సన్మానించి అభినందించారు. గ్రామాల్లో తరచూ చోరీలు జరుగుతున్న నేపథ్యంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం ద్వారా నేరాలను అరికట్టడంతో పాటు నిందితులను గుర్తించేందుకు అవకాశం ఉంటుందని ఎస్సై తెలిపారు. ముత్తారం గ్రామపంచాయతీని ఆదర్శంగా తీసుకుని మండలంలోని అన్ని గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రజలు సహకరించాలని కోరారు. ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానంగా పనిచేస్తుందని అన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ మాట్ల హరికుమార్, ముదిరాజ్ సంఘం సభ్యులు కూన పెద్ద కనకయ్య, కూన చిన్న కనకయ్య, కూన రాజా సమ్మయ్య, కూన శంకర్, కూన భిక్షపతి, కూన రమేష్, పంచాయతీ పాలకవర్గ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## ఘనంగా చిట్యాల చాకలి ఐలమ్మ వర్ధంతి వేడుకలు



రాజన్నసిరిసిల్ల /ముస్తాబాద్ /సెప్టెంబర్ -10(అక్షరం న్యూస్ )

తెలంగాణ సాయుధ పోరాట వీరనారి చాకలి ఐలమ్మ 41వ వర్ధంతి వేడుకలనురజక సంఘం ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమానికి రజక సంఘము రాష్ట్ర అధ్యక్షులు అక్క రాజు శ్రీనివాస్ తో పాటు వివిధ పార్టీల అధ్యక్షులు, నాయకులు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. చాకలి ఐలమ్మ విగ్రహానికి రజక సంఘం నాయకులతో కలిసి వారు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరీ విముక్తి కోసం నాడు భూస్వాములకు వ్యతిరేకంగా ఐలమ్మ చేసిన విరోచిత పోరాటం నేటి తరానికి ఎంతో స్ఫూర్తిదాయకమని కొనియాడారువివక్షకు వ్యతిరేకంగా ఆమె చేసిన పోరాటం తెలంగాణ సాధన ఉద్యమానికి నాంది పలికిందన్నారు. తెలంగాణ చరిత్రలో చిట్యాల ఐలమ్మ పాత్ర వెలకట్టలేనిదన్నారు. బడుగు జీవుల అస్థిత్వాన్ని పరిరక్షించడానికి బందుకులు పట్టి సమానత్వం కోసం పోరాడిన వీరనారి చాకలి ఐలమ్మ అన్నారు ఈ కార్యక్రమం లో మండల రజక సంఘము అధ్యక్షులు సుద్దాల దేవయ్య,రజక కులాల రాష్ట్ర అధ్యక్షులు అక్క రాజు శ్రీనివాస్,మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ మట్ట వెంకటేశ్వర్ రెడ్డి,,కాంగ్రెస్ , ముస్తాబాద్ మండల అధ్యక్షులు గజ్జల రాజు, బీజేపీ మండల అధ్యక్షులు సౌళ్ళ క్రాంతి, కాంగ్రెస్ కార్యదర్శి ఏళ్ల బాల్ రెడ్డి,, శీలం స్వామి, మనోహర్, దీటి బాలయ్య, సత్య, హనుమయ్య, భాను నరేష్, దీటి నరసింహులు, గీస శంకర్ తదితరులు పాల్గొన్నారు

## బీ ఆర్ ఎస్వి నాయకుల ముందస్తు అరెస్ట్



రాజన్న సిరిసిల్ల /ముస్తాబాద్ /సెప్టెంబర్ -10(అక్షరం న్యూస్ )

నిరుద్యోగుల రాష్ట్ర జేఏసీ పిలుపులో భాగంగా వారికి మద్దతుగా పోరాటం చేస్తున్నందుకు అసెంబ్లీ ముట్టడి కి వెళ్తారని ముస్తాబాద్ మండల బీ ఆర్ ఎస్వి నాయకులను అరెస్ట్ చేశారు,ఈ సందర్భంగా మండల బీ ఆర్ ఎస్ వి అధ్యక్షులు ఎండీ నవాజ్ మాట్లాడుతూ నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించే వరకు రెండు లక్షల ఉద్యోగాలు ప్రకటించే వరకు వారి పక్షాన మా పోరాటం ఆగదన్నారు మా పోరాటాన్ని అరెస్టులతో ఆపలేరని నిరుద్యోగుల కోసం మా పోరాటం కొనసాగుతూనే ఉంటుంది అన్నారు. వీరికి ముస్తాబాద్ బీ ఆర్ఎస్ నాయకులు సంఘీభావం తెలిపారు.



## తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలని తహసీల్దార్ కు వినతిపత్రం



రాజన్న సిరిసిల్ల /ముస్తాబాద్ /సెప్టెంబర్ -10(అక్షరం న్యూస్ )

సెప్టెంబర్ 17న తెలంగాణ విమోచన దినోత్సవాన్ని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేస్తూ భారతీయ జనతా పార్టీ ముస్తాబాద్ మండల అధ్యక్షులు సౌల్ల క్రాంతికుమార్ ఆధ్వర్యంలో గురువారం తహసిల్దార్ కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బిజెపి మండల నాయకులు మాట్లాడుతూ, నిజాం రజాకార్ల నిరంకుశ పాలన నుండి తెలంగాణ ప్రాంతానికి విముక్తి లభించిన రోజు సెప్టెంబర్ 17 అని గుర్తు చేశారు. అమరుల త్యాగాలను స్మరించుకుంటూ ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, కళాశాలల్లో జాతీయ జెండాను అధికారికంగా ఎగురవేసి తెలంగాణ విమోచన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని వారు విజ్ఞప్తి చేశారు. మండల పరిధిలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో సెప్టెంబర్ 17న మువ్వన్నెల జెండా ఆవిష్కరించి విమోచన పోరాట అమరవీరుల త్యాగాలను స్మరిస్తూ అధికారిక కార్యక్రమాలు చేపట్టలని విజ్ఞప్తి చేశారు యువతకు తెలంగాణ విమోచన చరిత్రను తెలియజేసే విధంగా విద్యాసంస్థల్లో ప్రత్యేక కార్యక్రమాలు. చేపట్టాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి ఎదునూరి గోపికృష్ణ,జిల్లా కార్యదర్శి మీసా సంజీవ్,జిల్లా కౌన్సిల్ మెంబర్ మెరుగు అంజాగౌడ్,ఆవునూర్ సర్పంచ్ నక్కదాసరి రవీందర్ ఉప సర్పంచ్ లు కోలా కృష్ణా, దగ్గు నవీన్ ఉపాధ్యక్షులు తిరుపతి,చికోటి మహేష్,కాసోడి రమేష్,చిట్టినేని శ్రీనివాస్ రావు, కుడుకల జనార్దన్,మహేష్,శక్తి కేంద్ర ఇంచార్జి లు గూడా బాల్ రెడ్డి,కట్కం మహేష్,మీస స్వామి,కాసరపు రవి,మామిండ్ల బిక్షపతి,హార్షవర్ధన్,యాదగిరి,శ్యామ్, ప్రణవ్,సాయి బీజేపీ సభ్యులు పాల్గొన్నారు.

## ఎలుకలపల్లి గేట్లో ఘనంగా చాకలి ఐలమ్మ వర్ధంతి



జ్యోతినగర్, ఎన్టీపీసీ సెప్టెంబర్ 10 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్ : భూమి కోసం, భుక్తి కోసం దొరల అహంకారాన్ని ఎదిరించి, నిరుపేదల హక్కుల కోసం పోరాడిన వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతిని ఎఫ్‌సీఐ జీపీ గేట్‌లోని శ్రీ మల్లేశ్వర రజక సంఘం ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. చాకలి ఐలమ్మ స్ఫూర్తితో రజకులు తమ హక్కుల కోసం ఐక్యంగా ముందుకు సాగాలని పలువురు నాయకులు పిలుపునిచ్చారు. సామాజిక అసమానతలకు వ్యతిరేకంగా ఐలమ్మ సాగించిన పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. కార్యక్రమంలో చాకలి ఐలమ్మ విగ్రహం కోర్టు చౌరస్తా వ్యవస్థాపక అధ్యక్షుడు పాలడుగుల కనకయ్య, ఎఫ్‌సీఐ మల్లేశ్వర రజక సంఘం నాయకులు నగునూరి కనకయ్య, పున్నం కుమార్, రాపాల మల్లయ్య, బొడ్డుపల్లి నారాయణ, రాచూరి నర్సయ్య, మడికొండ శంకర్, పెనుగొండ నర్సింగ్, పున్నం రాజు, పున్నం సంపత్ తదితరులు పాల్గొన్నారు. అలాగే డివిజన్ కార్పొరేటర్లు కందుల స్వరూప--సతీష్, కన్నూరి భాగ్యలక్ష్మి--శంకర్, గౌరవ కార్పొరేటర్లు ఆడపు రాజేశం, ప్రభంజన్ రెడ్డి, పల్ల లక్ష్మణ్, బక్కన్న, మేకల రామస్వామి, షరీఫ్, వేణు, తాజ్, శాతరాజు కొమురయ్య, ముఖ్యర్ వెంకటేష్‌తో పాటు వివిధ కుల సంఘాల నాయకులు, పార్టీ నాయకులు పాల్గొని చాకలి ఐలమ్మకు ఘన నివాళులర్పించారు.



# పంచాయతీ స్థలంపై హక్కులు కల్పించాలి

• స్థలంపై బీజేపీ జిల్లా కార్యదర్శి పృధ్వీరాజ్‌గౌడ్ డిమాండ్



హన్మకొండ జిల్లా/భీమదేవరపల్లి/ సెప్టెంబర్ 10/అక్షరం న్యూస్:-

గ్రామపంచాయతీ అవసరాల కోసం కొనుగోలు చేసిన స్థలాన్ని పంచాయతీకే పూర్తి హక్కులతో అప్పగించాలని బీజేపీ సిద్ధిపేట జిల్లా కార్యదర్శి పైడిపెల్లి పృధ్వీరాజ్‌గౌడ్ డిమాండ్ చేశారు. గట్లనర్సింగాపూర్ గ్రామపంచాయతీకి సంబంధించిన వివాదాస్పద స్థలంపై అధికారులు సమగ్రంగా విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

గ్రామపంచాయతీ కార్యాలయానికి అవసరమైన స్థలం కోసం 1992లో ఆరు గుంటల భూమిని గుంటకు రూ.1,000 చొప్పున మొత్తం రూ.6,000కు వ్రాతపూర్వకంగా కొనుగోలు చేసినట్లు పృధ్వీరాజ్‌గౌడ్ తెలిపారు. పంచాయతీ అవసరాల కోసం కొనుగోలు చేసిన స్థలం పంచాయతీ ఆధీనంలోనే ఉండాలని స్పష్టం చేశారు.అలాగే గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట ఉన్న విజయ డెయిరీ భవనం ప్రస్తుతం ప్రైవేటు సంస్థ పరిధిలోకి వెళ్లిన నేపథ్యంలో భవనం స్థలానికి సంబంధించిన హక్కులు వినియోగంపై అధికారులు పూర్తిస్థాయిలో పరిశీలన చేయాలని కోరారు. పంచాయతీ ఆధీనంలోని స్థలం గ్రామసభలు ప్రజా సమావేశాలు, గ్రామ అభివృద్ధి కార్యక్రమాల నిర్వహణకు ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.జిల్లా మండల స్థాయి అధికారులు స్పందించి సంబంధిత రికార్డులను పరిశీలించి. పంచాయతీకి సంబంధించిన స్థలాన్ని పంచాయతీకే అప్పగించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజా అవసరాల కోసం ఉద్దేశించిన పంచాయతీ స్థలాల విషయంలో పారదర్శకంగా వ్యవహరించి గ్రామ ప్రజల ప్రయోజనాలను కాపాడాలని పృధ్వీరాజ్‌గౌడ్ కోరారు.

# కాంట్రాక్టు కార్మికుల వేతనాలు పెంచాలి

•రామగుండం పారిశ్రామిక ప్రాంతానికి 'బి' గ్రేడ్ ఇవ్వాలి: ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్



జ్యోతినగర్, ఎన్టీపీసీ సెప్టెంబర్ 10 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్ : రామగుండం పారిశ్రామిక ప్రాంతాన్ని 'బి' గ్రేడ్‌గా ప్రకటించి ఇక్కడ పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు మెరుగైన వేతనాలు అందేలా చర్యలు తీసుకోవాలని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ ప్రభుత్వాన్ని కోరారు. గురువారం శాసనసభలో కార్మికుల సమస్యలను ప్రస్తావించిన ఆయన.. పారిశ్రామిక ప్రాంతంలో పనిచేస్తున్న కార్మికులకు జరుగుతున్న అన్యాయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు.రామగుండం పారిశ్రామిక ప్రాంతంలోని ఎన్టీపీసీ వంటి కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల్లో సుమారు 6 వేల మంది కాంట్రాక్టు కార్మికులు పనిచేస్తున్నారని ఎమ్మెల్యే తెలిపారు. రామగుండం ప్రాంతానికి 'బి' గ్రేడ్ హోదా కల్పిస్తే కాంట్రాక్టు కార్మికుల వేతనాలు పెరిగి వారికి ఆర్థికంగా మేలు జరుగుతుందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పెంచిన వేతనాల ప్రయోజనం ఈ ప్రాంతంలోని కార్మికులకు పూర్తిస్థాయిలో అందడం లేదని, కార్మిక శాఖ మంత్రి ఈ విషయాన్ని ప్రత్యేకంగా పరిశీలించాలని కోరారు.అదేవిధంగా కేసోరం సిమెంట్ పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికుల వేతనాలు కూడా ఆశించిన స్థాయిలో లేవని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ పరిశ్రమను తాజాగా అల్ట్రాటెక్ సంస్థ చేపట్టిన నేపథ్యంలో ఇతర ప్రాంతాల్లోని తమ సంస్థల కార్మికులకు అందిస్తున్న వేతనాల మాదిరిగానే రామగుండం కార్మికులకు కూడా మెరుగైన వేతనాలు అందించాలని డిమాండ్ చేశారు. రామగుండం పారిశ్రామిక ప్రాంతంలోని కార్మికుల సమస్యలను పరిష్కరించి వారికి న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

# ఎన్ ఎస్ యూ ఐ జిల్లా అధ్యక్షుడిని సన్మానించిన కాంగ్రెస్ నాయకులు



రాజన్న సిరిసిల్ల /ముస్తాబాద్ /సెప్టెంబర్ -10(అక్షరం న్యూస్ )

నూతనంగా నియామకమైన రాజన్న సిరిసిల్ల ఎన్ ఎస్ యు ఐ జిల్లా అధ్యక్షుడు దుద్దెడ భాను ను ముస్తాబాద్ కాంగ్రెస్ నాయకులు శాలువా తో సత్కారించి శుభాకాంక్షలు తెలిపారు. తెలిపిన వారిలో ముస్తాబాద్ మండల్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు కాంపల్లి శ్రీనివాస్ కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షులు కర్ణాకర్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు దీటి నర్సింలు కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ బాబు, ఏఎంసీ డైరెక్టర్ మామిళ్ళ శ్రీకాంత్ మంద కిషన్ తదితరులు ఉన్నారు

# పాత జ్ఞాపకాలు

•1980.ఫోటో ట్రెండ్..

•సామాన్యుల నుండి సెలబ్రిటీ వరకు..

•సోషల్ మీడియా లో వైరల్





రాజన్న సిరిసిల్ల /ముస్తాబాద్ /సెప్టెంబర్ -10(అక్షరం న్యూస్ )

1980 ఫొటో ట్రెండ్ అంటే వింటేజ్ ఫొటో ట్రెండ్ ఇప్పుడు వైరల్ ట్రెండ్‌గా మారింది.ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏ ఐ ) మన పాత జ్ఞాపకాలను మళ్ళీ గుర్తుచేయడంలో సరికొత్త విప్లవం వచ్చిందనే చెప్పాలి. ఇన్‌స్టాగ్రామ్, ఫేస్ బుక్ లో ఇప్పుడు 1980 లుక్‌లో కనిపించేందుకు అందరూ పోటీ పడుతున్నారు. సెలబ్రిటీలు మొదలు సామాన్యుల వరకు ఈ ఫొటో ట్రెండ్ ను ట్రై చేసి, తమ పిక్స్ ను సోషల్ మీడియాలో షేర్ చేసి, మురిసిపోతున్నారు. రెట్రో లుక్‌లో ఆ కాలంనాటి డ్రెస్సులు, మేకప్, వాచ్ వంటి యాక్సెసరీస్, హెయిర్ స్టైల్స్‌తో తామెలా కనిపిస్తామోనని క్రేజీగా ఫీల్ అయ్యేవారంతా ఏఐ టూల్ సాయంతో పాత స్టైల్‌లో సరికొత్తగా కనిపిస్తున్నారు.భారతీయ శైలి ఫోటోల కోసం 80ల నాటి ప్రసిద్ధ డిజైన్లను వాడుతున్నారు. మహిళలకు రంగురంగుల చీరలు, కర్లీ హెయిర్‌స్టైల్స్, పెద్ద ఆభరణాలు ఉపయోగిస్తుంటే, పురుషులకు లూజ్ షర్టులు, హై-వేస్ట్ ట్రాజర్లు, పెద్ద మీసాలు వింటేజ్ లుక్ ఇస్తున్నాయి. ఈ రోజుల్లో దిగిన సెల్ఫీపై ఫిల్టర్ వేయడం కంటే, నిజంగానే 1980ల్లో తీసిన ఫోటోలా అనిపించడమే ఈ ట్రెండ్ సాధించిన అసలైన విజయం.

# ఎన్ ఎస్ యూ ఐ కరీంనగర్ జిల్లా అధ్యక్షులు గా మహమ్మద్ ఇమ్రాన్



కరీంనగర్/జమ్మికుంట/, సెప్టెంబర్ 10/అక్షరం న్యూస్:

ఎన్ ఎస్ యు ఐ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడిగా మహమ్మద్ ఇమ్రాన్ నియమితులయ్యారు. తెలంగాణ రాష్ట్ర ఎన్ ఎస్ యు ఐ అధ్యక్షులు ఏడవల్లి వెంకట్ స్వామి ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు.ఈ సందర్భంగా మహమ్మద్ ఇమ్రాన్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీలో విద్యార్థి నాయకుడిగా తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించి, కాలేజీ అధ్యక్షుడిగా, ఎన్ ఎస్ యు ఐ నియోజకవర్గ కో-ఆర్డినేటర్‌గా, జిల్లా ప్రధాన కార్యదర్శిగా, జిల్లా ఉపాధ్యక్షులు గా వివిధ బాధ్యతలు నిర్వహించినట్లు తెలిపారు. అలాగే ఎన్ ఎస్ యు ఐ హుజురాబాద్ ఎమ్మెల్యే ఎన్నికల ఇంచార్జిగా, ఎమ్మెల్సీ ఎన్నికల్లో కరీంనగర్ జిల్లా కో-ఆర్డినేటర్‌గా సేవలందించినట్లు పేర్కొన్నారు.గత పది సంవత్సరాలుగా విద్యార్థుల సమస్యలపై పోరాడుతూ, వారి హక్కుల కోసం పనిచేస్తున్న తన సేవలను గుర్తించి జిల్లా అధ్యక్షుడిగా అవకాశం కల్పించిన రాష్ట్ర ఎన్ ఎస్ యు ఐ అధ్యక్షుడు ఏడవల్లి వెంకట్ స్వామికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.తన నియామకానికి సహకరించిన రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, కరీంనగర్ జిల్లా డీసీసీ అధ్యక్షుడు, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, కరీంనగర్ జిల్లా అర్ టీ ఏ మెంబర్ పడాల రాహుల్, కరీంనగర్ జిల్లా మ్మెల్సీ అభ్యర్థి ఆల్ఫోర్స్ నరేందర్ రెడ్డి, హుజురాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి వొడితల ప్రణవ్ బాబులకు ఇమ్రాన్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పార్టీకి, విద్యార్థి సంఘానికి అంకితభావంతో పనిచేస్తానని, విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతానని ఇమ్రాన్ స్పష్టం చేశారు. పార్టీ ఆదేశాలను తూచా తప్పకుండా అమలు చేస్తూ ఎన్ ఎస్ యు ఐ ని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు.

# వీరభద్రస్వామి సేవలో మంత్రి సతీమణి పొన్నం మంజుల

• శ్రావణమాసం సందర్భంగా

•ఆలయంలో రుద్ర, చండీ హోమాలు..

హన్మకొండ జిల్లా/భీమదేవరపల్లి/ సెప్టెంబర్ 10/అక్షరం న్యూస్:-

శ్రావణమాసాన్ని పురస్కరించుకుని మండలంలోని కొత్తకొండ గ్రామంలో కొలువుదీరిన శ్రీ వీరభద్రస్వామి దేవాలయంలో గురువారం రుద్రహోమం చండీహోమం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ సతీమణి పొన్నం మంజుల, ఆయన మాతృమూర్తి పొన్నం మల్లమ్మ హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు.ఆలయానికి చేరుకున్న పొన్నం మంజుల, పొన్నం మల్లమ్మలకు ఆలయ అర్చకులు, ఈవో కిషన్‌రావు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు అర్చనలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు.హోమ కార్యక్రమాలను వేదమంత్రోచ్చారణల మధ్య శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం అర్చకులు వేద ఆశీర్వచనం అందించి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో దీక్షాస్వాములు, భక్తులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# ప్రమాద రహిత ఉత్పత్తి లక్ష్యంగా పనిచేయాలి

•కేకే ఓ సి మేనేజర్ మధుసూదన్.




మంచిర్యాల జిల్లా/ మందమర్రి, సెప్టెంబర్ 10/ అక్షరం న్యూస్ -:

సంస్థ అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని ప్రతి ఉద్యోగి అధికారి అనే తేడా లేకుండా క్రమశిక్షణతో విధులు నిర్వహించాలని ప్రమాద రహిత ఉత్పత్తి లక్ష్యంగా పనిచేయాలని కేకే ఓ సి మేనేజర్ మధుసూదన్ తెలిపారు. గురువారం కేకే ఓసీ ఉద్యోగులు అధికారులను ఉద్దేశించి మాట్లాడారు. రక్షణ సూత్రాలను పాటించకపోవడం విధులు నిర్లక్ష్యంగా నిర్వహించడం వల్లనే ప్రమాదాలు సంభవిస్తాయని చెప్పారు. విధులలో చిన్న చిన్న పొరపాట్లే ప్రమాదాలకు కారణం అవుతాయని తెలిపారు. పని స్థలాలలో పక్క పర్యవేక్షణ ఉండాలని తెలిపారు. కేకే ఓ సి లో అధికారులు ఉద్యోగులు అనే తేడా లేకుండా కలిసికట్టుగా పనిచేస్తే సత్ఫలితాలు సాధిస్తాం అన్నారు. 2026 27 ఆర్థిక సంవత్సరానికి ఓసికి నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యం కంటే అదనపు ఉత్పత్తిని సాధించి సింగరేణిలోనే సరికొత్త రికార్డు నెలకొల్పాలన్నారు. ఇతర ఓసీల ఉద్యోగులకు కేకే ఓసి ఉద్యోగులు ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. అంతేకాకుండా బొగ్గు నాణ్యత ప్రమాణాలను తప్పక పాటించాలని అప్పుడే మార్కెట్లో మన బొగ్గుకు మంచి రేటు లభిస్తుందని తెలిపారు. ఓసీలలో ఏమైనా సమస్యలు ఉంటే వాటిని నా దృష్టికి తీసుకురావాలని నా పరిధిలో అయితే వెంటనే పరిష్కరిస్తానని కానట్లయితే పై అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి చొరవ చూపుతానని చెప్పారు. ఈ సందర్భంగా ఉద్యోగులు ఐ ఎన్ టి యు సి ఆధ్వర్యంలో మేనేజర్ కు పుష్పగుచ్ఛం అందజేసి శాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆ యూనియన్ చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆర్నకొండ ఆంజనేయులు, ఫిట్ కార్యదర్శి నూనె సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

# వరి పంటలకు 18 గంటల 3-ఫేస్ విద్యుత్ సరఫరా అందించాలి



మద్నూర్ / సెప్టెంబర్ 10 (అక్షరం న్యూస్ -- కామారెడ్డి):

సుల్తాన్‌పేట్ గ్రామ సర్పంచ్ రాజేశ్వర్ గౌడ్, గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకుడు సలీమ్ ఆధ్వర్యంలో గ్రామ రైతులు మెనూర్ గ్రామ విద్యుత్ సబ్‌స్టేషన్ సబ్ ఇంజినీయర్ సాయి రాజ్ కు కలిసి తమ సమస్యలను వివరించి వినతి పత్రాన్ని అందించడం జరిగింది . ప్రస్తుత సాగు సీజన్‌లో వరి పంటలకు సాగునీరు అందించేందుకు 3-ఫేస్ విద్యుత్ సరఫరాను నిరంతరాయంగా అందించాలని కోరుతూ ఏఈకి వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ వరి పంట సాగులో నీటి అవసరం అధికంగా ఉంటుందని, విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడితే పంటలకు అవసరమైన సమయంలో నీరు అందించలేని పరిస్థితి ఏర్పడుతుందని తెలిపారు. ముఖ్యంగా బోర్లు, వ్యవసాయ మోటార్లపై ఆధారపడి సాగు చేస్తున్న రైతులకు 3-ఫేస్ కరెంట్ సరఫరా ఎంతో అవసరమని పేర్కొన్నారు.వరి పంటలకు సాగునీటి కొరత లేకుండా ఉండేందుకు రోజుకు 18 గంటల పాటు 3-ఫేస్ విద్యుత్ సరఫరా అందించాలని రైతులు విద్యుత్ శాఖ అధికారులను కోరారు. విద్యుత్ సరఫరా సమయాలను ముందుగానే స్పష్టంగా తెలియజేయడంతో పాటు, సరఫరాలో తరచూ ఏర్పడుతున్న అంతరాయాలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.రైతుల సమస్యలను పరిశీలించి, ఉన్నతాధిరుల దృష్టికి తీసుకెళ్లి సాధ్యమైనంత మేరకు విద్యుత్ సరఫరా మెరుగుపరిచేలా చర్యలు తీసుకోవాలని సబ్ ఇంజీనియర్ ను కోరారు. ఈ కార్యక్రమంలో సుల్తాన్‌పేట్ గ్రామ సర్పంచ్ రాజేశ్వర్ గౌడ్, సలీమ్ తో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

# ప్రమాద బాధితుడికి ఎస్సై శ్రీనివాస్ ఆపన్నహస్త

•స్వయంగా వాహనంలో ఆసుపత్రికి తరలింపు.. సకాలంలో వైద్యం అందేలా చర్యల

•ఎస్సై మానవత్వంపై స్థానికుల ప్రశంసలు



రామగిరి, (పెద్దపెల్లి జిల్లా) సెప్టెంబర్ 10 అక్షరం న్యూస్

రామగిరి మండలం నాగేపల్లి ఎక్స్ రోడ్ వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తికి రామగిరి ఎస్సై తాడవేన శ్రీనివాస్ తక్షణ సహాయం అందించి మానవత్వం చాటుకున్నారు. ప్రమాదంలో మోటం జంపయ్య (రాములు క ు వ ా ం ు డ ు ) గాయపడ్డారు.ప్రమాద విషయం తెలుసుకున్న ఎస్సై తాడవేన శ్రీనివాస్ వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నారు. గాయపడిన వ్యక్తి పరిస్థితిని గమనించి ఆలస్యం చేయకుండా తన వాహనంలోనే ఆసుపత్రికి తరలించారు. సకాలంలో వైద్యం అందేలా చర్యలు తీసుకుని బాధితుడికి అండగా నిలిచారు.ప్రమాద సమయంలో విధి నిర్వహణతో పాటు ఆపదలో ఉన్న వ్యక్తికి స్వయంగా సహాయం అందించిన ఎస్సై శ్రీనివాస్ తీరును స్థానికులు అభినందించారు. పోలీసులంటే కేవలం శాంతిభద్రతల పరిరక్షణ మాత్రమే కాకుండా, ఆపదలో ఉన్న ప్రజలకు అండగా నిలిచే బాధ్యత కూడా ఉందని ఆయన తన చర్యతో చాటిచెప్పారని పలువురు ప్రశంసించారు.

# సర్ నోటీస్‌లకు స్పందించకుంటే...ఓటు గల్లంతు

- -ఆధారాలతో హాజరు కావాలి
- -రామగిరి తహసీల్దార్ పర్నంది సుమన్

రామగిరి (పెద్దపెల్లి జిల్లా) సెప్టెంబర్ 10 అక్షరం న్యూస్

కేంద్ర ఎన్నికల సంఘం చేపడుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఆర్ఆర్) ప్రక్రియలో భాగంగా జారీ చేసిన నోటీసులకు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా స్పందించాలని రామగిరి తహసీల్దార్ పర్నంది సుమన్ సూచించారు. నోటీసులు అందుకున్న వారు నిర్ణీత గడువులోగా అవసరమైన ధ్రువపత్రాలతో హియరింగ్‌కు హాజరు కావాలని కోరారు. రామగిరి మండలం రత్నాపూర్ గ్రామపంచాయతీలో గురువారం సర్పంచ్ పల్లె ప్రతిమ పీవీరావు అధ్యక్షతన నిర్వహించిన గ్రామసభకు తహసీల్దార్ పర్నంది సుమన్ హాజరై ఎస్ఐఆర్ ప్రక్రియపై ఓటర్లకు అవగాహన కల్పించారు. ఓటరు జాబితాలో ఎలాంటి తప్పులు లేకుండా, అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు హక్కు కొనసాగించే ఉద్దేశంతో నోటీసులు జారీ చేస్తున్నట్లు తెలిపారు. ఇంటి పేరు, ఓటరు పేరు, వయస్సు తదితర వివరాల్లో తేడాలు ఉన్నవారు సంబంధిత ఆధారాలను సమర్పించి వివరాలను సరిచేసుకోవాలని సూచించారు. అలాగే 2002 నాటి ఓటరు జాబితాలో తమ కుటుంబ సభ్యుల వివరాలను మ్యాపింగ్ చేసుకోవాలని తెలిపారు. నోటీసులకు స్పందించకుండా, నిర్ణీత గడువులోగా



అవసరమైన పత్రాలు సమర్పించకపోతే ఓటరు జాబితాలో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని, అందువల్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎస్ఐఆర్ నోటీసులు అందుకున్న ఓటర్లు తమకు కేటాయించిన హియరింగ్ తేదీన సంబంధిత ఆధారాలు, అవసరమైన సర్టిఫికెట్లు, ఫారంతో హాజరుకావాలని అధికారులు తెలిపారు. ఏవైనా సందేహాలు ఉంటే గ్రామపంచాయతీ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. గ్రామసభలో ఓటర్లు అడిగిన పలు సందేహాలకు అధికారులు సమాధానాలు ఇచ్చారు. ఓటరు వివరాల సవరణ, అవసరమైన ధ్రువపత్రాలు, హియరింగ్ ప్రక్రియ తదితర అంశాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ మహేష్, జీపీఓ పెర్క వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శి గంగుల సంతోష్‌కుమార్, వార్డు సభ్యులు పబ్బ స్రవంతి వెంకటేష్, కెక్కర్ల ఉష అశోక్, జక్కుల పద్మ చందన్, బత్తిని ప్రశాంత్, కలవెన రవి, నాయకులు సందేవేన కుమార్, ఇజ్జగిరి సంపత్, కొవ్వూరి సురేష్, అమరగొండ శ్రీనివాస్, బోగే సతీష్, బెజ్జాల రాజయ్య, ముడుసు హరీష్, మహేష్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## ఎన్ఎస్‌యు ఐ జిల్లా అధ్యక్షుడిగా దుద్దెడ భాను

- విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతా



రాజన్న సిరిసిల్ల /ముస్తాబాద్ /సెప్టెంబర్ -10(అక్షరం న్యూస్ )

కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగమైన నేషనల్ స్టూడెంట్స్ యూనియన్ ఆఫ్ ఇండియా (ఎన్ ఎస్ యూ ఐ ) రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడిగా దుద్దెడ భాను నియమితులయ్యారు. ఈ సందర్భంగా బాను మాట్లాడుతూ మాట్లాడుతూ ఎల్లవేళలా విద్యార్థులకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. విద్యార్థుల హక్కులు, సమస్యలపై పోరాడుతూ వారికి అండగా నిలుస్తానన్నారు. ఎమ్మెల్యే, పార్టీ నాయకుల సహకారంతో కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని పేర్కొన్నారు జిల్లా ఎన్ ఎస్ యూ ఐ అధ్యక్షునిగా నియమానికి సహకరించిన రాష్ట్ర ఎన్ ఎస్ యూ ఐ అధ్యక్షులు వెంకటస్వామి, డీసీసీ అధ్యక్షులు సంగీతం శ్రీనివాస్ ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, మంత్రి పొన్నం ప్రభాకర్,సిరిసిల్ల ఇంచార్జ్ కేకే మహేందర్ రెడ్డి, ఆర్టీఏ మెంబెర్ సంగీతం శ్రీనాథ్ రాష్ట్ర నాయకులు రితీష్ రావు. పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు

## పసుపు నీళ్ల తో శుద్ధి ఘటన పై కాంగ్రెస్ నాయకుల పిర్యాదు



రాజన్న సిరిసిల్ల /ముస్తాబాద్ /సెప్టెంబర్ -10(అక్షరం న్యూస్ )

బీఆర్ఎస్ చీఫ్ కేసీఆర్ ఫామ్‌హౌస్ సమీపంలోని వరదరాజ్‌పూర్ రోడ్డును ఆ పార్టీ నేతలు పసుపు నీళ్లతో శుద్ధి చేసిన ఘటనపై ముస్తాబాద్ మండల కాంగ్రెస్ నాయకులు స్థానిక పోలీస్ స్టేషన్ లో పిర్యాదు చేశారు ఈ సందర్బంగా వారు మాట్లాడు తు ఇది ముమ్మాటికీ దళిత వర్గాలపై చూపించిన కుల వివక్షేనని మండిపడ్డారు. "అంటరానితనం గురించి ఇప్పటివరకు పుస్తకాల్లో చదవడం మాత్రమే విన్నాం.. కానీ ఈ రోజు బీఆర్ఎస్ నాయకులు చేష్టలతో కళ్లారా చూస్తున్నాం" అని ఆయన తీవ్రంగా విమర్శించారు. ఎస్సీ సంఘాలు నిరసన తెలిపినంత మాత్రాన ఆ ప్రాంతాన్ని 'అశుద్ధం' అయినట్లు భావించి శుద్ధి చేయడం వారి అహంకార పూరిత మనస్తత్వానికి నిదర్శనమనిమండి పడ్డారు శుద్ధి కరణ కార్యక్రమం లో పాల్గొన్న వ్యక్తులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని కోరినట్లు పేర్కొన్నారు. పిర్యాదు కార్యక్రమం లోఎస్సి సెల్ మండలఅధ్యక్షులు కాంపల్లి శ్రీనివాస్,కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు యారటి కరుణాకర్ ఎన్ ఎస్ యు జిల్లా అధ్యక్షులు భాను నల్ల బుచ్చయ్య మార్కెట్ కమిటీ డైరెక్టర్ మామిళ్ళ శ్రీకాంత్ చాకలి బాబు లు పాల్గొన్నారు

# ప్రారంభమైన ఏరియా అంతర్ విభాగీయ 62 వ వార్షిక క్రీడా పోటీలు

మంచిర్యాల జిల్లా/ మందమర్రి, సెప్టెంబర్ 10/అక్షరం న్యూస్ -:

మందమర్రి ఏరియా అంతర్ విభాగీయ 62 వ వార్షిక క్రీడా పోటీలు గురువారం సింగరేణి హై స్కూల్ గ్రౌండ్ లో అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి.

ఈ కార్యక్రమానికి మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ (జిఎం) ఎన్. రాధాకృష్ణ ముఖ్య అతిథిగా హాజరై క్రీడా పోటీలను అధికారికంగా ప్రారంభించారు. ?సింగరేణి సంస్థ ప్రతి ఏటా నిర్వహించే వార్షిక క్రీడా పోటీల షెడ్యూల్ ప్రకారం, తొలిరోజు ఫుట్ బాల్ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా మైదానంలో తలపడే జట్లను టాస్ ను వేసి మొదటి ఆటను కాసిపేట -2 మరియు కే కే - 5 వారిచే ఆటను ప్రారంభించారు. అనంతరం జిఎం క్రీడాకారులను పరిచయం చేసుకుని, వారిని ఉత్సాహపరుస్తూ శుభాకాంక్షలు తెలిపారు.?జిఎం ఎన్. రాధాకృష్ణ మాట్లాడుతూ

?ఆరోగ్యం - మానసిక ఉల్లాసం. క్రమశిక్షణతో కూడిన ఆటలు మనుషులకు శారీరక దృఢత్వాన్ని, మానసిక ఉల్లాసాన్ని అందిస్తాయి. నిత్యం పని ఒత్తిడిలో ఉండే ఉద్యోగులకు క్రీడలు మంచి ఉపశమనాన్ని ఇస్తాయి. ఆరోగ్యకరమైన, దృఢమైన ఉద్యోగులతోనే సంస్థ మెరుగైన బొగ్గు ఉత్పత్తి సాధించి అభివృద్ధి పథంలో పయనిస్తుందన్నారు. సింగరేణి యాజమాన్యం క్రీడలకు ఎల్లప్పుడూ ప్రాధాన్యత ఇస్తుందనీ అందులో భాగంగానే ప్రతి ఏరియాకు క్రీడా సామగ్రి కొనుగోలు కోసం రూ,,



4.50 లక్షల రూపాయలను కేటాయించింది. ఈ నిధులతో క్రీడాకారులకు అవసరమైన అత్యుత్తమ నాణ్యమైన క్రీడా పరికరాలను కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. గెలిచినప్పుడు పొంగిపోకుండా, ఓడినప్పుడు కుంగిపోకుండా సత్ఫలితాల కోసం క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగాలన్నారు. ఆటలు వ్యక్తుల్లో సమైక్యతను, నాయకత్వ లక్షణాలను మరియు పరస్పర సహకారాన్ని పెంపొందిస్తాయన్నారు. మన సంస్థకు చెందిన క్రీడాకారులు కేవలం ఏరియా స్థాయిలోనే కాకుండా, కంపెనీ స్థాయి, కోల్ ఇండియా స్థాయి పోటీలలో పాల్గొని సింగరేణి ఖ్యాతిని నలుదిశలా చాటాలన్నారు. మైదానంలో చూపించే పట్టుదల, క్రమశిక్షణను పని ప్రదేశంలో కూడా ప్రదర్శించి సంస్థ పురోగతికి భాగస్వాములు కావాలి అని అన్నారు. ఫుట్ బాల్ విన్నర్స్ గా కే కే -5 గ్రూప్,

రన్నర్స్ గా కాసిపేట -2 గ్రూప్ గెలుపొందినారు. ?ఈ కార్యక్రమంలో ఏరియా ఎస్ ఓ టు జి ఎం, జి ఎల్. ప్రసాద్, ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ సలేంద్ర సత్యనారాయణ, డీజీఎం (పర్సనల్) సిహెచ్.అశోక్,

క్రీడల గౌరవనీయమైన కార్యదర్శి, ఎం.కార్తీక్, క్రీడల సమన్వయకర్త ఎస్.శివ కృష్ణ, క్రీడల జనరల్ కెప్టెన్ సాక శ్రీనివాస్, క్రీడల కెప్టెన్లు ,గుర్తింపు పొందిన కార్మిక సంఘాల నాయకులు, పెద్ద సంఖ్యలో క్రీడాకారులు, ఉద్యోగులు మరియు అభిమానులు పాల్గొని క్రీడాకారులను ఉత్సాహపరిచారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఒకరికి ఒక రోజు జైలు శిక్ష

జ్యోతి నగర్ ఎన్టిపిసి సెప్టెంబర్ 10 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని రామగుండం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ బి. రాజేశ్వరరావు తెలిపారు.రామగుండం ట్రాఫిక్ పోలీసులు నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన 8 మందిని గోదావరిఖని ప్రిన్సిపల్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరిచారు. విచారణ అనంతరం 7 మందికి మొత్తం రూ.21,000 జరిమానా విధించారు. అదేవిధంగా, కమ్యూనిటీ సర్వీస్‌లో భాగంగా స్థానిక ఫైవ్ ఇంక్లైన్ చౌరస్తా సమీపంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ చేయాలని కోర్టు ఆదేశించింది.

మరో వ్యక్తికి కోర్టు ఒక రోజు జైలు శిక్ష విధించడంతో, అతడిని కరీంనగర్ జిల్లా జైలుకు తరలించారు.ఈ సందర్భంగా ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ బి. రాజేశ్వరరావు మాట్లాడుతూ, మద్యం సేవించి వాహనం నడపడం చట్టరీత్యా నేరమని, డ్రంక్ అండ్ డ్రైవ్‌కు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.వాహనదారులు వాహనాలకు సంబంధించిన అన్ని ధ్రువపత్రాలను వెంట ఉంచుకోవాలని, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు.రాంగ్ రూట్‌లో ప్రయాణించకుండా, అతివేగంగా వాహనాలు నడపకుండా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని తెలిపారు.రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత. ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చని ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ పేర్కొన్నారు.

# స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేసిన సర్పంచ్ అశోక్ పటేల్

మద్నూర్ / సెప్టెంబర్ 10 (అక్షరం న్యూస్ -- కామారెడ్డి):

మద్నూర్ మండలం మెనూర్ గ్రామంలో అర్హులైన లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. స్మార్ట్ రేషన్ కార్డు కార్యక్రమం లో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దరస్వర్ సాయిలు, మీర్జాపూర్ ఆలయం చైర్మన్ రామ్ పటేల్, సొసైటీ మాజీ చైర్మన్ గంగన్నా, డిప్యూటీ తహసీల్దార్ ఖలేదు పాల్గొన్నారు. గ్రామ సర్పంచ్ అశోక్ పటేల్ లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు. సర్పంచ్ మాట్లాడుతూ

తెలంగాణ ప్రభుత్వం పాత రేషన్ కార్డుల స్థానంలో కొత్తగా స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీకి శ్రీకారం చుట్టింది. ఆధునిక భద్రతా లక్షణాలతో రూపొందించిన ఈ కార్డుల్లో క్యూఆర్ కోడ్ వంటి సదుపాయాలు ఉండటంతో రేషన్ సేవలను మరింత సులభతరం చేయడంతో పాటు పారదర్శకతను పెంచే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.. స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా లబ్ధిదారులకు రేషన్ సేవలు మరింత సులభంగా అందుతాయని తెలిపారు. అర్హులైన కుటుంబాలు తమ రేషన్ కార్డు వివరాలను సక్రమంగా పరిశీలించుకోవాలని సూచించారు. గత ప్రభుత్వ హయాంలో నూతన కార్డులు ఇవ్వకుండా ప్రజలకు మోసం చేసిన విధానాన్ని సభ ముఖంగా తెలియజెశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే పేదలకు అండగా వారి అభివృద్ధి కోసం నూతన ఇందిరమ్మ



ఇండ్లు, నూతన రేషన్ కార్డుల తో పాటు చిరకాలం ఉండే విధంగా స్మార్ట్ రేషన్ కార్డులు అందిస్తున్న విధానాన్ని తెలిపారు. రాష్ట్రం లో ప్రజా పాలన ప్రభుత్వం తో అన్ని వర్గాల వారు సుఖ సంతోషాలతో ఉన్నారని తెలిపారు. స్మార్ట్ కార్డులు అందుకున్న కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తూ గ్రామ పాలన అధ్యక్షుడు అశోక్ పటేల్ కు ప్రత్యక ధన్యవాదములు తెలిపారు.కార్యక్రమంలో సర్పంచ్ అశోక్ పటేల్, ఉప సర్పంచ్ , గ్రామ మైనారిటీ అధ్యక్షుడు నిసార్, మోసిన్, సబడే చందర్, సాయి బాబా , గ్రామ పంచాయతీ సెక్రెటరీ హరీష్ కుమార్, కాంధార్ మారొతి, వార్డు మెంబర్లు గ్రామ ప్రజాప్రతినిధులు, అధికారులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## జాతరకు వచ్చే భక్తులకు తాగునీరు, వైద్య సేవలు

•గట్లనర్సింగాపూర్‌లో గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు..



హన్మకొండ జిల్లా / భీమదేవరపల్లి / సెప్టెంబర్ 10 / అక్షరం న్యూస్:

మండలంలోని గట్లనర్సింగాపూర్‌లో నిర్వహిస్తున్న శ్రీ లకాకులమ్మ తల్లి బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తుల సౌకర్యార్థం గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో తొలిసారిగా తాగునీరు, వైద్య సేవలను ఏర్పాటు చేసినట్లు సర్పంచ్ బొల్లంపల్లి అజయ్‌కుమార్ తెలిపారు.గురువారం సర్పంచ్ అజయ్‌కుమార్ ఆధ్వర్యంలో ఆలయ పరిసరాల్లో భక్తులకు అవసరమైన తాగునీటి సదుపాయంతో పాటు వైద్య సేవలను అందుబాటులోకి తీసుకొచ్చారు. బ్రహ్మోత్సవాలకు వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తున్న నేపథ్యంలో వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.భక్తులకు అత్యవసర వైద్య సేవలు అందించేందుకు దేవస్థానం వద్ద వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచారు. జాతర సమయంలో ఎవరికైనా అనారోగ్య సమస్యలు తలెత్తినా అత్యవసర వైద్య సహాయం అవసరమైనా వెంటనే ప్రాథమిక చికిత్స అందించేలా ఏర్పాట్లు చేశారు.భక్తుల సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో తొలిసారిగా ఉచిత తాగునీరు, వైద్య సేవలు ఏర్పాటు చేయడంపై భక్తులు గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ పాలకవర్గానికి కృతజ్ఞతలు తెలిపారు.

## మద్నూర్ మండల ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సన్మానం

మద్నూర్ / సెప్టెంబర్ 10 (అక్షరం న్యూస్ -- కామారెడ్డి):



మద్నూర్ మండల కేంద్రంలోని రైతు వేదికల్లో విద్యాశాఖ ఆధ్వర్యంలో మండల ఉత్తమ ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తూ, విద్యారంగంలో విశిష్ట సేవలు అందించిన ఉపాధ్యాయులను ఈ సందర్భంగా గుర్తించి మండల విద్య అధికారి రాములు నాయక్ సత్కరించారు.ఈ కార్యక్రమంలో మండల పరిధిలోని వివిధ పాఠశాలలకు చెందిన తెలుగు, మరాఠి, ఉర్దూ మీడియం కు చెందిన 22 మంది ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేసి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను అందజేశారు. అనంతరం అవార్డు పొందిన ఉపాధ్యాయులను శాలువాలతో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా ఉపాధ్యాయుల సేవలను కొనియాడుతూ, సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని కార్యక్రమంలో పాల్గొన్న వారు పేర్కొన్నారు. విద్యార్థులకు పాఠ్యాంశాలతో పాటు క్రమశిక్షణ, నైతిక విలువలు, సమాజం పట్ల బాధ్యత వంటి అంశాలను బోధిస్తూ వారి భవిష్యత్తుకు బాటలు వేయడంలో ఉపాధ్యాయులు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు.ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ప్రతిభను వెలికితీసేందుకు ఉపాధ్యాయులు చేస్తున్న కృషి, విద్యా ప్రమాణాల మెరుగుదలకు అందిస్తున్న సేవలను గుర్తించి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులతో సత్కరించడం పట్ల ఉపాధ్యాయులు సంతోషం వ్యక్తం చేశారు.22 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులతో పాటు శాలువాలతో సన్మానం చేయడం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా అవార్డు పొందిన ఉపాధ్యాయులకు పలువురు అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, సి ఆర్పీ లు, పాఠశాలల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యమ సూరీడు జె. రవీందర్ కీ కడసారి వీడ్కోలు

•పాడే మోసి డప్పు కొట్టిన మాజీ ఎమ్మెల్యేలు నల్లాల ఓదెలు, బాల్క సుమన్.

•జనసంద్రంలా సాగిన అంతిమయాత్ర.



మంచిర్యాల జిల్లా/ మందమర్రి, సెప్టెంబర్ 10/ అక్షరం న్యూస్ –:

మందమర్రి పట్టణ బిఆర్ఎస్ అధ్యక్షులు, తెలంగాణ ఉద్యమకారుడు జె. రవీందర్ గత కొంత కాలంగా అనారోగ్యం బారిన పడి హైదరాబాద్ లోని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం కన్నుమూశారు. వారి కుటుంబీకులు పార్థివ దేహాన్ని పట్టణంలోని ఆయన నివాసానికి తీసుకువచ్చారు. జె. రవీందర్ మరణ వార్తను తెలుసుకున్న పట్టణ ప్రముఖులు, ఆయన స్నేహితులు, బంధువులు పార్టీలకతీతంగా చివరి సారిగా ఆయనను చూసేందుకు తండోప తండాలుగా ప్రజలు, నాయకులు, కార్మికులు తరలివచ్చారు. ఆయన మృత దేహాన్ని చూసి కన్నీటి పర్యంతం అయ్యారు. గురువారం ఉదయం ప్రారంభం అయిన అంతిమ యాత్రలో చెన్నూరు మాజీ ఎమ్మెల్యేలు నల్లాల ఓదెలు, బాల్క సుమన్ ఆయన మృతదేహానికి నివాళులు అర్పించారు. అనంతరం పాడే మోసి డప్పు కొట్టారు. ఉద్యమ కాలంలో పని చేసిన సహచరులు, స్నేహితులు, పాడే మోసి కన్నీటి పర్యంతం అయ్యారు. తోటి కార్మికులు చివరి సారిగా చూసేందుకు వేలాదిగా వచ్చిన ఆయన అభిమానులు, వివిధ పార్టీల నేతలు, ప్రజలు, అశ్రునయనాలతో తమ అభిమాన నాయకుడికి జె.ఆర్ కి తుది వీడ్కోలు పలికారు.

## విద్యార్థులకు ఏకరూప దుస్తులు పంపిణీ చేసిన సర్పంచ్ భారత్ రాథోడ్



మద్నూర్ / సెప్టెంబర్ 10 (అక్షరం న్యూస్ -- కామారెడ్డి):

విద్యార్థుల్లో సమానత్వ భావన పెంపొందించడంతో పాటు పాఠశాల విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఏకరూప దుస్తుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ భారత్ రాథోడ్ పాల్గొని విద్యార్థులకు పాఠశాల హెడ్ మాస్టర్ దిగంబర్ ఆధ్వర్యంలో ఏకరూప దుస్తులను స్వయంగా పంపిణీ చేశారు. పాఠశాల విద్యార్థులందరూ ఏకరూప దుస్తులు ధరించడం ద్వారా వారిలో క్రమశిక్షణ, సమానత్వ భావన పెంపొందుతుందని సర్పంచ్ తెలిపారు.విద్యార్థులు విద్యతో పాటు క్రమశిక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని, ఉపాధ్యాయులు చెప్పే విషయాలను శ్రద్ధగా విని ఉన్నత లక్ష్యాలను సాధించే దిశగా ముందుకు సాగాలని ఆయన సూచించారు. గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించేందుకు గ్రామపంచాయతీ తరఫున తన వంతు సహకారం అందిస్తామని తెలిపారు.విద్యార్థులకు ఏకరూప దుస్తులు అందించడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు. పాఠశాల అభివృద్ధికి గ్రామ ప్రజలు, ప్రజాప్రతినిధులు కలిసి పనిచేయాలని కార్యక్రమంలో పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ భారత్ రాథోడ్, పాఠశాల ఉపాధ్యాయులు దిగంబర్, సునీత, అంగన్వాడీ టీచర్ శారద,, , గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ పోరాట స్ఫూర్తి చాకలి ఐలమ్మ

•ఘనంగా దీరవనిత చాకలి ఐలమ్మ వర్ధంతి వేడుకలు.

•జేబీపీ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ యెర్రా కామేష్.



భద్రాద్రి కొత్తగూడెం / కొత్తగూడెం / సెప్టెంబర్ 10 / అక్షరం న్యూస్ –:: తెలంగాణ దీరవనిత, తెలంగాణ పోరాటానికి స్ఫూర్తి ప్రదాత చాకలి ఐలమ్మ అని జైభీమ్ రావ్ భారత్ పార్టీ (జేబీపీ) స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ యెర్రా కామేష్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రమైన కొత్తగూడెం పట్టణంలోని రైల్వే స్టేషన్ వద్ద రజక సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వర్ధంతి వేడుకల కార్యక్రమంలో పాల్గొన్న కామేష్ చాకలి ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పించిన అనంతరం ఆయన మాట్లాడుతూ భూమి కోసం, భుక్తి కోసం, విముక్తి కోసం నైజాం నిరంకుశ పాలనకు భూస్వామ్య దొరల అణచివేతకు వ్యతిరేకంగా పోరాడిన మహా యోధురాలు అని వరంగల్ పాలకుర్తి ప్రాంతంలో రజక కుటుంబంలో 26 సెప్టెంబర్ 1895న జన్మించిన చిట్యాల ఐలమ్మ కష్టపడి పండించిన పంటను తీసుకురమ్మని పంపిన దొర మనుషులతో ఈ పంట నాది, తీసుకుపోవడానికి దొర ఎవ్వడు నా ప్రాణం పోయాకే పంట కానీ భూమి కానీ మీరు దక్కించుకోగలరు అని దొరల గుండెల్లో బడభాగ్నిలా రగిలిన తెలంగాణ రైతాంగ విప్లవాగ్ని ధీర వనిత చాకలి ఐలమ్మ అన్నారు. ప్రజా పోరాటాలకు స్ఫూర్తిగా నిలిచిన ఐలమ్మ 10 సెప్టెంబర్ 1985 న అనారోగ్యంతో మరణించారని ఆమె పోరాట స్ఫూర్తిని బహుజన వర్గాలు ఆకలింపు చేసుకోవాలని, మన హక్కులకు విఘాతం కలిగినప్పుడు, అన్యాయం జరిగినప్పుడు పాలకులను ప్రశ్నించడం ఆమె పోరాట స్ఫూర్తి ద్వారా నేర్చుకోవాలని అన్నారు. ప్రజలు బహుజన వర్గాల పోరాటయోధుల చరిత్ర నుంచి స్ఫూర్తిని పొంది రాజ్యాధికారాన్ని చేజిక్కించుకోవాలని ఆకాంక్షించారు.

## కొత్తగూడెం ఏరియా సమస్యలపై జీఎంతో ఐ ఎన్ టి యూ సి సెక్రటరీ జనరల్ డా. శ్రీ జనక్ ప్రసాద్ చర్చ.



భద్రాద్రి కొత్తగూడెం / కొత్తగూడెం / సెప్టెంబర్ 10 / అక్షరం న్యూస్ –:: సింగరేణి కొత్తగూడెం ఏరియాలో కార్మికులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై ఏరియా జనరల్ మేనేజర్‌ను ఐ ఎన్ టి యూ సి సెక్రటరీ జనరల్, తెలంగాణ రాష్ట్ర కనీస వేతన సలహా మండలి చైర్మన్ డా. శ్రీ జనక్ ప్రసాద్ కలిసి చర్చించారు.కార్మికుల సంక్షేమం, పెండింగ్ సమస్యల పరిష్కారం, పని ప్రదేశాల్లో మెరుగైన సౌకర్యాలు, కార్మికులకు అందాల్సిన హక్కులు మరియు సౌకర్యాల అమలు తదితర అంశాలను ఈ సందర్భంగా జీఎం దృష్టికి తీసుకెళ్లారు. కార్మికుల సమస్యలను సానుకూలంగా పరిశీలించి, సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని డా. జనక్ ప్రసాద్ కోరారు.కార్మికుల హక్కులు, సంక్షేమం విషయంలో ఐ ఎన్ టి యూ సి ఎల్లప్పుడూ కార్మికుల పక్షాన నిలబడి, వారి సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తుందని ఆయన పేర్కొన్నారు.కొత్తగూడెం ఏరియా వైస్ ప్రెసిడెంట్ రజాక్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సెంట్రల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్లు నరసింహ రెడ్డి, ధర్మపురి, సమ్మయ్య, త్యాగరాజన్, శంకర్ రావు, జనరల్ సెక్రటరీ వికాస్ కుమార్ యాదవ్, రీజినల్ జనరల్ సెక్రటరీ ఆల్బర్ట్, పిట్ సెక్రటరీ సాగర్ తదితరులు పాల్గొన్నారు.

## ఏజెన్సీ ప్రాంత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత టివిఆర్ చంద్రం

•పుస్తకావిష్కరణ సభలో సిపిఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా.



భద్రాద్రి కొత్తగూడెం / కొత్తగూడెం / సెప్టెంబర్ 10 / అక్షరం న్యూస్ – :ఏజెన్సీ ప్రాంతంలో కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాణానికి టివిఆర్ చంద్రం చేసిన కృషి చిరస్మరణీయమని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్ పాషా అన్నారు. టివిఆర్ చంద్రం 20వ వర్ధంతి సందర్భంగా భద్రాచలంలోని కేకే ఫంక్షన్ హాల్లో ఎగరేసిన ఎర్రజెండా పుస్తకావిష్కరణ జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన పాషా మాట్లాడుతూ ఉమ్మడి కమ్యూనిస్టు ఉద్యమంలో టివిఆర్ చంద్రం చేసిన పోరాటాలు నేటికీ చిరస్మరణీయం అన్నారు. కమ్యూనిస్టు పార్టీ చీలిపోయిన తర్వాత ఈ ప్రాంతంలో గిరిజనులు, కార్మికులు బలహీన సబ్బండ వర్గాల ప్రజల మేలు కోసం ఆయన నిర్మించిన పోరాటాలు కమ్యూనిస్టు ఉద్యమానికి మైలురాయిగా మిగిలాయని చెప్పారు. ఆయన వర్ధంతి సందర్భంగా ప్రజాపోరాటల చరిత్రను పుస్తక రూపంలో తీసుకురావడం అభినందనీయమని, ఇది ముందు తరానికి స్ఫూర్తి దాయకంగా నిలుస్తుందని చెప్పారు. ప్రజలకష్టాలను స్వయంగా తెలుసుకుని వారిని సమీకరించి ఉద్యమాలు నిర్మించారన్నారు. ప్రతికూల పరిస్థితుల్లోనూ కమ్యూనిస్టు ఉద్యమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఆయన చేసిన కృషి ప్రత్యేకమైందన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో కూడా పేదలు గిరిజనులు కార్మిక సమస్యలపై ఐఖ్యంగా ఉద్యమాలు నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. టివిఆర్ చంద్రం చూపిన ప్రజా ఉద్యమ పోరాటాన్ని నేటితరం కొనసాగించడమే ఆయనకిచ్చే నిజ నిజమైన నివాళి అని షాబీర్ పాషా అన్నారు. సిపిఐ ఖమ్మం జిల్లాకార్యవర్గ సభ్యులు శింగు నర్సింహారావు అధ్యక్షతన జరిగిన ఈ సభలో సిపిఎం నాయకులు బి వెంకట్ బండారు రవికుమార్ ఎలమంచిలి రవికుమార్ మచ్చా వెంకటేశ్వర్లు సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కల్లూరి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

## ఇందిరా ప్రియదర్శినికి కాళోజి నంది అవార్డు

•కొత్తగూడెం అడ్వకేట్‌కు దక్కిన అరుదైన ఘనత.

• హైకోర్టు న్యాయమూర్తి చేతుల మీదుగా పురస్కారం.

• జిల్లా కోర్టు పరిధిలో 'బెస్ట్ జూనియర్ అడ్వకేట్'.



భద్రాద్రి కొత్తగూడెం / కొత్తగూడెం / సెప్టెంబర్ 10 / అక్షరం న్యూస్ – : : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా న్యాయవాద రంగానికి మరో విశిష్ట గౌరవం దక్కింది. జిల్లా కోర్టు పరిధిలో ప్రతిభ కనబరిచిన కొత్తగూడెం పట్టణం, ప్యూన్ బస్తీకి చెందిన అడ్వకేట్ ఇందిరా ప్రియదర్శిని "బెస్ట్ జూనియర్ అడ్వకేట్"గా ఎంపికయ్యారు. దీనితో పాటు కాళోజి జయంతి సందర్భంగా ప్రదానం చేసే ప్రతిష్టాత్మక "కాళోజి నంది అవార్డు"ను సైతం ఆమె దక్కించుకున్నారు. వరంగల్‌లోని కాళోజి ఆడిటోరియంలో బుధవారం రాత్రి నిర్వహించిన ప్రత్యేక సభలో హైకోర్టు న్యాయమూర్తి చేతుల మీదుగా ఆమె ఈ అవార్డును అందుకున్నారు. న్యాయవృత్తిలో ఆమె చూపుతున్న నిబద్ధత, అంకితభావానికి రాష్ట్రస్థాయి గుర్తింపు లభించడం పట్ల జిల్లా సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, పట్టణ కార్యదర్శి కంచర్ల జమలయ్య, పలువురు న్యాయవాదులు, పట్టణ ప్రముఖులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో ఆమె మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

## వీరనారి చాకలి ఐలమ్మ పోరాటం స్ఫూర్తిదాయకం

• భూమి కోసం సాగిన సాయుధ పోరు అజరామరం.

• సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కంచర్ల జమలయ్య.



భద్రాద్రి కొత్తగూడెం/ కొత్తగూడెం / సెప్టెంబర్ 10 / అక్షరం న్యూస్ –: : వీరనారి చాకలి ఐలమ్మ సాగించిన వీరోచిత పోరాటం తరతరాలకు స్ఫూర్తిదాయకమని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కంచర్ల జమలయ్య, బిసి సంఘం జిల్లా నాయకులు నేరెళ్ల రమేష్ కొనియాడారు. చాకలి ఐలమ్మ 41వ వర్ధంతి సందర్భంగా కొత్తగూడెంలోని సిపిఐ జిల్లా కార్యాలయం 'శేషగిరిభవన్'లో గురువారం సంస్మరణ కార్యక్రమం ఘనంగా జరిగింది. తొలుత ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ భూస్వామ్య దోపిడీకి వ్యతిరేకంగా జరిగిన మహత్తర రైతాంగ పోరాటంలో ఎర్రజెండా అండతో ఐలమ్మ చేసిన ప్రతిఘటన చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించబడిందన్నారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో భూమి కోసం, భుక్తి కోసం, విముక్తి కోసం ఐలమ్మ తుపాకీ పట్టి నిజాం నిరంకుశ పాలనపై గర్జించారని గుర్తుచేశారు. దొరల గడీల అహంకారాన్ని మట్టికరిపించిన ఆమె తెగువ అపూర్వమని, పాలకుల దౌర్జన్యాలను ఎదిరించిన ఐలమ్మ ఆశయాలను ప్రతిఒక్కరూ ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. భూక్యా శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో నాయకులు కె రత్నకుమారి, రేసు ఎల్లయ్య, బోయిన విజయ్ కుమార్, దుర్గయ్య, నల్లా శ్రీనివాస్, కైసర్, గడ్డం సతీష్, రాజు, సర్వేశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా తీర్పును గౌరవించి బాధ్యతాయుత ప్రతిపక్షంగా వ్యవహరించాలి

- అసెంబ్లీని రాజకీయ ఘర్షణలకు వేదికగా మార్చొద్దు...
- బీఆర్ఎస్ వైఖరిపై కాంగ్రెస్ జిల్లా నాయకుడు పచ్చునూరి కరుణాకర్ విమర్శ..

హనుమకొండ జిల్లా / భీమదేవరపల్లి / సెప్టెంబర్ 10 / అక్షరం న్యూస్:

ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవిస్తూ బీఆర్ఎస్ నాయకులు బాధ్యతాయుతమైన ప్రతిపక్ష పాత్ర పోషించాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు పచ్చునూరి కరుణాకర్ అన్నారు. గురువారం భీమదేవరపల్లి మండలం ముల్కనూర్ అంబేద్కర్ కూడలి వద్ద ఆయన మాట్లాడారు.

శాసనసభ ప్రజా సమస్యలపై చర్చించి. రాష్ట్ర అభివృద్ధికి అవసరమైన నిర్ణయాలు తీసుకునే ప్రజాస్వామ్య వేదిక అని కరుణాకర్ పేర్కొన్నారు. అలాంటి సభను రాజకీయ ఘర్షణలకు వేదికగా మార్చడం సరికాదన్నారు. ప్రభుత్వ విధానాలపై ప్రతిపక్షాలకు భిన్నాభిప్రాయాలు ఉంటే వాటిని సభలో నిర్మాణాత్మకంగాప్రస్తావించి. ప్రజలకు ఉపయోగపడే సూచనలు చేయాలని సూచించారు.



### గత పాలనను కూడా గుర్తు చేసుకోవాలి..

ప్రజాస్వామ్యం నిరసనల హక్కుల గురించి బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతున్న నేపథ్యంలో గత ప్రభుత్వ పాలనలో చోటుచేసుకున్న పరిణామాలను కూడా గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఉందని కరుణాకర్ అన్నారు. ప్రజలు తమ సమస్యలు ఆవేదనను వ్యక్తం చేసుకునే ధర్నా చౌక్ విషయంలో గతంలో తీసుకున్న నిర్ణయాలను ప్రజలు ఇంకా గుర్తుంచుకున్నారని పేర్కొన్నారు.ఉద్యోగులు, ఆర్టీసీ కార్మికులు, రైతులు తమ సమస్యలపై ఉద్యమించిన సందర్భాల్లో అప్పటి ప్రభుత్వం వ్యవహరించిన తీరుపై తీవ్ర విమర్శలు వచ్చిన విషయాన్ని ఆయన ప్రస్తావించారు. నేరెళ్ల గౌరవెల్లి, రంగనాయక సాగర్ ప్రాంతాల్లో ప్రాజెక్టుల కారణంగా నిర్వాసితులు ఎదుర్కొన్న సమస్యలను ప్రభుత్వం ప్రతిపక్షాలు కలిసి పరిష్కరించేందుకు కృషి చేయాలని అన్నారు.

### అసెంబ్లీ హుందాతనాన్ని కాపాడాలి...

శాసనసభ ప్రజల సమస్యలకు పరిష్కార మార్గాలను అన్వేషించే ప్రజాస్వామ్య వేదిక అని కరుణాకర్ పేర్కొన్నారు. ప్రజల తరఫున ఎన్నికైన ప్రతినిధులు తమ వాదనలను బలంగా వినిపించవచ్చని అయితే సభా సంప్రదాయాలు ప్రజాస్వామ్య విలువలను గౌరవిస్తూ నిర్మాణాత్మక చర్చలకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు.ప్రభుత్వం చేసే ప్రతి పనిని వ్యతిరేకించడమే ప్రతిపక్ష ధర్మం కాదన్నారు. ప్రజలకు ఉపయోగపడే నిర్ణయాలకు సహకరిస్తూనే ప్రభుత్వం తప్పు చేసినప్పుడు ప్రశ్నించడం ప్రత్యామ్నాయ సూచనలు ఇవ్వడం బాధ్యతాయుతమైన ప్రతిపక్ష లక్షణమని తెలిపారు. **ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం..**

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సంక్షేమం రాష్ట్ర అభివృద్ధి సామాజిక న్యాయం ప్రజల హక్కుల పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతోందని కరుణాకర్ అన్నారు. ప్రభుత్వం చేపడుతున్న మంచి కార్యక్రమాలకు ప్రతిపక్షాలు సహకరించాలని లోపాలు ఉంటే ఆధారాలతో నిర్మాణాత్మకంగా ప్రశ్నించాలని సూచించారు.ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పును ప్రతి రాజకీయ పార్టీ గౌరవించాల్సిందేనని ఆయన అన్నారు. అధికారంలో ఉన్నప్పుడు ఒక విధంగా ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మరో విధంగా ప్రజాస్వామ్య విలువలను నిర్వచించడం సరికాదన్నారు. రాజకీయ విమర్శలు ఆరోగ్యకరమైన ప్రజాస్వామ్యంలో భాగమేనని అయితే అవి వ్యక్తిగత విమర్శలకు సభా కార్యకలాపాలకు ఆటంకం కలిగించే చర్యలకు దారితీయకూడదని స్పష్టం చేశారు.అధికార పక్షం ప్రతిపక్షం రెండూ ప్రజల కోసమే పనిచేయాలని రాజకీయాలకు అతీతంగా రాష్ట్ర ప్రయోజనాలు ప్రజా సమస్యలకు ప్రాధాన్యత ఇచ్చినప్పుడే ప్రజాస్వామ్యం మరింత బలోపేతమవుతుందని పచ్చునూరి కరుణాకర్ పేర్కొన్నారు.

# వీరనారి చాకలి ఐలమ్మ పోరాటం స్ఫూర్తిదాయకం

- భూమి కోసం సాగిన సాయుధ పోరు అజరామరం.
- సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కంచర్ల జమలయ్య.



భద్రాద్రి కొత్తగూడెం/ కొత్తగూడెం / సెప్టెంబర్ 10 / అక్షరం న్యూస్ -: : వీరనారి చాకలి ఐలమ్మ సాగించిన వీరోచిత పోరాటం తరతరాలకు స్ఫూర్తిదాయకమని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కంచర్ల జమలయ్య, బిసి సంఘం జిల్లా నాయకులు నేరెళ్ల రమేష్ కొనియాడారు. చాకలి ఐలమ్మ 41వ వర్ధంతి సందర్భంగా కొత్తగూడెంలోని సిపిఐ జిల్లా కార్యాలయం 'శేషగిరిభవన్'లో గురువారం సంస్మరణ కార్యక్రమం ఘనంగా జరిగింది. తొలుత ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ భూస్వామ్య దోపిడీకి వ్యతిరేకంగా జరిగిన మహత్తర రైతాంగ పోరాటంలో ఎర్రజెండా అండతో ఐలమ్మ చేసిన ప్రతిఘటన చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించబడిందన్నారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో భూమి కోసం, భుక్తి కోసం, విముక్తి కోసం ఐలమ్మ తుపాకీ పట్టి నిజాం నిరంకుశ పాలనపై గర్జించారని గుర్తుచేశారు. దొరల గడీల అహంకారాన్ని మట్టికరిపించిన ఆమె తెగువ అపూర్వమని, పాలకుల దౌర్జన్యాలను ఎదిరించిన ఐలమ్మ ఆశయాలను ప్రతిఒక్కరూ ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. భూక్యా శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో నాయకులు కె రత్నకుమారి, రేసు ఎల్లయ్య, బోయిన విజయ్ కుమార్, దుర్గయ్య, నల్లా శ్రీనివాస్, కైసర్, గడ్డం సతీష్, రాజు, సర్వేశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు.

# ఐలమ్మ పోరాటస్ఫూర్తి చిరస్మరణీయం

- విలీన పోరుకు ఎర్రజెండానే అండ.
- నిజాం నిరంకుశత్వంపై తిరుగుబాటు చరిత్రకం.
- పీడిత ప్రజల విముక్తికి ఐక్య పోరాటం.
- సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా.

భద్రాద్రి కొత్తగూడెం/ కొత్తగూడెం / సెప్టెంబర్ 10 / అక్షరం న్యూస్ -: : వీరనారి చాకలి ఐలమ్మ సాగించిన అసమాన పోరాటస్ఫూర్తి చిరస్మరణీయమని, నేటి తరానికి ఆమె ఆదర్శప్రాయురాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా అన్నారు. వీరనారి చాకలి ఐలమ్మ 41వ వర్ధంతి సందర్భంగా కొత్తగూడెం పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల్లో గురువారం నిర్వహించిన పలు వర్ధంతి కార్యక్రమాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఐలమ్మ చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం సాబీర్ పాషా మాట్లాడుతూ.. నాటి భూస్వామ్య పెత్తందారీ దోపిడీపై, విసునూరు దేశ్‌ముఖ్ దౌర్జన్యాలపై ఎర్రజెండా అండతో ఎదురొడ్డి నిలిచిన వీరవనిత ఐలమ్మ అని కొనియాడారు. తన పంటను కాపాడుకునేందుకు ఆమె చేసిన తిరుగుబాటు తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి గొప్ప దిక్సూచిగా మారిందన్నారు. ఆ మహత్తర పోరాటం వెట్టిచాకిరీ, నిజాం నిరంకుశ పాలన బానిస సంకెళ్లను తెంచి పీడిత ప్రజల విముక్తికి బాటలు వేసిందని గుర్తుచేశారు. దోపిడీ, అణచివేతలపై గర్జించిన నాటి యోధుల ఆశయ సాధనకు ప్రజలు ఐక్యంగా ఉద్యమించాలని, నేటికీ పేదలకు సంపూర్ణంగా భూమి, ఆవాసం అందకపోవడం దుర్మార్గమన్నారు. పీడిత ప్రజల ఐక్య పోరాటాల ద్వారానే హక్కులు సాధ్యమని, ఐలమ్మ పోరాట స్ఫూర్తితో రాబోయే రోజుల్లో భూ సమస్యలపై రాజీలేని ప్రజా ఉద్యమాలను ఉధృతం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమాల్లో ఇంద్రాల మురళి, రాచర్ల వెంకటయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

# సీతారామ డిస్ట్రిబ్యూటర్ కెనాల్ భూ నిర్వాసితులకు 25 లక్షల నష్టపరిహారం చెల్లించాలి.

- డిస్ట్రిబ్యూటర్ కెనాల్ కాలువ లో పామాయిల్, పామాయిల్ వివిధ రకాల మొక్కలకు నష్ట పరిహారం అందించాలి.
- తెలంగాణ రైతు సంఘం మండల కార్యదర్శి వూకంటి రవికుమార్ డిమాండ్.



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా/ ములకలపల్లి /సెప్టెంబర్ 10 /అక్షరం న్యూస్-; : సీతారామ డిస్ట్రిబ్యూటర్ కెనాల్ కాలువ భూ నిర్వాసితులకు 25 లక్షల నష్టపరిహారం చెల్లించాలని తెలంగాణ రైతు సంఘం మండల ప్రధాన కార్యదర్శి వూకంటి రవికుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రము లోని తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో తాహశీల్దార్ కార్యాలయం ముందు నిరసన తెలియజేసి తాహశీల్దార్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వూకంటి రవికుమార్ మాట్లాడుతూ... సీతారామ కెనాల్ కాలువ నిర్మాణం లో భూ నిర్వాసితులకు 8 లక్షల రూపాయలు నష్టపరిహారం అందించారని దీని వల్ల మండల రైతాంగం తీవ్రంగా నష్టపోయిందని అన్నారు. సీతారామ భూ నిర్వాసితుల గ్రామ సభలు ఏర్పాటు చేసి భూ నిర్వాసితులకు ఎకరానికి 25 లక్షల రూపాయలు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. సీతారామ డిస్ట్రిబ్యూటర్ కెనాల్ కాలువ లో భూములు కోల్పోయే రైతుల భూములల్లో సాగు పంటలు పామాయిల్, జామాయిల్ ఇతర పంటలకు నష్టపరిహారం చెల్లించాలని అన్నారు. సీతారామ డిస్ట్రిబ్యూటర్ కెనాల్ కాలువ 25 లక్షల రూపాయలు చెల్లించకపోతే తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో సీతారామ డిస్ట్రిబ్యూటర్ కెనాల్ కాలువ భూ నిర్వాసితులను, రైతుల ను పెద్ద ఎత్తున సమీకరించి భవిష్యత్తు పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో శనగాని వినోద్, వూకంటి కిషోర్, ముదిగొండ వెంకన్న, ముదిగొండ కృష్ణ,కురం గురువయ్య,గుంపు గోపయ్య,కురం శ్రీను, కృష్ణ వేణి,వాసం శిరీష,సంఘం అమృతయ్య, తదితరులు పాల్గొన్నారు

# పత్రాలున్నా దక్కని భూమి.. ఆదివాసీల ఆవేదన

- అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం శూన్యం.
- అక్రమ కేసులు ఎత్తివేయాలని డిమాండ్: తొమ్మిది తెగల జేఏసీ.




భద్రాద్రి కొత్తగూడెం జిల్లా /ములకలపల్లి /సెప్టెంబర్ 10/ అక్షరం న్యూస్:

పట్టా పాసుపుస్తకాలు, ఇతర రెవెన్యూ ఆధారాలు ఉన్నప్పటికీ తమ భూమిని అక్రమంగా ఆక్రమించుకునేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని, దీనిపై అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని బాధితుడు మడకం నరసింహారావు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం మండల కేంద్రంలో తోటి గిరిజనులు, ఆదివాసీ సంఘాల నాయకులతో కలిసి ఆయన తన గోడును వెళ్లబోసుకున్నారు.?బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని ముత్యాలంపాడు గ్రామానికి చెందిన మడకం బాయమ్మ పేరిట సర్వే నెం. 626/279 లోని 2 ఎకరాల 32 గుంటలతో పాటు మొత్తం 10 ఎకరాలకు సంబంధించిన పట్టా పాసుపుస్తకాలు ఉన్నాయి. ఇందులో ప్రస్తుతం 7 ఎకరాల భూమిని సాగు చేసుకుంటున్నారు. మిగిలిన 3 ఎకరాల భూమిని ఎస్.కె. మౌలాలి, ఆయన కుమారుడు గౌస్, సోదరుడు హైమత్‌లు ప్రభుత్వ భూమి అంటూ దౌర్జన్యంగా ఆక్రమించేందుకు బెదిరింపులకు పాల్పడుతున్నారని వాపోయారు. ఓ పోలీసు కానిస్టేబుల్ సైతం పౌర వస్త్రాల్లో వచ్చి బెదిరిస్తున్నారని బాధితుడు ఆరోపించారు.

?కలెక్టర్‌కు చెప్పినా ఫలితం లేదు:

ఈ భూ వివాదంపై ఎఫ్-లైన్ సర్వే చేయాలని దరఖాస్తు చేసుకున్నా స్పందన లేదని బాధితుడు తెలిపారు. కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణి, ఆర్డీవో, ఐటీడీఏ పీవో, ఎంపీడీవో ప్రజా దర్బార్‌లో పలుమార్లు అర్జీలు సమర్పించినా ఎవరూ పట్టించుకోలేదని వాపోయారు. బాధితులకు న్యాయం చేయాల్సింది పోయి, స్థానిక ఎస్సై తమపైనే అక్రమ కేసులు బనాయించారని, తహసీల్దార్ వద్ద నుంచి ఆర్డర్ తెచ్చుకోవాలని వేధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బాధితులైన మడకం నరసింహారావు, పర్షిక రాంబాబు, ఈసం వసంత్‌లపై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలని, తహసీల్దార్ ఆధ్వర్యంలో తక్షణమే సమగ్ర సర్వే జరిపించి భూమిని అప్పగించాలని డిమాండ్ చేశారు.

?గిరిజనులను వేధించడం తగదు: తొమ్మిది తెగల జేఏసీ రాష్ట్ర ఛైర్మన్ చుంచు రామకృష్ణ మాట్లాడుతూ.. చట్టబద్ధమైన పత్రాలున్న ఆదివాసీల భూములను ఆక్రమించేందుకు ప్రయత్నించడం దారుణమన్నారు. బాధితులకు అండగా నిలవాల్సిన అధికారులు, వారిపైనే కేసులు పెట్టడం శోచనీయమన్నారు. తక్షణమే భూ వివాదాన్ని పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని, అక్రమ కేసులను బేషరతుగా ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆదివాసీల హక్కుల కోసం పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ?ఈ కార్యక్రమంలో జేఏసీ కన్వీనర్ వాసం రామకృష్ణ, తుడుందెబ్బ మండల ప్రధాన కార్యదర్శి మడకం రవి, రాష్ట్ర ఆదివాసీ నాయకులు కొరుస వెంకటేష్, మండల నాయకులు పాయం నరసింహారావు, వగ్గల సందీప్, మిడియం నారాయణ, కుంజ వెంకట్, మడివి అరుణాద్, మిడియం విజయ్, మిడియం హరీష్, సున్నం భరత్, కుంజా సాయి, సుహాసిని, సున్నం భద్రమ్మ, సోయం వెంకటమ్మ, గుండాల మండలం ముక్తాపురం ఆదివాసీ సంక్షేమ పరిషత్ సర్పంచ్ కల్తీ రాధ తదితరులు పాల్గొని బాధితులకు మద్దతు ప్రకటించారు.

# బాధితుల నిరాహార దీక్షకు నాయకపోడు సేవా సంఘం మద్దతు

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా/ ములకలపల్లి/ సెప్టెంబర్ 10/ అక్షరం న్యూస్-:

తమ సొంత భూమిని ఇతరులు అక్రమంగా ఆక్రమించుకున్నారంటూ బాధితులు ములకలపల్లి ఎమ్మార్వో (తహసీల్దార్) కార్యాలయం ఎదుట చేపట్టిన నిరాహార దీక్షకు నాయకపోడు సేవా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు తంబళ్ల రవి పూర్తి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనులు, పేదల భూములను అక్రమంగా ఆక్రమించడం దారుణమని మండిపడ్డారు. బాధితులకు తక్షణమే న్యాయం చేయాలని, ఆక్రమణదారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారులను డిమాండ్ చేశారు. బాధితులకు న్యాయం జరిగే వరకు తమ సంఘం తరఫున పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో పలువురు నాయకపోడు సేవా సంఘం నాయకులు, బాధితులు, స్థానికులు పాల్గొన్నారు.



## ములకలపల్లి మండలంలో భూ సమస్యపై న్యాయం కోసం పోరాడుతున్న ఆదివాసిలకు అండగా ఉంటాము



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా/ ములకలపల్లి/ సెప్టెంబర్ 10/ అక్షరం న్యూస్–:

ఏజెన్సీ ప్రాంతంలో ఆదివాసీ భూములను కబ్జా చేస్తూ బెదిరింపులు గురి చేసి ఇబ్బందులు చేస్తు అక్రమ కేసులతో వేధిస్తున్న ఎస్.కె మౌలను పై కఠిన చర్యలు తీసుకోవాలి. భూ సమస్యలపై న్యాయం కోసం పోరాడుతున్న ఆదివాసి గిరిజనులపై పోలీసులు అక్రమంగా కేసులు నమోదు చేశారని జి.ఎస్.ఎస్ రాష్ట్ర యువజన నాయకులు అరేం ప్రశాంత్ ,సోయం సత్యనారాయణ ఆరోపిస్తున్నారు. చట్టాన్ని పరిరక్షించాల్సిన పోలీసులే చట్టాన్ని ఉల్లంఘించి ఆదివాసి గిరిజనులపై అక్రమ కేసులు నమోదు చేస్తే, దానిపై ఉన్నతాధికారులు తక్షణమే విచారణ చేపట్టాలని డిమాండ్ చేస్తున్న ఆదివాసి గిరిజనులపై అక్రమంగా కేసులు నమోదు చేసిన పోలీసులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. . ఆదివాసి గిరిజనుల భూ సమస్యలకు సంబంధించి తప్పుడు నివేదిక ఇచ్చినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న గత మరియు స్థానిక ఎమ్మార్వో పై సమగ్ర విచారణ జరిపి, తప్పు నిర్ధారణ అయితే సస్పెండ్ చేయాలి. ఆదివాసి గిరిజనుల భూములకు సంబంధించిన సమస్యలను 5వ షెడ్యూల్, గిరిజన భూ రక్షణ చట్టాల ప్రకారం పరిష్కరించాలి. ఆదివాసి గిరిజనులపై పెట్టిన కేసులను సమీక్షించి, అక్రమ కేసులు అయితే వెంటనే ఉపసంహరించాలి. ఆదివాసి గిరిజనుల భూమి గిరిజనుల హక్కు అక్రమ కేసులు ఎత్తివేయాలి భూ సమస్యలు పరిష్కరించాలి.

## నర్సు ఊకె శిరీష కుటుంబానికి ప్రభుత్వం న్యాయం చేయాలి- మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు




భద్రాద్రి కొత్తగూడెం జిల్లా/ ములకలపల్లి /సెప్టెంబర్ 10 /అక్షరం న్యూస్–:

హైదరాబాద్‌లోని ప్రైమ్ కేర్ ఆసుపత్రిలో నర్సుగా పనిచేస్తున్న ఊకె శిరీష మృతిపై ప్రభుత్వాలు తక్షణమే స్పందించి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు తాటి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములకలపల్లి మండలం చౌటిగూడెం గ్రామంలో జరిగిన శిరీష దశదినకర్మ కార్యక్రమంలో ఆయన పాల్గొని నివాళు లర్పించారు. ఈ సందర్భంగా శిరీష చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.?అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. విశ్రాంతి తీసుకుంటున్న సమయంలో శిరీష దారుణ హత్యకు గురై పక్షం రోజులు గడుస్తున్నా ప్రభుత్వాని నుంచి సరైన న్యాయం అందకపోవడం బాధాకరమన్నారు. మంత్రులు వచ్చి పరామర్శించి వెళ్లడమే తప్ప, బాధిత కుటుంబానికి భరోసా కల్పించేలా తగిన చర్యలు కనిపించడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఘటనపై సమగ్ర దర్యాప్తు వేగవంతం చేసి నిందితులకు కఠిన శిక్ష పడేలా చూడాలని కోరారు. ఇలాంటి ఘటనలపై ప్రభుత్వం స్పందించకపోతే గిరిజన ప్రాంతాల నుంచి ఆడపిల్లలను చదువు, ఉద్యోగాలకు పంపడానికి తల్లిదండ్రులు భయపడే పరిస్థితి వస్తుందని హెచ్చరించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించకపోవడం, అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్నప్పటికీ ఈ అంశంపై చర్చించకపోవడం దురదృష్టకరమని విమర్శించారు. శిరీష కుటుంబానికి పూర్తి న్యాయం జరిగే వరకు ప్రభుత్వం బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఆదివాసీ సంఘాల నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## మట్టి వినాయకులను పూజిద్దాం పర్యావరణాన్ని కాపాడుదాం డాక్టర్ భీష్మచారి

ఓదెల పెద్దపల్లి సెప్టెంబర్ 10 అక్షరం న్యూస్

మట్టి వినాయకులను పూజిద్దాం పర్యావరణాన్ని కాపాడదామని సదా ఆశయ ఫౌండేషన్ సభ్యులు పిలుపునిచ్చారు ఈ సందర్భంగా ఓదెల గ్రామంలో సదా ఆశయ ఫౌండేషన్ జాతీయ కార్యదర్శి డాక్టర్ భీష్మ చారి ఆధ్వర్యంలో మట్టి వినాయకుల పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా బీచ్మచారి మాట్లాడుతూమట్టి వినాయకులను సాధ్యమైన తక్కువ ఎత్తులో వాడాలని..పర్యావరణహితంగా నవరాత్రులు జరిపిన ఉత్సవ కమిటీ సభ్యులను ఫౌండేషన్ ఆధ్వర్యంలో సత్కరించడం జరుగుతుందని అన్నారు ఫౌండేషన్ ఆధ్వర్యంలో నేత్ర అవయవ శరీర దానాలతో పాటు పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలను గత కొన్ని సంవత్సరాలుగా చేస్తూ సమాజ హితాన్ని కోరుతున్నది మీ అందరికి తెలిసిన విషయమే.. అందులో భాగంగా ఈ సెప్టెంబర్ 14 నాడు ప్రారంభం కానున్న వినాయక చవితి పండుగకు ఓదెల మండలంలో ..ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ వినాయకుల బదులు మట్టి వినాయకులను సాధ్యమైనంత ఎత్తు తగ్గించి వాడడం, ప్లాస్టిక్ గ్లాసులు ,బాటిల్స్ బదులు స్టీలు గ్లాసులు వాడడం,ప్లాస్టిక్ కోటెడ్ విస్తార్ల బదులు అరటి,మోదుగు ఆకు విస్తార్లు, స్టీలు ప్లేట్లు వాడడం,డీజే సౌండ్స్, బాణాసంచా నివారిస్తూ, తక్కువ ధ్వనితో భజనలు చేయడం, భక్తులు పూజా సామగ్రి తెచ్చుటకు ప్లాస్టిక్ సింగిల్ యూజ్డ్ కవర్లు వాడకుండా, స్టీలు, వెదురు బుట్టలు వాడుతూ మండపాలు పర్యావరణ హితంగా, పరిశుభ్రత పాటిస్తూ ఉన్న మండపాల నిర్వాహకులకు సదాశయ ఫౌండేషన్ ద్వారా అతిథులచే సత్కరించడం జరుగుతుంది. కావున ఓదెల మండలం భక్తులు, మండపాల నిర్వాహకులు ప్రతి సంవత్సరం సదాశయ ఫౌండేషన్ కు సహకరిస్తున్న విధంగా, ఈ వినాయక చవితి పండగ కూడా పర్యావరణ హితంగా జరిపి, ఓదెల మండలం ఇతర మండలాలకు ఆదర్శంగా నిలుచుటకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు




# పెద్దకొడుకుగా నిలిచిన ఎమ్మెల్యే జారె

- శిరీష కుటుంబానికి అండగా నిలిచి సోదరుడికి ఉద్యోగం అందించి ఆమె జ్ఞాపకాలను చిరస్థాయిగా నిలిపే బాధ్యత తీసుకున్న ఎమ్మెల్యే.



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా /ములకలపల్లి /సెప్టెంబర్ 10 /అక్షరం న్యూస్–:

కన్నబిడ్డను కోల్పోయిన ఆ కుటుంబానికి రాజకీయ నాయకుడిగా కాదు ఓ పెద్దకొడుకుగా అండగా నిలిచారు అశ్వారావుపేట నియోజకవర్గ గౌరవ ఎమ్మెల్యే జారె ఆదినారాయణ.

హైదరాబాద్‌లోని ప్రైమ్ కేర్ ప్రైవేట్ ఆసుపత్రిలో నర్సుగా విధులు నిర్వహిస్తూ దారుణ ఘటనలో ప్రాణాలు కోల్పోయిన ములకలపల్లి మండలం చౌటిగూడెం గ్రామానికి చెందిన ఆదివాసీ యువతి ఊకే శిరీష కుటుంబానికి ఆమె మరణం నుంచి నేటి వరకు ఎమ్మెల్యే జారె ఆదినారాయణ అండగా నిలుస్తూ వస్తున్నారు. దశదిన కార్యక్రమాన్ని ఆమె స్వగ్రామం చౌటిగూడెంలో గురువారం ఎమ్మెల్యే జారె ఆదినారాయణ పర్యవేక్షణలో నిర్వహించారు. శిరీష కుటుంబానికి అండగా నిలిచేందుకు ఆమె సోదరుడికి ఔట్సోర్సింగ్ ప్రాతిపదికన ప్రభుత్వ ఉద్యోగ నియామక పత్రాన్ని ఎమ్మెల్యే జారె ఆదినారాయణ స్వయంగా అందజేశారు. ఆ కుటుంబాన్ని ఆదుకోవడంలో భాగంగా ఇప్పటికే ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం ఇంటిస్థలం ఇందిరమ్మ ఇల్లు కూడా మంజూరు చేయించారు. శిరీషను కోల్పోయిన కుటుంబానికి భవిష్యత్తుపై భరోసా ఉండాలనే ఉద్దేశంతో నిరంతరం కుటుంబ సభ్యులతో సంప్రదింపులు జరుపుతూ అండగా నిలిచారు.

### శిరీష మరణంతో ఆగిపోకూడదు ఆమె ఆశయం.

శిరీష మరణం ఒక కుటుంబానికే కాదు సమాజానికి తీరని లోటని అన్నారు. ఆమె కుటుంబానికి జరిగిన నష్టాన్ని ఎవరూ పూడ్చలేరని అయితే ఆ కుటుంబానికి అండగా నిలవడం తన బాధ్యతగా భావిస్తున్నానని తెలిపారు. శిరీష ఈ లోకంలో లేకపోయినా ఆమె పేరు ఈ గ్రామంలో ఈ ప్రాంతంలో ఎప్పటికీ గుర్తుండి పోయేల చేయాలన్నదే తన సంకల్పమని స్పష్టం చేశారు. శిరీషకు ఉన్న ఆకాంక్షలు ఆమెకు ఇష్టమైన అంశాలను దృష్టిలో పెట్టుకుని గ్రామంలో ప్రజలకు ఉపయోగపడే అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ఆమె పేరు మీద చేపడతానని తెలిపారు. గ్రామస్తులకు చిరకాలం ఉపయోగపడే విధంగా కార్యక్రమాలను రూపొందించి ప్రతి అభివృద్ధి పనిలో శిరీష జ్ఞాపకం కనిపించేలా చర్యలు తీసుకుంటానని పేర్కొన్నారు. ఆదివాసీ నాయకులు, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు స్థానిక నాయకులు ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## నరాటి ప్రసాద్‌కు ఘన సన్మానం - శుభాకాంక్షలు తెలిపిన పువ్వాళ మంగపతి, డాక్టర్ నాగరాజు, పద్ధం నర్సింహా రావు.



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా/ ములకలపల్లి /సెప్టెంబర్ 10 /అక్షరం న్యూస్–:

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములకలపల్లికి చెందిన ప్రముఖ కార్మిక నేత కామ్రేడ్ నరాటి ప్రసాద్ ఏఐటీయూసీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికయ్యారు. విద్యార్థి దశ నుంచి ప్రజా ఉద్యమాల్లో క్రియాశీలకంగా ఉన్న ఆయన, గిరిజన భూ పోరాటాలు, కరోనా సేవలందించడంలో ముందున్నారు. ముఖ్యంగా మినీ అంగన్వాడీల వేతనాలు రూ. 6,500 నుండి రూ. 13,650కు పెరిగేలా పాదయాత్రలు, ఉద్యమాలు నిర్వహించి సాధించారు.

?యువ నాయకుడు రాష్ట్ర స్థాయికి ఎదిగిన సందర్భంగా ఆయనను గ్రామ పెద్దలు పువ్వాళ మంగపతి, డాక్టర్ నాగరాజు, పద్ధం నర్సింహా రావు తదితరులు ఘనంగా సత్కరించి శు భాకాంక్షలు తెలిపారు.

# విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా బెల్టుల పంపిణీ

- సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



హనుమకొండ జిల్లా / భీమదేవరపల్లి / సెప్టెంబర్ 10 / అక్షరం న్యూస్:

భీమదేవరపల్లి మండలంలోని మల్లారం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా అందజేసిన బెల్టులను గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉత్సాహంగా బెల్టులను స్వీకరించారు.ప్రభుత్వం విద్యార్థుల కోసం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని పాఠశాల ప్రధానోపాధ్యాయులు సూచించారు. విద్యార్థులు క్రమశిక్షణతో విద్యాభ్యాసాన్ని కొనసాగిస్తూ, ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా చాకలి ఐలమ్మ వర్ధంతి

- ఇంగిలే రామారావు
- హుజురాబాద్ నియోజకవర్గ ఇంచార్జ్
- జాతీయ బీసీ సంక్షేమ సంఘము



కరీంనగర్/ జమ్మికుంట/ సెప్టెంబర్ 10/ అక్షరం న్యూస్:

జమ్మికుంట లో ఇందిరానగర్ చౌక్ వద్దగల చాకలి ఐలమ్మ విగ్రహానికి జాతీయ బీసీ సంక్షేమ సంఘము హుజురాబాద్ నియోజకవర్గ ఇంచార్జ్ ఇంగిలే రామారావు ఆధ్వర్యంలో పూలమాలవేసి ఘనంగా నివాళు అర్పించారు.ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, సబ్బండ వర్గాల ఆత్మగౌరవానికి, మహిళా చైతన్యానికి ప్రతీక భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం పోరాడి తెలంగాణ తెగువను ప్రపంచానికి చాటిచెప్పి మహిళా లోకానికి స్ఫూర్తినిచ్చిన ధీరవనిత దొరల గడీలను ఎదురించి పోరాట పటిమ మనందరికీ స్ఫూర్తిదాయకం అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు అశోక్, గోపాల్, రెడ్డి, సందీప్, అన్వేష్, రాజు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం సన్నాహక భేటీ

- నేడు కమాన్ రోడ్ ప్రెస్ క్లబ్‌లో ముఖ్య నేతల భేటీ.



పెద్దపల్లి జిల్లా / పెద్దపల్లి టౌన్ / సెప్టెంబర్ 10 / అక్షరం న్యూస్ –:

ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం స్థాపించి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా స్వర్ణోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలని జాతీయ, రాష్ట్ర కమిటీలు నిర్ణయించాయి. ఈ ఉత్సవాల నిర్వహణకై వ్యూహరచన చేసేందుకు ఈ నెల 11న శుక్రవారం పెద్దపల్లి కమాన్ రోడ్డులోని ప్రెస్ క్లబ్‌లో జిల్లా స్థాయి సన్నాహక సమావేశం నిర్వహిస్తున్నట్లు సంఘం నాయకులు ప్రకటించారు. ఈ మేరకు గురువారం పెద్దపల్లి జిల్లా కేంద్రంలో నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో జాతీయ ఉపాధ్యక్షులు మామిడిపల్లి బాపయ్య, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొంకూరి మధు, జిల్లా అధ్యక్షుడు లంక సదయ్య పాల్గొని మాట్లాడుతూ స్వర్ణోత్సవ సన్నాహక సమావేశానికి జాతీయ, రాష్ట్ర స్థాయి ముఖ్య నేతలు హాజరవుతున్నారని తెలిపారు. జిల్లాలోని ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం జిల్లా, మండల కమిటీల నాయకులు, ముఖ్య కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జాతీయ కార్యదర్శి కొంకటి లక్ష్మణ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు మైస రాజేష్, కవ్వంపల్లి సతీష్,పాల రాజేశం, జిల్లా కో–కన్వీనర్లు ఆకునూరి బాల అంకుష్, శనిగరపు పోచన్న, ఆలయ ఫౌండేషన్ అడిషనల్ సీఈవో మిట్టపల్లి రాజేందర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు శ్రీకాంత్ గౌడ్




ఓదెల పెద్దపల్లి సెప్టెంబర్ 01 అక్షరం న్యూస్

చలో అసెంబ్లీ బిఆర్ఎస్ పార్టీ పిలుపుమేరకు బిఆర్ఎస్ నాయకులను ముందస్తు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ తరలించిన పోలీసులు పొత్కపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోగల వివిధ గ్రామాల పార్టీ కార్యకర్తలను అదేవిధంగా మడక గ్రామానికి చెందిన ఉద్యమకారుడు,బిఆర్ఎస్ యూత్ మండల అధ్యక్షులు మ్యాడగోని శ్రీకాంత్ గౌడ్ ను ఉదయం 5 గంటలకు అక్రమ అరెస్ట్ చేసి స్టేషన్ తరలించారు.

సందర్భంగా శ్రీకాంత్ గౌడ్ మాట్లాడుతూ నిరుద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో 2 లక్షల ఉద్యోగాలు, యువతకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి పిలుపునివ్వడం జరిగిందని దానికి మద్దతుగా టిఆర్ఎస్వి,యూత్ ఈ కార్యక్రమానికి మద్దతు తెలుపడంతో అక్రమంగా ఉదయం అరెస్టు అరెస్ట్ చేయడం సరైన పద్ధతి కాదని ఏదైతే ఎలక్షన్ల టైంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చినటువంటి హామీలు సంవత్సరానికి రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తానని చెప్పడం జరిగింది. నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి,విద్యార్థులకు 5 లక్షల విద్యా భరోసా కార్డు అదేవిధంగా విద్యార్థినిలకు స్కూటీలు ఇస్తానని ఇవ్వకపోవడం,నిరుపేద విద్యార్థులకు ఫీజు రీయాంబర్స్మెంట్ 12వేల కోట్ల బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూత్ నాయకులు జోంగోని వెంకటేష్ గౌడ్,గడ్డం అజయ్ తదితరులు పాల్గొన్నారు.

## రైతాంగ పోరాట మాతృమూర్తి సాకలి ఐలమ్మ



ఓదెల పెద్దపల్లి సెప్టెంబర్ 10 అక్షరం న్యూస్

ఓదెల రజక సంఘం ఆధ్వర్యంలో తెలంగాణ వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతి వేడుకనలు నిర్వహించి పూలమాల వేసి నివాళులు అర్పించారు ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ రైతాంగ పోరాట మాతృమూర్తి సాకలి ఐలమ్మ అని అన్నారు అంతే కాకుండా ఏడవనిజం నవాబు పాలనలో తెలంగాణ రైతులు ఎదుర్కొన్న దొరల దౌర్జన్యానికి బహుజనులు ఎదుర్కొన్న వివక్షను మహిళలు ఎదుర్కొన్న అన్యాయాలను ప్రతిఘటించిన చైతన్య జ్యోతి సాకలి. ఐలమ్మ అని అన్నారు ఆమె పోరాటం కేవలం భూమి కోసం కాదు ఆత్మగౌరవం కోసం సమానత్వం కోసం జరిగిన మహాసంగ్రామం బానిసత్వానికి తలగకుండా తాము సాగించిన భూమిపై హక్కు సాధించాలని సంకల్పంతో నాడు పేద రైతుల కూలీల సంఘటితమయ్యారు ఈ పోరాటంలో ఐలమ్మ ముందు నడిచి విజయం సాధించింది అటువంటి ఐలమ్మ జయంతిని జరుపుకోవడం చాలా సంతోషమని తెలంగాణ రైతన్న పోరాట స్ఫూర్తిని తిరిగి ప్రజల్లో నాటడమే ఆ స్ఫూర్తి నేడు కూడా సామాజిక న్యాయం కోసం భూమి హక్కుల కోసం సమాన హక్కుల కోసం పోరాడే వారికి ప్రేరణ ఇస్తుందని అని అన్నారు ఆమె చూపించిన బాటలోనే నడిచి ఆమె ఆశయాలను ప్రతి ఒక్కరు అనుసరించాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో సర్పంచ్ సతీష్ కనికి రెడ్డి మాజీ సర్పంచ్ ఆకుల మహేందర్. కార్యదర్శి వెంకట లక్ష్మణ్ ఉపసర్పంచ్ ప్రవీణ్ వార్డు సభ్యులు చింతం కుమారస్వామి అప్పని తిరుపతి పెరక సంఘం అధ్యక్షులు కాని గంటి శంకరయ్య మెరుగు రంగన్న నాగపురి రవి రామంచ అనిల్ చెరుకు శంకర్ చెరుకు శ్రీనివాస్ వంగరి చందు తీర్థాల కుమార్ రామినేని రాజేంద్రప్రసాద్ రజక సంఘం అధ్యక్షులు పైడిపల్లి రమేష్ ఉపాధ్యక్షుడు శాతాల విష్ణు సంఘం పెద్దలు మేడిచర్ల చంద్రయ్య రామడుగు వెంకటేష్ మడికొండ వీరయ్య చతల్ల రామస్వామి చేతల శ్రీనివాస్ చాతల రవి శాతల్లా సమ్మయ్య రామడుగు మల్లయ్య కుమార్ మడికొండ రాకేష్, రామడుగు శ్రీనివాస్ శాతల వెంకటేష్ ఎలబోతారం శ్రవణ్ మడికొండ వెంకటేష్, రామడుగు బుచ్చయ్య మరియు చంద్రయ్య తోపాటు తదితరులు పాల్గొన్నారు

## విద్యార్థులు నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలి

● మున్సిపల్ కమిషనర్ తుంగపిండి రాజలింగు.



మంచిర్యాల జిల్లా/ మందమర్రి, సెప్టెంబర్ 10/ అక్షరం న్యూస్ –:

మందమర్రి పట్టణంలోని శ్రీ చైతన్య పాఠశాలలో 2026–27 విద్యా సంవత్సరానికి సంబంధించిన ఇన్వెస్టిచర్ సెర్మనీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ కమిషనర్ తుంగపిండి రాయిలింగు హాజరై విద్యార్థుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం విద్యార్థి ఎన్నికల్లో ఎన్నికైన ప్రతినిధులకు బ్యాడ్జీలు, శాలువాలు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, బాధ్యతాయుత భావన, క్రమశిక్షణ, కర్తవ్య నిర్వహణను పెంపొందించడమే ఇన్వెస్టిచర్ సెర్మనీ ప్రధాన లక్ష్యమని తెలిపారు. భవిష్యత్తులో సమాజానికి ఆదర్శవంతమైన నాయకులుగా ఎదగాలంటే చిన్నప్పటి నుంచే నాయకత్వ నైపుణ్యాలను అలవర్చుకోవాలని సూచించారు. పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు ఎస్. రమేష్ మాస్టర్ సేవలను ప్రశంసిస్తూ అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎం. రమేష్, డీన్ కె. రవితేజ, ప్రైమరీ ఇంచార్జ్ సునీత, పీపీటీ ఇంచార్జ్ తిరుమల, జోనల్ ఇంచార్జ్ రాజేందర్ పాల్గొన్నారు. పాఠశాల ఛైర్మన్ శ్రీధర్, డైరెక్టర్ శ్రీలక్ష్మి, జోనల్ ఏజీఎం అరవిందర్ రెడ్డి, కోఆర్డినేటర్ నాగరాజులు విద్యార్థులను అభినందించి వారి భవిష్యత్తుకు శుభాకాంక్షలు తెలిపారు.

## పామాయిల్ ఫ్యాక్టరీని పరిశీలించిన మున్సిపల్ వైస్ చైర్మన్ జూపల్లి రమేష్ బాబు

● రైతులు, ట్రాక్టర్ యజమానులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలి



భద్రాద్రి కొత్తగూడెం /అశ్వారావుపేట/సెప్టెంబర్ 10/అక్షరం న్యూస్ : అశ్వారావుపేట మున్సిపాలిటీ పరిధిలోని పామాయిల్ ఫ్యాక్టరీలో స్టాక్ నిలిచిపోవడంతో లోడు తీసుకువచ్చిన ట్రాక్టర్లతో రైతులు ఇబ్బందులు పడుతున్నారన్న సమాచారం అందడంతో మున్సిపల్ వైస్ చైర్మన్ జూపల్లి రమేష్ బాబు ఫ్యాక్టరీ వద్దకు వెళ్లి పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఫ్యాక్టరీలో స్టాక్ నిలిచిపోవడం వల్ల రైతులు, ట్రాక్టర్ యజమానులు ఇబ్బందులు పడకుండా తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. రైతులు తీసుకొచ్చే పామాయిల్ గెలలను ఎప్పటికప్పుడు దించుకునేలా చూడాలని, ఫ్యాక్టరీలో నిల్వలు పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు ఇతర ప్రాంతాలకు తరలించేలా చర్యలు చేపట్టాలని అధికారులను కోరారు. రైతులు తమ పామాయిల్ గెలలను ఫ్యాక్టరీకి తీసుకొచ్చిన అనంతరం ఎక్కువ సమయం వేచి ఉండాల్సిన పరిస్థితి లేకుండా చూడాలని, గెలల దింపుదల ప్రక్రియ సజావుగా జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జూపల్లి రమేష్ బాబు సూచించారు. రైతుల సమస్యలను దృష్టిలో ఉంచుకుని ఫ్యాక్టరీ అధికారులు, సంబంధిత సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని కోరారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పామాయిల్ గెలల స్వీకరణ, నిల్వ, తరలింపు ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో అశ్వారావుపేట మండలానికి చెందిన రైతులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పాలనలో తీవ్ర దివాళా దిశగా తెలంగాణ

● 10 సంవత్సరాల కెసిఆర్ పాలనలో సంక్షేమం అభివృద్ధి.

● బిఆర్ఎస్ మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్.



పెద్దపల్లి జిల్లా / పెద్దపల్లి టౌన్ / సెప్టెంబర్ 10 / అక్షరం న్యూస్ –:

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి తెలంగాణ తీవ్ర దివాళా దిశగా పయనిస్తోందని, తెలంగాణ ప్రయోజనాలను పక్కనపెట్టి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆదేశాలకు గులాంగిరీ చేస్తోందని మాజీ మంత్రివర్యులు వి. శ్రీనివాస్ గౌడ్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. గురువారం రోజున పెద్దపల్లి పట్టణంలోని 'సర్వాయి పాపన్న' విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం, స్థానిక బిఆర్.ఎస్ జిల్లా కార్యాలయంలో పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ?ఈ సందర్భంగా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ, తెలంగాణలో అన్నీ సిద్ధంగా ఉన్నప్పటికీ కాళేశ్వరం, పాలమూరు– రంగారెడ్డి ప్రాజెక్టుల మోటార్లను కావాలనే ఆన్ చేయడం లేదని మండిపడ్డారు. కాళేశ్వరంలో చిన్న పిల్లర్ రిపేర్ చేయిస్తే సరిపోయే దానికి, కేవలం కేసీఆర్ పై కక్షసాధింపుతో ఉత్తర తెలంగాణ మొత్తాన్ని ఎండబెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాళేశ్వరంలో ఎలాంటి అవినీతి జరగలేదని కేంద్ర సంస్థల నివేదికలు కూడా స్పష్టం చేసిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. శ్రీశైలంలో డ్రింకింగ్ వాటర్ పేరు చెప్పి తెలంగాణకు నీళ్లు ఇవ్వకుండా, మరోవైపు పోతిరెడ్డిపాడు, వెలుగొండ టన్నెల్స్ ద్వారా రోజుకు 1–2 టీఎంసీల నీటిని ఆంధ్రప్రదేశ్‌కు తరలిస్తుంటే ఈ ప్రభుత్వం కనీసం ప్రశ్నించకుండా చూస్తూ ఊరుకుంటోందని విమర్శించారు. ?ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేక, ముఖం చెల్లకుండా కేసీఆర్ పై అబాండాలు వేస్తున్నారని ఆయన దుయ్యబట్టారు. విద్యార్థులు, నిరుద్యోగులు సభలు పెట్టుకుంటామంటే పర్మిషన్ ఇవ్వని ప్రభుత్వం, కేసీఆర్ ఫామ్‌హౌస్‌పై దాడులు చేయడానికి ప్రోత్సహిస్తోందని ఆరోపించారు. తెలంగాణ తెచ్చిన నాయకుడిని, కేసీఆర్ ని ముట్టుకుంటే తెలంగాణ మళ్లీ అగ్నిగుండం అవుతుందని, అలాంటి కుట్రలు చేస్తే ఎవ్వరూ మిగలరని హెచ్చరించారు. అలాగే జిల్లాల్లో భూ దాహంతో కోటి ఎకరాల భూములను 22అ నిషేధిత జాబితా కింద పెట్టి రైతులను, ప్రజలను వేధిస్తున్నారని, ఎవ్వరూ భయపడి భూములను లేదా పర్సంటేజీలను నాయకులకు, అధికారులకు ఇవ్వవద్దని కోరారు. మళ్ళీ కేసీఆర్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే 22అ నిబంధనలను, హైడ్రాని పూర్తిగా రద్దు చేసి పాతాళ గంగలో కలిపేస్తామని అభయమిచ్చారు. ?కొంతమంది ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు రాజకీయ నాయకుల మాటలు విని చట్టవిరుద్ధంగా వ్యవహరిస్తే రేపు జైలుపాలు కావాల్సి వస్తుందని తీవ్రంగా హెచ్చరించారు. నిరుపేదల దగ్గర, అక్రమంగా సంపాదించిన ప్రతి రూపాయిని ఒంగబెట్టి కక్కిస్తామని, చట్టబద్ధంగా అధికారుల జాబితా తయారు చేసి చర్యలు తీసుకుంటామన్నారు. కేసీఆర్ కిట్, రైతుబీమా, రైతుబంధు లాంటి సంక్షేమ పథకాలను రద్దు చేసి, బి సీ సబ్‌ప్లాన్, 42% రిజర్వేషన్లు, గొర్రెల పంపిణీ వంటి హామీలను గాలి కొదిలేశారని ధ్వజమెత్తారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం విర్రవీగడం మానేసి, పరిపాలన, ఉద్యోగ రిక్రూట్‌మెంట్లు, ఫీజు రీయింబర్స్‌మెంట్, సంక్షేమ హామీల నెరవేర్పుపై దృష్టి పెట్టాలని డిమాండ్ చేశారు. మేమంతా జైళ్లకు, కేసులకు భయపడకుండా గొంతు పట్టి తెలంగాణ తెచ్చుకున్నామని, అధికారం ఉందని ఇష్టారాజ్యంగా ప్రవర్తిస్తే ప్రజలే సరైన సమయంలో బుద్ధి చెబుతారని స్పష్టం చేశారు. ?ఈ విలేకరుల సమావేశంలో జిల్లా బి.ఆర్.ఎస్ ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు మరియు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రవీందర్ కుటుంబానికి 1996 బ్యాచ్ కానిస్టేబుల్ తరపున రూ.లక్ష నగదు అందజేత



చిగురుమామిడి/సెప్టెంబర్ 10, అక్షరం న్యూస్,

గత వారం రోజుల క్రితం అనారోగ్యంతో అకాల మరణం చెందిన ప్రముఖ రాజకీయ నాయకుడు చిగురుమామిడి మాజీజడ్పీటీసీ సభ్యుడు గీకురు రవీందర్ కుటుంబానికి ఆయన సహచర 1996కానిస్టేబుల్ బ్యాచ్ మిత్రులు అండగా నిలిచారు. గురువారం రవీందర్ స్వగృహంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి,కుటుంబ సభ్యులను పరామర్శించి,రవీందర్ మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రవీందర్ కూతుళ్లకు లక్ష రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బ్యాచ్ ప్రతినిధులు మాట్లాడుతూ 1996సంవత్సరంలో కానిస్టేబుల్‌గా గీకురు రవీందర్ తమతోపాటు విధుల్లో చేరారని గుర్తుచేసుకున్నారు. ట్రైనింగ్ సెంటర్ నుంచే ఆయన అద్భుతమైన నాయకత్వ లక్షణాలను ప్రదర్శించి,మొత్తం బృందానికి నాయకత్వం వహించారని కొనియాడారు. సిరిసిల్లలో పోలీస్ ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించిన అనంతరం,తెలంగాణ స్వరాష్ట్ర సాధనే ధ్యేయంగా,ప్రజాసేవ చేయాలనే బలమైన సంకల్పంతో తన ఉద్యోగానికి రాజీనామా చేశారని తెలిపారు. ఆ తర్వాత రాజకీయాల్లోకి ప్రవేశించి చిగురుమామిడి మండలంలో రెండు సార్లు సర్పంచ్‌గా, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడిగా,చిగురుమామిడి జడ్పీటీసీగా ప్రస్తుతం కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడిగా ఆయన అందించిన సేవలు మరువలేనివన్నారు. రవీందర్ హఠాన్మరణం తమకు,ఆయన కుటుంబానికి,చిగురుమామిడి మండల ప్రజలకు తీరని లోటని తీవ్ర విచారం వ్యక్తం చేశారు. గతంలో రవీందర్ ప్రోద్బలంతోనే తామంతా ఒక సంఘంగా ఏర్పడి, ప్రతి నెలా కొంత మొత్తాన్ని పొదుపు చేస్తున్నామని వారు పేర్కొన్నారు. ఆ నిధి నుంచే గురువారం రవీందర్ కుటుంబానికి ఈ ఆర్థిక సహాయాన్ని అందించినట్లు తెలిపారు. భవిష్యత్తులో కూడా రవీందర్ ఇద్దరు పిల్లల చదువు, భవిష్యత్తు విషయాల్లో తమ బ్యాచ్ తరపున ఎలాంటి సహాయం చేయడానికైనా ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటామని స్నేహితులు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు వావిలాల మల్లారెడ్డి,ముదిరాజ్ సంఘం పెద్దమనిషి చెరుకు చిన్నసమ్మయ్య,గుండా కృష్ణకుమార్ గౌడ్, పుప్పాల శ్రీనివాస్, శంకర్ రెడ్డి, ముత్యాల బ్రహ్మయ్య, కనకయ్య, దామోదర్ రెడ్డి, కాంతారావు, సదాచారి,సుధాకర్ తదితర బ్యాచ్ సభ్యులు పాల్గొన్నారు.

## అఫ్గాన్, ఆసియా గేమ్స్ భారత జట్టులో మార్పులు

**గాయంతో దూరమైన పేసర్ హర్షిత్ రాణా**

**జట్టులో చోటు సంపాదించిన యష్ ఠాకూర్**




అఫ్గనిస్థాన్‌తో సెప్టెంబర్ 13 నుంచి ప్రారంభం కానున్న 3 మ్యాచ్‌ల టీ20 సిరీస్, ఆ తర్వాత జరగనున్న ప్రతిష్టాత్మక ఆసియా గేమ్స్ కోసం భారత జట్టులో బీసీసీఐ కీలక మార్పు చేసింది. గాయం కారణంగా జట్టుకు దూరమైన యంగ్ పేసర్ హర్షిత్ రాణా స్థానంలో విదర్భ పేసర్ యష్ ఠాకూర్‌ను ఎంపిక చేశారు. గత జులైలో జింబాబ్వే పర్యటనలో అంతర్జాతీయ అరంగేట్రం చేసిన యష్‌కి ఇది రెండో టీ20 సిరీస్ కావడం విశేషం. బెంగళూరులోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో రీహ్యాబిలిటేషన్ పొందుతున్న హర్షిత్ రాణాకు మరోసారి తీవ్ర గాయమైంది. సెప్టెంబర్ 7న జరిగిన మ్యాచ్ సిమ్యులేషన్ సందర్భంగా బౌలింగ్ చేస్తుండగా అతడికి రెక్టస్ ఫెమోరిస్ (తొడ ముందు భాగం) కండరం పట్టేసిందని బీసీసీఐ వైద్యాధికారులు ధృవీకరించారు. గతంలో తొడపిక్క గాయంతో బాధపడిన రాణా, కోలుకునే క్రమంలోనే ఈ కొత్త గాయం బారిన పడటంతో అఫ్గన్ సిరీస్‌తో పాటు ఆసియా గేమ్స్‌కు కూడా పూర్తిగా దూరమయ్యాడుడోమెస్టిక్ క్రికెట్‌లో సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో కేవలం 7 మ్యాచ్‌ల్లోనే 18 వికెట్లు తీసి అందరి దృష్టిని ఆకర్షించాడు యష్ ఠాకూర్ . ఆపై జింబాబ్వే పర్యటనలో 2 మ్యాచ్‌లు ఆడి 4 వికెట్లు పడగొట్టాడు. డెత్ ఓవర్లలో కచ్చితమైన యార్కర్లు వేయగల సామర్థ్యం ఉన్న యష్ రాకతో భారత పేస్ విభాగం బలంగా మారింది. సెప్టెంబర్ 13 నుంచి ప్రారంభమయ్యే అఫ్గన్ సిరీస్ పూర్తయ్యాక, ఆసియా గేమ్స్‌కు ముందు భారత్ ఒక చారిత్రక మ్యాచ్‌లో జపాన్‌తో కూడా తలపడనుంది. మరోవైపు ఫిట్‌నెస్ నిరూపించుకున్న స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా, ఆల్‌రౌండర్లు నితీశ్ కుమార్ రెడ్డి, వాషింగ్టన్ సుందర్‌లను బీసీసీఐ అప్‌డేటెడ్ స్క్వాడ్‌లోకి అధికారికంగా చేర్చింది. శ్రేయస్ అయ్యర్ సారథ్యంలో, తిలక్ వర్మ వైస్ కెప్టెన్‌గా భారత జట్టు బరిలోకి దిగుతోంది. సెప్టెంబర్ 13న ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియంలో అఫ్గనిస్థాన్‌తో తొలి టీ20 మ్యాచ్ జరగనుంది. ఆ తర్వాత ఆసియా గేమ్స్ జరగనున్నాయి.

Printed, Published and Owned by Shaik Yacoob Pasha, Published at 7-4-29, Medarabasti Kothagudem, Bhadradri Kothagudem Districrt-507 101, Telangana. Printed at SUPHALA AKSHARAM Printers, RNI ref.no PRESS/2026/126/7878/00001375, e-mail: aksharamnewsts@gmail.com, Editor: SHAIK YACOOB PASHA, RNI NO. TELTEL/2018/75419, e-mail: aksharamtsnews@gmail.com. Mobile : 9391690609